ఏప్రిల్ 2020 రూ. 20

# మైత్రేయం

## సంకల్ప బలం

సామాజిక విలువల మాసపత్రిక

కరోనా వైరస్ ని తరిమికొట్టడానికి సిద్ధమైన 130 కోట్ల భారతీయుల మనో సంకల్ప దీపాలు



వీరి సేవలు అపూర్వం








వ్యవస్థాపక సంపాదకురాలు

**తీగవరపు శాంతి**



# చైతన్యం

సంకల్ప బలం

**సామాజిక విలువల మాస పత్రిక**

సంపుటి -9 **ఏప్రిల్ 2020** సంచిక - 7


## ఈ సంచికలో


| | |
|---|---|
| సంపాదకీయం | 4 |
| అభిప్రాయ వేదిక | 5 |
| పూరి జగన్నాధస్వామి వైభవం | 6 |
| సప్త మోక్ష నగరాలు | 11 |
| హాస్య బ్రహ్మ జంధ్యాల | 13 |
| రాజు పోయి మంత్రి వచ్చె | 15 |
| శ్రీసూక్తం | 17 |
| కరోనా | 19 |
| ఎనిమిదవ రాష్ట్రపతి | 20 |
| వేమూరి వారి పాకశాస్త్రం | 24 |
| ప్రేమంటే ఇంతే | 27 |
| మాస్కులు ---పొడిదగ్గు | 32 |
| గడిలో దాగిన వైజ్ఞానిక నుడి | 33 |
| తెలుగు పద్య రత్నాలు | 35 |
| గర్వం పతన హేతువు | 37 |
| ఎర్ర బస్సు | 39 |
| మా ఊరి నందుల కథ | 41 |
| కవి, కలెక్టరు జె బాపురెడ్డి | 43 |
| మతలబుల మనిషి | 45 |
| ప్రహేళిక | 50 |



రచనలలోని అభిప్రాయాలు రచయితలవి మాత్రమే. పత్రిక యాజమాన్యానికి ఎటువంటి సంబంధమూ లేదు.

# కరోనాపై పోరులో సామూహిక శక్తి

ప్రపంచ ప్రజలందరినీ గజ గజ లాడిస్తున్న 'కరోనా వైరస్' చైనాలో పుట్టి అక్కడ నుండి ఇటలీ, అలాఅలా 195 దేశాలకు పాకి, ప్రజలను ఎందరినో రోగ గ్రస్తులుగా తయారు చెయ్యడమే కాక, ఎంతో మంది ప్రాణాలు కూడా బలిగొంటోంది. ఎంతో గొప్ప దేశం, ఎంతో అభివృద్ధి చెందిన దేశం అయిన అమెరికా సయితం కరోనాకు తలవంచక తప్పలేదు. ఎందరివో ప్రాణాలు పోతున్నా, ఏమీ చెయ్యలేక మహా మహులైన వైద్యులు కూడా చేతులు ముడుచుకుని కూర్చున్నారు. ఇటువంటప్పుడు గుర్తుకు వచ్చేది ప్రకృతి. మన భారతీయ వైద్య విధానం. మన వంటిల్లు. ఇప్పుడు మన భారతీయ వైద్యం అయిన ఆయుర్వేదం కూడా చాలా ఉపయోగపడుతుంది అని వాడుతున్నారు. అలాగే భారత దేశ సంస్కృతి, సాంప్రదాయాలు ఎంత గొప్పవో, ప్రపంచ దేశాలు కూడా విలువ తెలుసుకుని ఆచరించడం మొదలు పెట్టాయి. మన భారతీయులకు కూడా చాలా మందికి, మన దేశ విలువలు, గొప్పతనం తెలిసి వస్తున్నాయి.

"కరోనా" మహమ్మారి ప్రపంచ ప్రజలందరినీ చీకట్లోకి నెట్టేస్తున్న తరుణంలో ఆర్థికంగా బీద దేశం, అత్యధిక జనాభా ఉన్న మన దేశంలో మనల్ని కూడా వదిలి పెట్టక ఆవహించింది.ముందుగా ఒక వ్యక్తికి సోకేసరికే అటు ప్రభుత్వం మీడియా రచ్చరచ్చ చేసే సరికి, ప్రజలు ముందు నుండీ బాగా ఎలర్ట్ అయ్యారు. ఇటువంటి తరుణంలో ప్రభుత్వం ఎంతో జాగ్రత్తగా ఎవరి ఇళ్లల్లో వాళ్ళు ఉండండి. సామూహికంగా ఎవరూ కలవద్దు. ఒక మనిషి నుండి మరొకళ్ళకి స్పర్శ ద్వారా వచ్చే వ్యాధి కాబట్టి అందరూ తప్పక ఈ నియమం పాటిస్తూ శుభ్రతకు ప్రాధాన్య మివ్వాలని సూచించి, దేశ మంతా లాక్ డౌన్ ప్రకటించింది. 'మనకి ఇంతకంటే వేరే మార్గం లేదు మన ప్రాణాలు కాపాడుకోవాలంటే' అని చేసిన గొప్ప ఆలోచనను WHO కూడా ప్రశంసించింది. లేదంటే మన దేశ పరిస్థితి ఉహించడం కుడా కష్టం.విమానాలతో సహా అన్నీ బంద్.

ఇక్కడ మనం ఇంకో విషయం కూడా ఎప్పుడూ మరచిపోకూడదు. భగవంతుడు మనతో పాటు ఈ సృష్టిలో 84 లక్షల జీవరాసుల్ని కూడా సృష్టించాడు. మన మందరం హాయిగా జీవించడానికి చక్కని ప్రకృతిని ప్రసాదించాడు. కానీ మనలో అత్యాశఎక్కువై, అంతా మనం, మన కుటుంబాలే అన్నీ అనుభవించాలనే దురుద్దేశంతో, జీవరాసుల్ని కానీ, ప్రకృతిని గానీ లెక్క చెయ్యక అన్నిటినీ అంతం చేసి అయినా సరే అంతా నేనే అనుభవించాలనే దురుద్దేశం ఇపుడు మనం అనుభవిస్తున్న పాపానికి తార్కాణం అని చెప్పక తప్పదు. భగవంతుడనే తండ్రికి జీవ రాశులతో సహా అందరం సమానమే. కానీ మన దుర్గుణాన్ని, మన స్వార్థాన్ని భరించలేక వేసిన శిక్ష ఇది. ఇప్పటికైనా మనకి జ్ఞానోదయం అవ్వాలిగా! ఈ మాత్రం అయినా ఉన్నాం అంటే కొందరి పుణ్యాత్ముల ధర్మం అని చెప్పక తప్పదు

ప్రభుత్వం, డాక్టర్లు, పోలీసులు , చెప్పినట్లు విని వారు చెప్పినవి తూచా తప్పకుండా ఆచరిస్తూ, దేశంలోని ప్రజలంతా ఎవరి ఇంటి నుండి వారు కదలకుండా పాటిస్తున్న సమయంలో, ఆధ్యాత్మికంగా ఆలోచించో, ప్రజలను హుషారు చెయ్యడంలో భాగంగానో ఒక ఆదివారం మార్చి 22న అందరూ బయటకు వచ్చి తప్పట్లతో డాక్టర్లకి, పోలీసులకీ, పారిశుద్ధ్య సిబ్బందికి కృతజ్ఞతలు తెలియ జేయమని చెప్పింది ప్రభుత్వం. అంతే కాదు. మరల ఏప్రిల్ 5న దీపాలు వెలిగించమని ప్రజల్లో దైవ భక్తిని, దేశ భక్తిని పెంపొందించింది. ఇంత లాక్ డౌన్ ఉన్నా, ఇన్ని మతాలూ, ఇన్ని కులాలు, ఇన్ని రాజకీయ పార్టీలు ఉన్నా ... ఇన్ని రకాల మంది ప్రజలం అనే సంగతి అందరూ మరచి పోయి, 130 కోట్ల మంది ప్రజలు భిన్నత్వం లో ఏకత్వం చాటుతూ మన ప్రధాన మంత్రి చెప్పిన పద్ధతినే పాటిస్తూ ప్రపంచానికే ఆదర్శంగా నిలిచారు.

తీగవరపు శాంతి

# అభిప్రాయ వేదిక

1. కవర్ పేజీ లన్నీ చాలా అద్భుతంగా వేస్తున్నారు. ఎడిటోరియల్, అలాగే పూరి జగన్నాథుని మహత్యం గురించి చాలా బాగా వ్రాస్తున్నారు. పూరి లో జగన్నాధుడు, టీవీ లో చూపిస్తుంటే రథ యాత్ర చూడడం తప్పితే మాకు అంతగా వివరాలు తెలియవు. చాలా వివరంగా వ్రాస్తున్నారు పోచిన పెద్ది మురళీ కృష్ణ గారు.
శ్రీ రమణారావు, శ్రీ కమలేష్ , శ్రీమతి హైమావతి గారు ----- పూనా , శ్రీ సతీష్ , శ్రీమతి వైజయంతి.
2. పోడూరి శ్రీనివాస రావుగారు రాజబాబు గురించి వ్రాసి, మాకు ఆరోజుల్లో సినిమాలు, వారి హాస్యం అన్నీ గుర్తు చేసి ఎన్నెన్నో విషయాలు చెప్పారు. వసంతానికి నాంది ఫాల్గుణం అంటూ ఆది లక్ష్మి యే సృష్టి స్థితి లయ కారిణి అంటూ బాగా వివరించారు కొత్త రామానందం గారు.
శ్రీమతి లక్ష్మి, శ్రీమతి వసుంధర , శ్రీ మాధవరావు ---వైజాగ్. శ్రీ రామానుజం, శ్రీమతి ఉష ---- ఏలూరు .
3. నక్కకి తోడేలుకీ జన్మించిన చిత్రమైన జాతివాడు అంటూ కథను అరణ్యం లోకి తీసుకు వెళ్లి అరిదమనుడి కథ చాలా అద్భుతంగా వ్రాసారు . ఎలాగైనా "భువన చంద్ర "గారి రచన స్పెషల్ గా అనిపిస్తుంది. శ్రీ సూక్తం గురించి "పాలకుర్తి రామమూర్తి" గారు వ్రాసింది చదువుతుంటే ఆ ఆది శక్తి జగత్తంతా వ్యాపించి, ఆ ఆనందాన్ని వారు మనకే అందిస్తున్నంత ఆనందం కలిగింది.
శ్రీమతి లత , శ్రీమతి శాంతి , శ్రీ వేణు మాధవ్ --- రాజోలు. శ్రీ సుబ్బారావు , శ్రీ శ్రీను, శ్రీమతి సబిత ----- కర్నూలు.
4. "జ్ఞాని జైల్ సింగ్" సిక్కు మత గ్రంథ పారాయణం చేయడం, కీర్తనలు పాడడం సిక్కు మత ప్రచారం గురించి చాలా బాగా వ్రాసారు. వారు చేసిన ఎన్నో అద్భుతమైన త్యాగాలకు ఫలితంగా 7 వ రాష్ట్ర పతిగా మన దేశం గుర్తించడం మన అదృష్టంగా భావించాలి అంటూ బాగా వ్రాసారు. "వేమూరి వారి పాక శాస్త్రం" వారు ఎంచుకున్న విషయం చాలా ఉపయోగమైనది. వంటలలో ఏ నూనె వాడాలి అనేది చాలా మందికి రక రకాల అపోహలు. అన్నీ పోగొడుతూ వివరంగా బాగా వ్రాసారు.
శ్రీమతి మధు, శ్రీమతి అను, శ్రీ రమేష్ ---- రాయపూర్. శ్రీమతి చంటి, శ్రీమతి నాగలక్ష్మి, శ్రీ కమలేష్ ----- బొంబాయి.
5. "ప్రేమంటే ఇంతే" లో ఇంద్రగంటి సుబ్బారావు గారు ప్రేమ కి, ఆకర్షణ కీ తేడా, వయస్సుల ప్రభావాలు, చదువు మీద చూపించ వలసిన శ్రద్ధ గురించి బాగా తెలియ జేశారు. "శ్రీమతి సత్యవతి" గారు వ్రాసిన కాకి -- అప్పడం కథ పల్లెటూరును గుర్తు చేస్తూ బాగా వ్రాసారు. మన మూలాలను మరచి పోవద్దు అని బాగా చెప్పారు.
శ్రీ రామానందం, శ్రీమతి స్మిత, శ్రీ మధు ---- కామవరప్పాడు. శ్రీమతి పల్లవి, శ్రీమతి జయశ్రీ, శ్రీ ప్రభాకర్ ---- హైదరాబాదు.
6. "డా. చాగంటి కృష్ణ కుమారి " గారి గడిలో దాగిన వైజ్ఞానిక నుడి చాలా విజ్ఞానక దాయకంగా ఉంటోంది. ఆర్ . శర్మ దంతుర్తి గారు ప్రజలకు అందిస్తున్న అద్భుతమైన పద్య రత్నాలు చదువుతుంటే ఎంతో ఆసక్తి కరంగా ఉంటున్నాయి కథలు కూడా చాలా ఆసక్తి గా ఉంటున్నాయి.
శ్రీమతి శాంతి రత్న, శ్రీమతి సుబ్బలక్ష్మి, శ్రీ మహేష్ ---- కడప. శ్రీ పరమేశ్వర రావు, శ్రీమతి అపర్ణ, శ్రీమతి విద్య ---- వరంగల్.
7. "బడాయి" కథ ద్వారా కొందరు పిల్లల్లో ఉండే గర్వం గురించి తెలియజేస్తూ బాగా వ్రాసారు ఆదూరి హైమవతి గారు. పిల్లలకు ఎన్నెన్నో మంచి కథలు అందిస్తున్నారు. నందుల ప్రభాకర శాస్త్రి గారు నందుల ఆత్మీయ కథలో భాగంగా ఆ రోజుల్లో వీధినాటకాల, తోలు బొమ్మలాటలు బాగా గుర్తు చేశారు.
శ్రీ సుధాకర రావు, శ్రీమతి వల్లి, శ్రీమతి లలిత ---- కాకినాడ. శ్రీ సత్యన్నారాయణ, శ్రీమతి సుధ, శ్రీ వర్మ ----- పాలకొల్లు.
8. తుమ్మూరి రాం మోహనరావు గారు సాహితీ రత్న, సహస్ర చంద్ర దర్శన ప్రాప్త వరిష్ఠుడు అయిన "శ్రీమాన్ భాష్యం విజయ సారధి" గారు గురించి వ్రాయడం చాలా సంతోషంగా అనిపించింది. చాలా ఆనందం కూడా కలిగింది అనడంలో అతిశయోక్తి లేదు. ఎలక్ట్రాన్ గారు వ్రాసిన కథ "మధ్యింటి మిద్దె అను మిధ్య" చాలా బావుంది. టైటిల్ కొత్తరకంగా ఉంది.
శ్రీమతి పవిత్ర, శ్రీ చంద్ర శేఖర్, శ్రీ రామ కృష్ణ ----- ఖమ్మం. శ్రీమతి సుష్మ, శ్రీమతి సాహితి, శ్రీ గిరిధర్ ----హైదరాబాదు .
9. ప్రహేళిక " చాలా ఇంట్రెస్ట్ గా కరోనాకి సంబంధించి చాలా బాగా ఇచ్చారు. పత్రికలో కవర్ పేజీలతో సహా అన్నీ బావుంటున్నాయి రచయితలు, రచయిత్రులు ప్రతీది చాలా విజ్ఞాన దాయకంగా వ్రాస్తున్నారు. సామాజిక దృక్పథంతో వ్రాయడం హర్షణీయం.
శంకరరావు, ఉమ, రామారావు, లక్ష్మి , విజయవాడ

# పూరి జగన్నాధ స్వామి వైభవం

డా.పోచనపెద్ది వెంకట మురళీ కృష్ణ



**పూరి జగన్నాధుని రధయాత్ర తెలుగువారికి అత్యంత ప్రీతి పాత్రమైనది. కాని ఆ స్వామికి సంబంధించిన పురాణగాధ సంపూర్ణంగా కొద్దిమందికి మాత్రమే తెలుసు.**

**స్కాందపురాణాంతర్గతమైన జగన్నాధ క్షేత్ర మాహాత్మ్యాన్ని యధామూలంగా, సరళ, వ్యావహారిక భాషలో అనువదించి మన పాఠకులకు ప్రతి నెల అందిస్తున్నాము. చదవండి, చదివించి మోక్షాన్ని పొందడి.**

**- సంపాదకురాలు**

(గత సంచిక తరువాయి)

“బ్రాహ్మణోత్తమా! మీరు ఎప్పుడు పురుషోత్తమ క్షేత్రానికి వెళ్ల లేదు కదా! మీకు ఈ విషయాలు ఎలా తెలిసాయి?” అని ఇంద్ర ద్యుమ్నుడు విద్యా పతిని అడిగాడు. రాజా! మీ ఆజ్ఞ ప్రకారం పురుషోత్తమ క్షేత్రానికి చేరుకున్నాను. అక్కడ నాకు ఒక బోయవానితో స్నేహం ఏర్పడింది. అతడునన్నుజనార్ధనుడుఉన్న ప్రదేశానికి తీసుకొని వెళ్ళాడు. అప్పటికి సాయంకాలం అయింది. ఆ ప్రాంతంఅంతాదివ్యసువాసనలువెదజల్లుతున్నాయి రండి,రండిఅనే శబ్దాలు ఆకాశంనుండి వినబడు తున్నాయి. పుష్ప వృష్టి కురుస్తోంది.వీణా, వేణు, మృదంగ నాదాలు వినిపిస్తున్నాయి, దివ్య గానాలు వినిపిస్తున్నాయి. మానవులు ఎవరు చూడని సమయంలో దేవతలు స్వామిని అర్చి స్తున్నారు.

దేవతలు స్వామిని యధావిధిగా అర్చించి, దివ్య ప్రసాదాలు సమర్పించి స్వర్గానికి వెళ్లిపో యారు. తరువాత నా స్నేహితుడైన విశ్వావసువు ఆ ప్రసాదాలు తీసుకు వచ్చి మా అందరికి పెట్టాడు. ఈ మాలకూడా విశ్వావసువు నాకు ఇచ్చాడు. పురుషోత్తమ క్షేత్రంలో ఉన్న స్వామి రూపం అపూర్వమైనది. మనోహరమైన శిల్ప సంపదతో ఉంటుంది. నీలాద్రి పర్వతం చుట్టూ ఐదు క్రోసుల దూరం అరణ్యం వ్యాపించి ఉంది. అనేక తీర్థాలు, ఉన్నాయి. చుట్టూ బంగారు ఇసుక ఉంటుంది.

నీలాద్రి పర్వత శిఖరంపై కల్పవృక్షం ఉంది. క్రోసుడు పొడవు ఉంటుంది. చిగురుటాకులతో నిండి



ఉంటుంది. సూర్యుడు ప్రకాశిస్తున్నప్పుడు ఆ వృక్షం నీడ ఎవరు దాటలేరు. కల్ప వృక్షానికి ఎడమ వైపున రోహిణి కుండం ఉంది. నాలుగువైపుల స్ఫటికాలతో చేయబడిన వేదికలు ఉన్నాయి. తూర్పున ఉన్న వేదిక మర్రి చెట్టు నీడలో చాల చల్లగా ఉంతుంది. అక్కడ ఉన్న జగన్నాధ స్వామి ఇంద్రనీల మణి వర్ణంలో ఉండి ఎనభైఒక్క అంగుళాల ఎత్తులో విగ్రహం ఉంటుంది. చక్రము, గద ధరించి ఉంటాడు. అష్టమి చంద్రుని కళతో నుదురు ప్రకాశిస్తూ ఉంటుంది. నల్ల కలువలతో సమానమాన మయిన కన్నులు కలవాడు. సూర్యుని కాంతితో సమాన ముఖ వర్చసు ఉంటుంది. ముక్కు పుటలు ఆవ పూవువలే ఉంటాయి. ( 1 - 20)

చిరునవ్వులు చిందుస్తున్న క్రిందపెదవి, పొంగిన చెక్కిళ్లు, కలిగి పూర్ణ చంద్రుని వలె ప్రకాశిస్తూ స్వామి అక్కడ ఉన్నాడు. కంఠము చుట్టూ హారాలు అలంకరిచబడి ఉన్నాయి. చేతులు మోకాళ్ళవరకు వ్యాపించి ఉన్నాయి. కౌస్తుభాన్ని ధరించి ఉన్నాడు. లోతైన నాభి కలవాడు.పట్టువస్త్రాలు ధరించిఉన్న స్వామిని చూసాను. నా మనస్సు తాళ్లతో కట్టెసినట్లుగా ఉంది. స్వామి నా ఎదుట సజీవంగాఉన్నట్లు అనిపించింది. ఇది నా పూర్వ జన్మ సుకృత ఫలం అనిభావించాను. అనేక విద్యల వలన లభించని ఫలితము ఈ స్వామిని దర్శించడం వలన లభించింది.అనివిద్యాపతివిన్నవించాడు.(21- 47)

" బ్రాహ్మణోత్తమా! నీవు చెప్పిన మాటలు వినడం వలన నా పాపాలన్ని నశించాయి. స్వామి నిర్మాల్యం ధరించడం వలన పాపాలు నశించి, స్వామిని దర్శించుకొనే అర్హత నాకు లభించింది. స్వామిని దర్శించుకొని అక్కడే నగరాన్ని నిర్మించుకొని స్వామి సేవ చేసుకుంటాను. అశ్వమేధ యాగాన్ని నిర్వహిస్తాను. ఉపవాసాలు, ఆరాధనలతో స్వామిని అర్చిస్తాను." అని ఇంద్రద్యుమ్నుడు విద్యాపతితో పలికి స్వామిని స్తుతించాడు

అదే సమయంలో నారదుడు అక్కడకు వచ్చాడు. ఇంద్రద్యుమ్నుడు నారదుని భక్తితో సత్కరించి, " స్వామి! విష్ణు భక్తుల లక్షణాలు వివరించండి? అని ప్రార్ధించాడు

" రాజా! నీవు చక్కని విషయాన్ని ప్రస్తావించావు. నేను చెప్పే విషయాన్ని సావధానంగా విను. విష్ణు భక్తి సుఖాలను ఇచ్చి, దుఃఖాలు పోగొడుతుంది. విష్ణు భక్తి ఒక్కటేఅన్నిసమకూరుస్తుంది అని భావించడమే భక్తి. భక్తి మూడు విధములు. నాలుగవది నిర్గుణము. కామ, క్రోధాదులచే

ఆవహించబడిన భక్తిని తామస భక్తి అంటారు. ఇతరులను జయించడానికి, కీర్తిని పొందాలనే కోరికతో ఉన్న భక్తిని రాజస భక్తి అంటారు. ఆత్మజ్ఞానముకొరకు ఉపయోగించు భక్తిని సాత్విక భక్తి అంటారు.`వామి నేను వేరుకాదు. స్వామియే నేను అని భావించు భక్తి చాల కష్టమైనది. దీనిని అద్వైతభక్తి అని పిలుస్తారు. సాత్వికభక్తి వలన బ్రహ్మ లోకం, రాజస భక్తి వలన ఇంద్రలోకం. తామస భక్తి వల్న పితృ లోకం, చేరుకుంటారు. తామసీ భక్తి క్రమముగా రాజసీ భక్తిని, సాత్త్వికి భక్తిని, అద్వైత భక్తిలిని కగిస్తుంది. ఒక భక్తిని ఆశ్రయిస్తే మరొక భక్తిని పొందవచ్చు. విష్ణు భక్తి లేని వారికి శ్రౌత, స్మార్త కర్మలు చేసే అధికారం ఉండదు. ఇంద్రియాలు జయించిన వారినిఅన్నిలోకాలవారు ప్రశంసిస్తారు. ధార్మికులు కానివారి భక్తిని ఎవరు గుర్తించరు. ప్రయత్నించి విష్ణు భక్తిని పొందాలి.

( 48 - 95)

## జగన్నాధుని తెలుసుకొనే విద్యయే విద్య

ఇతరవిద్యలు విద్య కావు. స్వామియందు భక్తి కల వానికి ఇతరములైన కోరికలు కలుగవు. స్వామికి, భక్తునికి బేధము లేదు. విష్ణు భక్తుడు ప్రశాంతమైన మనస్సు కలిగి. ఇంద్రియ నిగ్రహము కలవాడై, ఇతరులకు హాని తలపెట్టని వాడై ఉండాలి. దొంగతనము, హింస చేయకూడదు. సదాచార సంపన్నులను, దాన శీలురతోను, మత్సరములేని వారితోను, దీనులపై దయగలవారితోను, ఇతరులకు సాయం చేయువారితోను, విష్ణు భక్తుడు స్నేహం కలిగి ఉండాలి. విష్ణు భక్తుడు ఈశ్వరునిసేవిస్తూ ఉండాలి. విష్ణుభక్తులు విష్ణుస్వరూపాలను ధ్యానిస్తూ ఉండాలి. విష్ణువుకంటె వేరొకరిని చూడరు. విష్ణువుకంటె వేరైనదిఏదిలేదు.స్వామిపాదాలనుసేవిస్తూ ఇతరములైనవాటిని గడ్డి పోచవలె చూడాలి. అన్నిటియందు సమదృష్టి కలిగి ఉండాలి. ప్రియముగా మాట్లాడాలి., ( 96 - 112)

వైష్ణవ భక్తులు స్వామి నామాలు జపిస్తూ ఉండాలి. జయ జయ ధ్వానాలు చేస్తూ ఉండాలి. స్వామి పాదాలపై భక్తి నిలిపి ఉండాలి. సుఖ దుఃఖాలు సమంగా చూస్తూ స్వామిని అర్చించాలి. చక్రము, గద, పద్మము, శంఖము మొదలగు ముద్రలను తిలకంగాను, బాహు మూలాలపైన, మధ్య భాగాన ముద్రించుకోవాలి. వైష్ణవ భక్తులకు స్వామి పాద ధూళియే కవచం. గంధము, తులసీ దళాలతోస్వామినిఅర్చించాలి.శుద్ధమైనమనస్సుతో అహంకారాన్ని విడిచిపెట్టి యజ్ఞాదులచే స్వామిని అర్చించాలి.

'స్వామి1 నీ చరిత్ర ప్రసిద్ధి చెందింది. మానవుల కల్మషాలను హరిస్తుంది. నేను ధనాన్ని కోరుకోవటంలేదు. శరీర కష్టాన్ని లెక్కచేయటం లేదు. నిన్ను కీర్తించుటయే నాకు గల కోరిక" అని స్వామిని ప్రార్ధించాలి. విష్ణు భక్తి లేనివారు ఇతరులను ద్వేషిస్తూ ఉంటారు. ఉంటారు.

చెడ్డపనులు చేస్తూ ఉంటారు. స్వామిని మనస్సులో ప్రార్ధించరు. వ్యర్ధమైన మాటలతో కాలక్షేపం చేస్తూ ఉంటారు. ధనవ్యామోహం, పరస్త్రీ వ్యామోహంతోనుజీవిస్తూఉంటారు.హింసాస్వభావం కలిగి ఉంటారు. రౌద్ర స్వభావంతో ఉంటారు. అటువంటి వారికి వైష్ణవ భక్తులు దూరంగా ఉంచాలనినార దుడుఇంద్రద్యుమ్మునికిబోధించాడు. ( 113 - 123)

స్కాందపురాణంలోని వైష్ణవ ఖండంలోని, పురుషోత్తమ క్షేత్ర వైభవంలోని, జైమిని -ఋషి సంవాదము అను పదవ అధ్యాయం సమాప్తం.

### 11 వ అధ్యాయం

### జైమిని ఋషి సంవాదం

### ( ఇంద్రద్యుమ్నుడు నీలాచలానికి బయలుదేరుట)

మహర్షి1మీసాంగత్యంవలననాలోనిభవబంధాలన్ని తొలగిపోయాయి.మీబోధలవలననీలమాధవుని దర్శించుకోవాలనే కోరిక అధికమవుతోంది. ఆ పురుషోత్తముని దగ్గరకు బయలుదేరుదాము. మీరు మాతో రండి' అని రాజు నారదుని ప్రార్ధించాడు.

" రాజా! పురుషోత్తమ క్షేత్రాన్ని, అక్కడ ఉన్న తీర్థాలను నేను దగ్గర ఉండి చూపిస్తాను. నీవుస్వామిని తప్పక దర్శించుకొనగలవు. అక్కడ స్వామి నాలుగు రూపాలలో దర్శనం ఇస్తారు." అని నారదుడు అనుజ్ఞ ఇచ్చాడు. జ్యేష్ట శుక్ల పంచమీ బుధవారం పుష్యమీ నక్షత్రంలో యాత్రకు సరయిన ముహుర్తంగా దైవజ్ఞులు నిర్ణయించారు." యావజ్జీవితంనీలాచలంలొ నివసించడాలనే కోరికగల ప్రజలను బయలు దేరమని రాజు చాటింపు వేయించాడు.

రాజ బంధువులు, సైన్యం, మంత్రులు, బ్రాహ్మణులు, వివిధ వృత్తులవారు తమతమ సంభారాలు తీసుకొని బయలుదేరారు. బ్రాహ్మణులు నిర్ణయించిన ముహూర్తం ప్రకారం వివిధ సూక్తాలతో, మంత్రాలతో , వివిధ తీర్థజలాలతోరాజును అభిషేకించారు. తెల్లనివస్త్రాలు ధరించి యధావిధిగాపితృగణాలనుఅర్చించారు. జయహోమం, గణహోమం నిర్వహించారు. అగ్నికి ప్రదక్షిణ చేసారు. నవగ్రహాలను పూజించారు. రాజు పట్టువస్త్రాలు ధరించి, సర్వాలంకార భూషితుడై యాత్రకు బయలుదేరాడు.

వందలాది శంఖాలు పూరించారు, అనేక వాద్యాలు మ్రోగించారు. రాజు నృసింహునిదర్శించు కున్నాడు. పురోహితులు స్వామి మాలను రాజుకు సమర్పించారు. దేవాలయానికి ఎదురుగా ఉన్న పదిగుర్రాలు ఉన్న రధాన్ని నారదునితో కలిసి అధిరోహించాడు.ఆ రథం నీలాద్రి పర్వతంవైపు ప్రయాణిస్తోంది. మార్గం చాల కష్టంగా ఉంది. అరణ్య మార్గంలోని సుందర దృశ్యాలను చూస్తూ ఉత్కల దేశ ( ఒరిస్సా) సరిహద్దులకు చేరుకున్నారు. అక్కడ ఉన్న చర్చికా దేవిని దర్శించుకున్నాడు. ఆమె పుర్రె మాల ధరించి ఉంది. నారదునిఆజ్ఞనుఅనుసరించి ఇంద్రద్యుమ్నుడు రధాన్ని దిగి వినయంగా చర్చికాదేవిని సమీపించి, సాష్టాంగ నమస్కారం చేసి ఈవిధంగా ప్రార్ధించాడు.

ఇంద్రద్యుమ్నుడు చర్చికా దేవిని స్తుతించుట-----

నమస్తే త్రిదశేశాని సర్వాపద్వినివారిణి

బ్రహ్మవిష్ణు శివాద్యాభిః కల్పనాభి రుదీరితే

కారణం జగతామాద్యే ప్రసీద పరమేశ్వరి

త్వయావినా జగన్నైతత్ క్షణముత్సహతే శివే

సిద్ధయః సర్వ కార్యాణాం మంగలానిచ శాశ్వతే

త్వత్పాదారాధన ఫలం మర్త్యలోకేహి నాన్యధా

చరాచర పతేర్విష్ణోః శక్తి స్త్వం పరమేశ్వరి

యయా సృజత్యవతిచ జగత్సంహరతే విభుః

చరాచర గురుం దేవం నీలాచల నివాసినమ్

అనుగృహ్ణీస్వ మాం యధాపశ్యే స్వ చక్షుషా

" ఓ దేవి1 నీవు సమస్త దేవతలకు అధి పతివి. బ్రహ్మ,విష్ణు, శివ అనే పేర్లతో పిలవబడు చున్నావు. జగత్తుకు మూలకారణము నీవే. నీవు లేనిదే ఈ లోకము నిలువలేదు. సకల శుభాలకు, సర్వకార్య సిద్ధికి నీ పాద సేవయే మార్గం. విష్ణువు

నకు శక్తిని ఇచ్చుదానవు నీవే. నీలాద్రి నాధుని కన్నులతో చూచునట్లు అనుగ్రహించు" అని రాజు ప్రార్ధించాడు. (1 - 97)

ఈవిధంగా చర్చికా దేవిని ప్రార్ధించి రాజు రధాన్నిఎక్కిఅచలాద్రికిబయలుదేరాడు.మధ్యాహ్న సమయానికి మహానదీ తీరానికి చేరుకున్నాడు. మధ్యాహ్నంసంధ్యాదికార్యక్రమాలనునిర్వహించుకొని, నారదునితో కలిసి భోజనం చేసాడు.

సాయం సమయంలో రాజు అక్కడే సభ నిర్వహించాడు. చంద్రోదయం అయింది. కవులు గాయకులు రాజు కీర్తిని వర్ణిస్తూ గానం చేసారు. నర్తకీ మణులు నృత్యం చేసారు. రాజు అక్కడకు వచ్చిన వైష్ణవ భక్తులను, రాజులను తగిన రీతిని సత్కరించాడు. నారదుని ఉచితాసనంపై కూర్చోబెట్టి, తగిన రీతిని సత్కరించి, " మహర్షి! విష్ణువు చరిత్రను నీవు జ్ఞాన శక్తిచే తెలుసుకున్నావు. ఆ చరిత్రనునాకు చెప్పినా మనస్సులోఉన్నబురదను కడిగివేయి" అని ప్రార్ధించాడు.

ఇంతలో ఉత్కల దేశపు రాజ సేవకుడు వచ్చి తమ రాజు ప్రవేశించుడానికి అనుమతించమని విన్నవించుకునాడు.ఇంద్రద్యుమ్నుడు అను మతించగా ఉత్కలరాజు లోనికి ప్రవేసించాడు. ఇంద్ర ద్యుమ్నుడు వైష్ణవ భక్తుడైన ఆ రాజును గౌరవించి ఉచితాసనంపై కూర్చోబెట్టి, రాజా! సకల శుభాలు కలుగుతున్నాయా? నీలాద్రి స్వామికి జయం కలుగుతోందా? నీవు ఆ స్వామిని భక్తితో సేవిస్తున్నావా? " అని అడిగాడు.

" రాజా1 నీ అనుగ్రహం వలన సకల శుభాలు సమకూరుతున్నాయి. నీ పాలనలో ధర్మం నాలుగు పాదాలలో నడుస్తోంది. నీవు సాక్షాత్ విష్ణు స్వరూపుడవు.ఇక్కడ దక్షిణ సముద్ర తీరంలో ఉన్న అరణ్యంలో నీలాద్రి పర్వతం ఉంది. ఆ పర్వతంపై స్వామి ఉన్నాడు. ఇక్కడ ఏర్పడిన గాలితుఫానుకి స్వామిఇసుకచే కప్పివేయబడ్డాడు. ఆనాటినుండి నా రాజ్యంలో దుర్భిక్షం ఏర్పడింది. నీ రాక వలన నా రాజ్యం సుభిక్షం అవుతుంది అని అనుకుంటు న్నాను" అని రాజువిన్నవించుకున్నాడు.

(ఇంకా వుంది)

# సప్త మోక్ష నగరాలు



## కొత్త రామానందం

జీవితం ---- ముఖ్యంగా మానవ జీవితం గొప్పది. అమూల్య మైనది. ఆధ్యాత్మిక భాషలో చెప్పాలంటే దుర్లభమైనది. కేవలం లౌకిక జీవితాన్ని ఆరాధించే వారి సంగతి పక్కనుంచితే భగవంతుడే పరమావధిగా ఆయనను పొందేందుకే మానవ జీవితం అనే స్పృహ కలిగి, ఆ గమ్యానికే దృఢ చిత్తంతో సమాయత్తమైన వారికి జీవితం అపురూపమైనది.
మానవ జన్మ ఓ దివ్య వరంగా లభించింది. దీనిని దుర్వినియోగం చేసుకోకూడదంటారు మన పెద్దలు. జ్ఞానం లేకుండా ముక్తి లభించదు. అందుకే మహాపురుషులను ఆశ్రయించి, ఆత్మ -- పరమాత్మ జ్ఞానం పొందాలి. ధర్మార్ధ కామమోక్షాన్ని విడిచి మధ్య ఉన్న అర్ధ కామాల వెంట నేటి మనిషి పరుగులు చేస్తున్నారు. పరమాత్మ పట్ల చిత్తం అంటే మనసును లగ్నం చేయాలి. మన మనసు ప్రవర్తనను నిరోధించడమే యోగం.

ఎన్ని ఒడుడుకులు ఎదురైనా పదిలంగా బతకాలని ప్రతి జీవి తాపత్రయపడుతుంది. అందులో ప్రమాదరహితంగా, ప్రమోద భరితంగా సాగాలనే కాంక్ష అంతర్లీనమై ఉంటుంది. జటిల సమస్యలు ఎదురైనప్పుడు ఏమైనా మహిమాన్విత శక్తి తనకు సహకరించాలని ఆశించడం సహజం. భగవంతుని అనుగ్రహం పొంది, సమస్యలను అధిగమించగల శక్తి పొందాలనే ప్రయత్నమే --- భక్తి మార్గం.

భగవంతుడు అపార కరుణా సముద్రుడు. దయాళుడు. ఆయన మానవునికి సద్బుద్ధినిచ్చి సన్మార్గంలో నడిపిస్తాడు. అందరికీ ప్రేరణ ఇస్తాడు. ఆయన ప్రేరణ జగతి జాగృతికి ఆధారం. భవ బంధాలనుండి విముక్తి చేయడానికి ఎన్నో మార్గాలు చూపాడు. ఎన్నో దివ్య ధామాలను సృష్టించాడు.

వేదాలు పుట్టిన ఈ పవిత్ర భూమిపై ముక్తి ధామాలుగా సప్త నగరాలు ఉన్నాయి. అందు పరమాత్మ అనేక అనేక అవతారాలుగా ఉద్భవించి దుష్ట శిక్షణలు గావించి తన మహిమలతో కృపా దృష్టితో కాపాడుతున్నాడు, మరియు నూతనోత్సాహాన్ని నింపుతున్నాడు..
"అయోధ్యా, మధురా మాయా, కాశీ కంచి అవంతికాపురి ద్వారవతి చైవ సప్తైతే మోక్ష దాయకా"
భారత దేశంలో అనేక దివ్య క్షేత్రాలు ఉన్నాయి. అయితే సప్త మోక్ష నగరాలు మోక్ష ధామాలుగా ప్రసిద్ధి గాంచి మనందరకూ సుఖ శాంతులు, విజయ కాంతులు ప్రసాదిస్తున్నాయి. అందువల్ల మనకు ఆధ్యాత్మిక చైతన్యం విరాజమానమై దైవం పట్ల భక్తి ప్రపత్తులు పెరిగి ఆత్మ విచారణ చేయగలుగుతున్నాము. ధర్మ బద్ధమైన జీవనాన్ని ఎంపిక చేసుకుని పుణ్య క్షేత్రాలను సందర్శిస్తూ ముక్తి కోసం ప్రయత్నించడం మన ధ్యేయంగా చేసుకోవాలి. ముఖ్యంగా జీవిత కాలంలో సప్త మోక్ష ధామాలను దర్శించి పునీతులమవ్వాలి. భగవంతుడు భక్తుని నుండి కోరుకునేది కూడా అదే.

ఆసేతు హిమాలయ పర్యంతం వ్యాపించిన మన భారతావనిలో ఎన్నో జాతులు, తెగల ప్రజలు, భాషలు ఉన్నా మొత్తం జాతినంతటి-నీ సమైక్య పరచి ముందుకు నడిపిస్తుంది మన సనాతన సంస్కృతి. అట్టి సంస్కృతికి ప్ర-తిరూపాలు మన పుణ్య క్షేత్రా-లు, తీర్థాలు. వాటిలో అనాది కాలం నుంచి విఖ్యాతి చెంది భక్తులకు మోక్షదాయికాలుగా ఏడు పుణ్య క్షేత్రాలు అత్యంత ప్రాముఖ్యత పొందాయి.

అవి అయోధ్య, మధుర, మాయ (నేటి హరిద్వార్), కాశీ, కంచి, అవంతిక(నేటి ఉజ్జయిని) మరియు ద్వారక.

## 1. రాముడు నడయాడిన పుణ్య స్థలి: అయోధ్య



అయోధ్య నగరం త్రేతాయుగం-లో అత్యంత సుందరంగా సరయు నది తీరంలో నిర్మింపబడింది. ఆ క్షేత్రము లోని ప్రతి రేవు, తావు నిర్మాణం ఆ దశరధ తనయుని లీలా వైభవాన్ని చాటుతూ, మన మనుసులో ముద్ర పడి, పది కాలా-లపాటు ఉండిపోతాయి. ఆ పుణ్య-స్థలిని దర్శించినవాళ్ళు అందరూ భక్తిభావంలో మునిగిపోతుంటారు. 'జై శ్రీరాం' అంటూ భక్తులందరూ దిక్కులు పిక్కటిల్లేలా జయ జయ ధ్వానాలు చేస్తూ అచ్చటి ముఖ్య ప్ర-దేశాలను దర్శించి తామంతా పునీ-తులమైనట్లు భావిస్తారు. అయోధ్య-ను దర్శించడం ఒక ఆధ్యాత్మికమైన అనుభూతి.

అయోధ్య నగరాన్ని స్వయంగా వైవస్వత మనువు నిర్మించాడు. ఈ అద్భుత నగరాన్ని కోసల దేశాధి పతులైన ఇక్ష్వాకు వంశీయులు రాజధానిగా మార్చుకున్నారు. ఒడ్డా-ణంలా బలమైన ప్రాకారం నిర్మించి, నలుదిశలా సుందర ద్వారాలు ఉంచారు. ఇచ్చట అనేక రకము-లైన యుద్ధ తంత్రాలు, ఆయుధ విశేషాలు కానవస్తాయి. కోట బయట ఇళ్ళన్నీ మేడలే! మేరు పర్వతాల్లాగా అతి సుందరంగా తీర్చిది ద్దారు. ఈ నగర చరిత్రను పరిశీలిస్తే చంద్రగుప్త విక్రమార్కు-ని కాలం వరకు చక్కగా అలరారు-తూ వుండేది. చంద్రగుప్తుడు ఇక్కడ ఒక శివాలయాన్ని పునర్నించినట్లు తెలుస్తుంది. క్రీ.శ. 1588 సంవత్స-రం లో మొఘల్ చక్రవర్తి బాబర్ భారతదేశముపై దండెత్తినపుడు ఇక్కడ ఒక మశీదును కట్టించాడు. 18 వ శతాబ్దములో సాదత్ ఖాన్ బుర్హా ఉల్ ముల్క్ నవాబు వంశం కొంతకాలం అయోధ్యను రాజధా-నిగా చేసుకుని పరిపాలించాడు. అనంతరం వీరు తమ రాజధానిని లక్నో కు మార్చుకున్నారు.

(మిగిలినది వచ్చే సంచికలో)

# హాస్య బ్రహ్మ జంధ్యాల



**పోడూరి శ్రీనివాసరావు**

"జంధ్యాల వీర వెంకట దుర్గా శివ సుబ్రహ్మణ్య శాస్త్రి " అంటే మనలో ఎంత మందికి తెలుసు? కనీసం ఆ పేరు గల వ్యక్తి ఉన్నారని గాని, మనకు పరిచయస్థుడేనని, బహుముఖ ప్రజ్ఞాశాలి అని అత్యంత ప్రజాదరణ గల విజయవంతమైన సినిమాలకు కథలందించారని పసందైన సంభాషణలు సమకూర్చారని హాస్య బ్రహ్మగా పేరు పొంది, రసవత్తర గుళికల్లాంటి ఆహ్లాదకర ఆనందమయ చిత్రాలకు దర్శకత్వం వహించారని అనుకోగలమా! అదే ... షార్ట్ కట్ లో జంధ్యాల అన్న పేరు వినగానే, ఎగిరి గంతేస్తాం. నవ్వుల జల్లులో తడిసి ముద్దౌతాము. అలాంటి హాస్యబ్రహ్మ జంధ్యాల గురించి నాలుగు విశేషాలు తెలుసుకుందాము.

శ్రీ జంధ్యాల తండ్రి గారు నారాయణమూర్తి గారు. జంధ్యాల 14 జనవరి 1951 న నరసాపురం లో జన్మించారు. విజయ వాడ లోని ఎస్ ఆర్ ఆర్ & సి వి ఆర్ కాలేజీలో బి.కాం చదివారు. చిన్నతనం నుంచీ శ్రీ జంధ్యాలకు నాటకాల పట్ల ఆసక్తి. స్వయంగా నాటకాలు రచించడం, నాటకాలలో నటించడం దర్శకత్వం వహించడం పట్ల విపరీతమైన ఆసక్తి .

ఆయన నటించిన తొలి నాటకం ఆత్మాహుతి. తదుపరి నాటకం -------'ఏక్ దిన్ కా సుల్తాన్ ' ఈ నాటకం ఎంత ప్రజాదరణ పొందిందంటే 10,000 లకు పైగా ప్రదర్శింపబడ్డాయి. ఆనాటక పుస్తక ప్రతులు 15 సార్లుకు పైగా పునర్ముద్రణ జరిగింది. అత్యంతప్రజాదరణం ప్రేక్షకాదరణ పొందిన నాటకం.జంధ్యాల వ్రాసిన ఆఖరు నాటకము" గుండెలు మార్చబడును ".

ప్రఖ్యాత నటుడు శ్రీ గుమ్మడి వెంకటేశ్వర రావు ఒక నాటక ప్రదర్శనలో జంధ్యాలను చూసి, వారిని కథ రచయితగా ప్రయత్నించమని సలహా ఇచ్చారు.

శ్రీ గుమ్మడి సలహా ప్రకారము శ్రీ జంధ్యాల సినీ రంగంలో తన



ప్రయత్నాలు కథ రచయితగా కొన సాగించారు, ఆయనను కళా తపస్వి, ప్రఖ్యాత దర్శకుడు శ్రీ కాశీనాధుని విశ్వనాథ్ ప్రోత్సహించారు.

1974 వ సంవత్సరంలో సినీ రచయితగా సినీ రంగ ప్రవేశం చేసాడు. మాటల రచయితగా శంకరాభరణం, సాగర సంగమం, అడవి రాముడు, వేటగాడు, ఆపద్బాంధవుడు, సిరి సిరి మువ్వ మొదలైనవి. శ్రీ జంధ్యాల మాటల రచయితగా వ్రాసిన అనేక విజయవంతమైన చిత్రాల్లో మచ్చుకు కొన్ని.

1976 లో 'దేముడు చేసిన బొమ్మలు' చిత్రానికి మాటల రచయితగా పనిచేశారు. 5 సంవత్సరములలో సుమారు 85 సినిమాలకు రచయితగా పనిచేస్తే, అందులో 80% అఖండ ఘన విజయం సాధించడమే కాక, శ్రీ జంధ్యాలకు మంచి రచయితగా పేరు తెచ్చాయి.

తదనంతరం దర్శకుడి అవతారం ఎత్తి, అనేక విజయవంతమైన చిత్రాలకు దర్శకత్వం వహించారు. నవరసాలలో హాస్యరసానికి పెద్దపీట వేసే అమితంగా ఇష్టపడే శ్రీ జంధ్యాల ఎక్కువగా హాస్య ప్రధానమైన చిత్రాలకే దర్శకత్వం వహించారు.

వారికి తెలుగు చలనచిత్ర సీమకే మకుటాయమాన మైన "మాయాబజార్" అంటే విపరీతమైన ఇష్టం. అందుకే "మాయా బజార్" లోని ప్రముఖమైన మకుటాలతో చిత్రాలను నిర్మించారు.

ఉదాహరణకు: అహనా పెళ్ళంట, వివాహభోజనంబు, చూపులు కలిసిన శుభవేళ, హైహై నాయకా. స్క్రీన్ ప్లే రచయితగా దర్శకునిగా, నటునిగా తెలుగు చలన చిత్ర సీమకు సుపరిచితుడు శ్రీ జంధ్యాల.

శ్రీ జంధ్యాల హాస్య ప్రియత్వానికి మచ్చుతునక ఈ క్రింది సంభాషణ ఒక ప్రముఖుడు శ్రీ జంధ్యాల నడిగారట ---- జంధ్యాల గారూ! మీరు ఇంటి పేరుతోనే సుప్రసిద్ధులయ్యారు. మీ అసలు నామధేయం, పూర్తి నామ

ధేయం ఏమిటండీ!... అంటే చిరునవ్వుతో శ్రీ జంధ్యాలగారి సమాధానం ఏమిటంటే రామానాయుడుగారి సినిమాలకు పనిచేసేటప్పుడు నా పేరు జంధ్యాల రామానాయుడు. అలాగే విశ్వనాథ్ గారి సినిమాలకు పనిచేసేటప్పుడు నా పేరు జంధ్యాల విశ్వనాథ్.

శ్రీ జంధ్యాల తీసిన హాస్య ప్రధాన మైన సినీమాలెలా ఉంటాయంటే అనేక హాస్య భరితమైన చిత్రాలు. అవి కూడా ఆరోగ్య కరమైన హాస్యం, అశ్లీల రహిత హాస్య ప్రధానమైన చిత్రాలు.

శ్రీ జంధ్యాల మాటల్లో 'నవ్వడం ఒక యోగం, నవ్వించడం ఒక భోగం, నవ్వలేక పోవడం ఒక రోగం.'

శ్రీ జంధ్యాల చలన చిత్రాల ద్వారా పరిచయం చేసిన నటులు --బ్రహ్మానందం, ప్రదీప్, నరేష్ (సీనియర్): సుత్తి వేలు సుత్తి వీరభద్రరావు.

శ్రీ జంధ్యాల ద్వారా వచ్చిన విజ య వంతమైన చిత్రాలు; ముద్ద మందారం; మల్లెపందిరి; నాలుగు స్తంభాలాట; నెల వంక; రెండు జళ్ల సీత; అమరజీవి; మూడు ముళ్ళు; శ్రీవారికి ప్రేమ లేఖ; ఆనంద భైరవి (తెలుగు, కన్నడం); రావు గోపాల రావు; పుత్తడి బొమ్మ; బాబాయి -అబ్బాయి; శ్రీవారి శోభనం; ముద్దుల మనవరాలు; మొగుడు -పెళ్ళాలు; రెండు రెళ్ళు ఆరు; సీతా రామ కళ్యాణం; చంటబ్బాయి, పడమటి సంధ్యారాగం; రాగ లీల; సత్యాగ్రహం; అహనాపెళ్ళంట; చిన్నికృష్ణుడు; వివాహ భోజనంబు; నీకూ నాకూ పెళ్ళంట; చూపులు కలిసిన శుభవేళ; హై హై నాయకా; జయమ్ము నిశ్చయంబురా; లేడీస్ స్పెషల్; బావా బావా పన్నీరు; ప్రేమ ఎంత మధురం; విచిత్ర ప్రేమ; బాబాయ్ హోటల్; అ ఆ ఇ ఈ ; ప్రేమా జిందాబాద్; ష్...గప్



చిప్, ఓహో నా పెళ్ళంట; విచిత్రం .... మొదలైనవి. ఆనంద భైరవి పురస్కారాలు పొందిన చిత్రం. రచయితగా శ్రీ జంధ్యాల పనిచేసిన విజయవంతమైన చిత్రాలు:

డ్రైవర్ రాముడు; అల్లుడు పట్టిన భరతం; నారీ నారీ నడుమ మురారీ; అడవి రాముడు; వేటగాడు; రహస్య గూఢ చారి; సీతాకోక చిలుక మొదలైనవి. శ్రీ జంధ్యాల గారి శ్రీమతి 'అన్నపూర్ణ'. ఆ దంపతులకు ఇద్దరు కుమార్తెలు-సాహితి, సంపద.

శ్రీ జంధ్యాలకు పురస్కారాలు సాధించి పెట్టిన చిత్రాలు :

1983 -ఆనంద భైరవి - ఉత్తమ ప్రాంతీయ చిత్ర దర్శకుడు - జాతీయ

1983 -ఆనందభైరవి -ఉత్తమ దర్శకుడు - నంది అవార్డ్.

1983 - ఆనంద్ భైరవి చిత్రం ఇంట ర్నేషనల్ ఫిలిం ఫెస్టివల్ ఆఫ్ ఇండి యా 1983లో ప్రదర్శింప బడింది.

4 రాష్ట్ర నంది అవార్డులు ఫిలిం ఫేర్ అవార్డు సాధించారు.

1987 - పడమటి సంధ్యా రాగం --- ఉత్తమ కధారచయిత అవార్డ్.

1992 ----- ఆపద్బాంధవుడు ------- ఉత్తమ మాటల రచయిత అవార్డ్.

ఉత్తమ రచయితగా ఉత్తమ సంభాషణల రచయితగా పుణ్య భూమి; కళ్ళు తెరు; దేముడు చేసిన బొమ్మలు; సిరి సిరి మువ్వ చిత్రాలకు అవార్డులు పొందారు.

1993-95 సంవత్సరాల మధ్య దూర దర్శన్ లో బహుళ ప్రజాదరణను పొందిన 'ఆనందో బ్రహ్మ' కార్యక్రమాన్నిరూపొందించారు.

ఇవేకాక మద్రాసు ఫిలింఫాన్స్ అవార్డు ఆంధ్రప్రదేశ్ ఫిలిం జర్నలిస్ట్ ల అవార్డ్ విజయవాడ; ఫిలిం జర్నలిస్టుల అవార్డ్, వంశీ అవార్డ్ , కళా సాగర్ అవార్డ్; ఆంధ్ర ప్రదేశ్ సినీ గోయర్స్ అవార్డ్

అశ్లీలరహిత హాస్యానికే భాష్యం చెప్పి, అనేక విజయవంతమైన చిత్రాలకు దర్శకత్వం వహించిన శ్రీ జంధ్యాల తీవ్రమైన గుండె పోటుతో 19 జూన్ 2001 న హైదరాబాదులో మరణించారు.

శ్రీ జంధ్యాల నిర్మించిన సినీమాల్లో అత్యధిక చిత్రాల్లో శ్రీ నరేష్; శ్రీ రాజేంద్రప్రసాద్ కథానాయకులుగా నటించారు. మన భారత ప్రధాని (మాజీ) శ్రీ పి. వి. నరసింహారావు మానసిక ఉల్లాసం కొరకై శ్రీ రాజేంద్ర ప్రసాద్ నటించిన చిత్రాలుచూసి ఆహ్లాదం పొందే వారంటే ... హాస్య రస చిత్రాలు మహా మహిళను సైతం ఎంత ప్రభావితం చేసేవో, రాజేంద్ర ప్రసాద్ చిత్రాలు, శ్రీ జంధ్యాల సినిమాలు మానవ జీవితంపై ఎటువంటి ఆహ్లాద కార వాతావరణాన్ని కలిగించాయో అర్థమవుతోంది.

శ్రీ జంధ్యాల చిత్రాలు ఎన్ని సార్లు ప్రదర్శింపబడినా ఆరోగ్యకరమైన హాస్యం ఇంకా బతికుందనీ, ఆహ్లాదకర హాస్యం ఆరోగ్యకరమైన హాస్యం అనీ ఆరోసారి చెప్పక తప్పదు. ఆనందకర హాస్య మంటే, ఆరోగ్యకర హాస్య మంటే అశ్లీలరహిత హాస్యమంటే జంధ్యాల సినిమాలే అనడంలో ఎటువంటి సందేహం లేదు.

# రాజు పోయి మంత్రి వచ్చె

## భువనచంద్ర



అరణ్యం అట్టుడికిపోతోంది. నిన్నటిదాకా బల విద్యాగర్వాలు చూపినవారంతా అతివినయంగా సామాన్యుల్ని పలకరిస్తున్నారు.

"హవ్వ... ఏనాడైనా ఓ సింహం వచ్చి, కుందేలు తల్లికి నమస్కరించి ఓటు కోసం చేతులు జాస్తుందని ఊహించామా?" బుగ్గలు నొక్కుకుంది అడవికోడి.

"అది సర్లే...అసలు సివంగి మహా టెక్కు పోయేది. అన్నిటికీ ఎదవ సోకులే. కూచొన్నా, నించొన్నా 'బేక్టీరియా' అంటూ మహా జాగ్రత్తలు. అట్లాంటిది జిడ్డోడుతున్న కుక్కరాజు గారి అమ్మాయిని ముద్దు పెట్టుకోవడం అసలు నమ్మశక్యమవుతుందా? అదీ మూడ్నెల్లు కూడా దాటని కుంకని!" కళ్ళు గుండ్రంగా తిప్పుతూ అంది గుడ్లగూబ.

"అసలీ వింతలకి కారణం ఏమిటీ?" ఆవలిస్తూ అడిగింది తాబేలు గారు. దాని పేరు కలంశ్రీ. మహా తెలివైనది. అయితే ...ఒకే చిక్కు ఏమంటే, ఎప్పుడూ కాళ్ళూ ముఖమూ డిప్పలో దూర్చుకుని నిద్రావస్థలో ఉంటుంది. 'వనవార్తావాహిని' అనే ఓ పత్రిక కూడా నడుపుతోంది. కానీ అది నిద్ర లేస్తే కదా పత్రిక నడవడానికీ!

"తాబేలు లేచింది మొదలాడవమ్మా" చికాగ్గా అనుకుంది కుందేలు.

"నేను చెబుతా విను. క్రూరమృగాలకి ఉచిత ఆహార పథకం బెడిసికొట్టింది. కారణం, ఆ పథకాన్ని విన్నది ఓ పావురమే కాదు, 'సూక్ష్మ బుద్ధి' అనే ఓ పిచ్చికకూడా విన్నది. అది యీ క్రూర తంత్రాన్ని శాఖాహార జంతువులందరికీ చేరవేసింది" అన్నది అడవి కోడి.



"ఈ విషయం వజ్రకాయుడికి తెలీలేదా?" అడిగింది తాబేలు.

"ఎందుకు తెలీదూ? ఆ కరటక దమనకులున్నారుగా! ఆ విషయం తెలిసిన రాజుగారు వెంటనే ప్లాను మార్చి, మానవుల ప్రజాస్వామ్యం లాగా జంతువులకి 'జంతుస్వామ్యం' అంటూ ఎలక్షన్లెట్టాడు-ఎవడు గెలిస్తే వాడే రాజట!" వివరించింది అడవికోడి.

"ఓరి నాయనో ఇదేం పద్ధతి? వానపాము గెలిచి రాజైతే వాడి మాట వినేదెవ్వడూ? రాజు అంటే ఎలా ఉండాలి? బుద్ధిబలం వుండాలి. జనబలం వుండాలి. అంతేగాని దారేపోయే ఎలకనో పిల్లినో తెచ్చి 'రాజు' అంటే ఎలా?" షాక్ తో అరిచింది తాబేలు.

"అదే మరి, ఏలినవారి తెలివితేటలంటే!" చిద్విలాసంగా నవ్వింది అక్కడకి వస్తూ, అన్నీ విన్న అడవిదున్న.

"అంటే?" అడిగింది అడవికోడి.

"ఏముందీ లోకంలో రెండే జాతులున్నాయి. ఉన్నవాళ్ళూ లేనివాళ్ళూ అని. మనుషుల్లో అయితే ఈ రెండు జాతుల్లోనే అనేక వర్గాలున్నాయి. ఉదాహరణకి: ధనం - ఉన్నవాడు, లేనివాడు. బలం - ఉన్నవాడు, లేనివాడు. ఇలా అన్నమాట. మనుషుల్లో అయితే ధనం వున్నవాడు దేన్నయినా కొనగలడు. ఒకడు ఏ చదువూ లేనివాడు కావచ్చు. ధనం వుంటే చాలు, డాక్టరు డిగ్రీ లేకపోయినా, వంద డాక్టర్లని డబ్బుతో కొని హాస్పటల్స్ పెట్టగలడు. తనకి 'లా' గురించి అక్షరం ముక్క రాకపోయినా లాయర్లని డబ్బుతో కొనగలడు. అంతదాకా ఎందుకూ, వేలిముద్రగాడైనా కార్పొరేట్ కాలేజీలు స్థాపించగలడు. మన సంగతి వేరు. అక్కడి ఆటలు ఇక్కడ సాగవు. తేనెటీగలు ఎంత ఫ్రీగా తేనెని ఇచ్చినా, సింహం

ఓటుని కొనలేవుగదా. ఇక్కడ ఎవడి నీతి వాడిది. కానీ, ఇక్కడా మనుజ నీతి అమలు కాబోతోం-దనడానికి నిదర్శనమే ఈ ఎలక్ష-న్లు" వివరించింది అడవిదున్న.

"అయితే ఏం జరుగుతుం-దంటావూ?"

" సింహం పోయి ఏనుగు రాజయ్యింది. ఏనుగు పోయి తోడేలు/నక్కలకి పుట్టిన వజ్రకా-యుడు రాజయ్యాడు. ఇప్పుడు రాబోయేదేవరూ అన్నది వజ్రకా-యుడి 'నేర్పు' మీద ఆధారపడి-వుంది" నవ్వింది అడవిదున్న.

*********

పావురాళ్ళూ, పిచ్చుకలూ, కుందేళ్ళూ, మరికొన్ని దళిత జంతువులూ పక్షులూ ఏవిధం-గానూ పెద్దవాటితో పోటీ పడలేవు గనక మాకు 'రిజర్వేషన్లు' ఇచ్చి తీరాల్సిందే! అన్నాడు గద్దరాజు గోవర్ధనదాస్.

"మరి లేళ్ళూ, దుప్పులూ, అడవి మేకలూ, అడవి గొర్రెలూ మాకేదీ రక్షణ? అందుకే మా జాతిని రక్షించుకోవడానికి మాకూ కొంత శాతం రిజర్వేషన్లు కల్పిం-చాలి" వినతిపత్రం తయారు చేస్తూ అన్నారు దుప్పిసామి.

"కళాకారుల మాటేమిటి?" అరిచాయి రామచిలుకలూ, కో యిలలూ.

"మీకూ ఇవ్వాల్సిందే" సపోర్టి-చ్చింది గద్ద.

ఎక్కడెక్కడ ఎవరు సమా-వేశమవుతున్నదీ ఏ నిర్ణయాలు తీసుకుంటున్నదీ 'నక్క' గూఢ చారుల ద్వారా వజ్రకాయుడి-కీ, మంత్రివర్గానికీ తెలిసిపోతు-న్నది గనక, వాళ్లకి ఎత్తుకి పై ఎత్తు వేయడం ఏమాత్రం కష్టం కాలేదు.

*********

"ప్రియాతి ప్రియమైన ప్ర-జలారా, మీలోని అసంతృప్తులన్నీ ప్రస్తుత రాజుగారైన శ్రీ శ్రీ శ్రీ వజ్ర-కాయులవారు గమనించారు. అందువల్ల మన అడవిని 108 నియోజక వర్గాలుగా విభజించి, ఆ 108 లో 46 స్థానాలను రిజర్వ్-డు నియోజకవర్గాలుగా గ్గుర్తిం-చారు. దళిత, బలహీన, అల్ప సంఖ్యాక జంతు సముదాయా-లకి ఆ 46 స్థానాలనూ కేటాయిం-చారు. తద్వారా జంతు సమత ఏర్పడుతుందని మీరందరూ గుర్తించాలి. అదిగాక, కొత్తగా ఏర్పడబోయే మంత్రివర్గంలోనూ సదరు బలహీన వర్గాలకి రిజ-ర్వేషన్లు ఏర్పాటు చేసితీరతామని అరణ్యమాత సాక్షిగా వజ్రకాయు-లవారు ప్రమాణం చేసారు కనుక దండకారుణ్య జంతు ప్రజలం-దరూ తమ తమ ఓటుహక్కుని వినియోగించుకుని సమర్థులను తమ ప్రతినిధులుగా ఎన్నుకో-వలసిందని విజ్ఞప్తి చేస్తున్నాం. జై జంతుస్వామ్యం .. జై జై జం-తుస్వామ్యం" అంటూ డప్పులు మ్రోగిస్తూ గార్ధభాలు అరణ్యపు నలుమూలలా చాటాయి. ఎన్ని-కల నోటిఫికేషన్ ని చిన కరట-కుడూ, అరిదమనుడూ విడుదల చేశారు.

"పార్టీలు లేకుండా వర్గాలు ఏమిటీ?" పాయింట్ లేవదీసింది గుడ్లగూబ.

"ఉండాల్సిందే!" పట్టుబట్టింది కొంగరాణి.

"పార్టీలు ఎందుకు లేవూ సాధు జంతువులూ, క్రూర జంతువులూ అనే రెండు పార్టీలు అనాదిగా వస్తున్నవేగా" చిరునవ్వుతో అన్న ది తాబేలు.

"అవునవును. తాబేలు కలంశ్రీ గారు మహా విజ్ఞులు" వినయంగా అన్నది కపీశ్వర్ అనే మాజీ నాయిక.

ఎలెక్షన్లు నిర్విఘ్నంగా సాగాయి. ఓట్లు లెక్కింపబడ్డాయి.

అడవి మొత్తంలో ఎక్కువగా ఉన్నది సాధు జంతువులే గనక సాధు జంతువులే రాజ్యాన్ని ఏర్ప-రచాయి. అంటే, రాజ్యపాలన చేబట్టాయి. క్రూర జంతువులు అధికారాన్ని యధేచ్ఛగా ధిక్కరిం-చడం మొదలెట్టాయి. వాటిని శి-క్షించడం ఎలా? ప్రభుత్వానికి ఇదో పెద్ద తలనెప్పిగా తయారయిం-ది. ఎన్ని కుందేళ్ళూ, దుప్పులూ కలిస్తే సింహాన్ని ఓడించగలవూ? ఎన్ని బాతులూ కొంగలూ కలిస్తే పెద్దపులిని వేటాడకుండా ఆపగ-లవూ?

జంతుప్రభుత్వం ఆర్నెల్ల-లోనే కూలిపోయింది. 'ప్రజల కోరిక' మేరకు వజ్రకాయుడు మళ్ళీ ప్రధానమంత్రిగా సింహాస-నాన్ని అధిష్టించాడు. 'రాజు' అనే పదవి పేరు మాత్రమే పోయినా - అంతకంటే ఎక్కువ అధికారా-న్నే ప్రధానమంత్రిగా పొందానని ఆయనకు మాత్రమే తెలుసు. ప్ర-స్తుత అరణ్యంలో శాంతి నెలకొన్న విషయం నిజం.

మళ్ళీ కలుద్దాం.

భువనచంద్ర

# శ్రీసూక్తం

## పాలకుర్తి రామమూర్తి

మహాలక్ష్మి ఎప్పుడూ దివ్యాభిముఖంగా పయనిస్తూ ఉంటుంది. అంటే సాధకుడు తన సాధనలో దివ్యత్వాన్ని సాధిస్తూ ఊర్ధ్వముఖంగా పయనిస్తున్న నిష్పత్తిలోనే ఆధ్యాత్మిక ధర్మం ప్రకారం భగవచ్ఛక్తి సాధకుని కభిముఖంగా అవతరిస్తుంటుంది. అలా అమ్మ అవతరించాలి అంటే సాధకునిలో కొన్ని మంచి లక్షణాలు ఉండాలి. "న క్రోధో నచ మాత్సర్యం నలోభో న అశుభామతిః" అనగా, క్రోధము, ఈర్ష్య అసూయ లోభము చెడు ఆలోచనలు వంటివి సాధకునిలో పోవాలి. కామం వల్ల మోహం కలుగుతుంది. క్రోధం వల్ల మదం కలుగుతుంది. లోభం వల్ల మాత్సర్యం కలుగుతుంది. వీటన్నిటికీ మూలం కామం. "నాకు" కావాలి అనుకుంటే తప్పులేదు కాని అక్కడ అది ఆగదు "నాకే" కావాలి అంటుంది. అక్కడి నుండి పతనం ఆరంభమవుతుంది.

ప్రకృతిలో మూడు ముఖ్యమైన ధర్మాలున్నాయి. ఒకటి భౌతిక ధర్మం. ఉదాహరణకు మంచు ముక్క చల్లగా ఉంటుంది. అది దాని భౌతిక ధర్మం. రెండవది మానసిక ధర్మం. ఉదాహరణకు హిప్నాటిస్ట్ సూచనల మేరకు సబ్జెక్ట్ ఆ మంచు గడ్డలపై పడుకుంటాడు. అది మానసిక ధర్మం. అంటే భౌతిక ధర్మానికి అతీతంగా మానసిక ధర్మం ప్రకటితమౌతుంది. ఇక ఆధ్యాత్మిక ధర్మం ప్రకారం సాధనా నిష్పత్తిలో భగవత్ కటాక్షం మనకు చేరువవుతుంది.


ఆధ్యాత్మిక సాధనలో శాశ్వతానంద సాధన ఉత్పత్తి కాగా దానికి ఉపఫలితం (By product) ఐహిక భోగభాగ్యాలు. నిజానికి ఈ రెండూ వ్యక్తి



పురోగతిలో అవసరమైనవే. అయితే ఈ ఉపఫలితాన్ని మనం ఉపయోగించుకునే విధానాన్ని బట్టి మన ఉత్థాన పతనాలు నిర్ణయింపబడతాయి. దానం చేయాలి అంటే మన వద్ద ఉండాలి కదా... అమ్మవారి తత్త్వాన్ని తెలుసుకున్న వారికి ఈ రెండూ లభిస్తాయి. ఇవి మన నుండి విడిపోకుండా ఉండాలి అంటే ఆ బంధాన్ని దృఢతరం చేయాలి. అగ్ని దేవుని అదే కోరుకుంటున్నాడు సాధకుడు.

అశ్వపూర్వాం రథమధ్యాం
హస్తినాద ప్రబోధినీం
శ్రియం దేవీ ముపహ్వయే
శ్రీర్మా దేవీర్జుషతాం!

అశ్వము అనేది శక్తికి ప్రతీక. అమ్మవారి ముందు దివ్య శక్తులు ఉన్నాయి.. ఆమె రథం మధ్యలో ఉన్నది. రథము అంటే శరీరం... ఈ శరీరం అన్ని దివ్య శక్తులతో వినిర్మితమైనది. దీని మధ్యలో అంటే హృదయ స్థానంలో ఆ లక్ష్మీదేవి కూర్చొని ఉన్నది. ఏనుగుల ఘీంకారం చేత ప్రబోధింపబడుతుంది. అంటే... హృదయంలో "హృ" అనగా తీసుకొనుట. "ద" అంటే ఇవ్వడం కాగా "యం" అనగా నడక. హృదయం మన నుండి చెడు రక్తాన్ని తీసుకుంటుంది. ఆ రక్తాన్ని శుద్ధి చేసి మంచి రక్తాన్ని ఇస్తుంది. ఈ ప్రక్రియ హృదయంలో నిరంతర "నడక"గా సాగుతుంది. ఈ నడక సాగినంత కాలం మనకు



జీవితం. ఆ నడక ఆగిపోతే జీవితమూ ఆగిపోతుంది. అలాగే జ్ఞానమయులు, భక్తి చేతస్కులైన భక్తుల స్తుతులు ఆమె తీసుకుంటున్నది. వారికి ఆశీస్సులను, ఐశ్వర్యాన్ని ఇస్తుంది. ఈ విధానమే ఆమెకు నడతగా, నడకగా మారుతుంది.

"పూర్ణమదః" అంటే అది పూర్ణము. అంటే ఏది పూర్ణము? పెంజీకటికి ఆవల నున్నట్టి భగవంతుడు పూర్ణము. పూర్ణమే సర్వవ్యాపితము. అది శూన్యము కాదు వృత్తము. వృత్తము అంటే అన్నింటినీ చుట్టుకొని ఉన్నది అని అర్థం. వృత్తము ఉంటే దానికి ఒక కేంద్రము ఉంటుంది. పురము అంటే శరీరం వృత్తమైతే దాని కేంద్రము అమ్మవారు. ఆ కేంద్రమే మన జీవన నిర్వహణా కేంద్రము. దానికి బిందువు ఆ అమ్మవారే. శక్తి పూర్వకంగా రథం మధ్యలో తానుండి ఐశ్వర్యం అనబడే ఏనుగుల ఘీంకృతులతో సన్నద్ధమై సాగే ఆ అమ్మవారిని ఆహ్వానిస్తున్నాడు, సాధకుడు. పదాతిబలాలు, అశ్వబలం ముందు నడవగా రథబలం తన చుట్టూ ఉండగా ఏనుగులు వెనుక నడవడం చక్రవర్తి చిహ్నం. ఆమె అధిరోహించిన రథం పేరు "అపరాజిత".

దేవీం అంటే దీపించునది లేదా ప్రకాశించునది. ప్రకాశం జ్ఞానానికి గుర్తు.

ఉపనిషత్తులు ఇంద్రియాలను అశ్వములతో పోలుస్తాయి. బలమైన ఇంద్రియాలు విద్వాంసులను సైతం ఆకర్షిస్తాయని చెపుతారు. ఇవి బాహ్యంగా వ్యక్తమయ్యేటివి. ఇంద్రియాలకు ఆవాసం పురము లేదా శరీరం. మూలాధారంలో నిద్రావస్థలో ఉన్న కుండలినీ శక్తిని జాగృతంచేసి సహస్రారంలో చేర్చడం జీవుని లక్ష్యం. అది ఏనుగుల ఘీంకారం ద్వారా జరుగుతుందని చెపుతారు. అంటే గజముఖుని నాదం "ఓంకారం" ద్వారా జరుగుతుంది. అంటే ప్రణవోపాసన ద్వారా ఇంద్రియ నిగ్రహణ చేసి, హృదయస్థమైన దీవీ శక్తిని సహస్రారంలో లయం చేయడం సాధకుని మార్గంగా చెప్పబడింది.

ఆమె ఏనుగుల ఘీంకారము చేత మేలుకుంటున్నది, అంటున్నది శ్రీ సూక్తం. అనగా ఆమె నిద్రపోతుందనా? కాదు... చైతన్యానికి చేతన కలుగుతుంది లేదా జాగృతమవుతున్నది.

(ఇంకా వుంది)

# కరోనా

భువనచంద్ర

అరే కరోనా
జరా సునోనా
నోరు మూసుకుని
వహా బైఠోనా
నీ అమ్మమ్మలు
నీ అబ్బబ్బలు
ఎందరెందరో
తోకలు ముడిచార్
కలరా కన్నె
ప్లేగు పెద్దమ్మా
టీ. బీ. తాత
డెంగ్యూ బావ
ఉప్పెన లాగా
మీద దూకినా
బెంబేలెత్తక
బతికే ఉన్నాం.
నువ్వెంతా -నీ
బ్రతుకెంత .
నాణ్యత లేని
చైనా మేడ్ వి
నువ్వేం చేస్తావ్
ఏమి పొడుస్తావ్ ?
మిగతా వైరస్
భూతాల్లాగే
నీ లైఫూ ఓ
సంవత్సరమే .
ఆ తరువాత
టీకాలొస్తయ్
టాబ్లెట్లొ స్తయ్
నిన్ను తరుముత్తై
ఇంత దానికే
ఉలిక్కిపడితే,
ఇంత కాలమూ
ఎలాగ వున్నాం?
నిన్ను మించిన
వన్నెలాడులను
ఎంతో మందిని
కన్నాం కన్నాం .

నీతో పాటు
వారు అందరూ
వచ్చే పోయే
చిరు మేఘాలే .
ఎలా అందర్నీ
మించిన వాళ్ళను
చూపిస్తానో
చూస్తావా?
నీ దమ్మెంతో
చూపిస్తావా?
యుగాలనుంచీ
జనాల నెత్తిన
నాట్యం చేసే
మతాన్ని చూడు
మనుషుల చంపే
కులాన్ని చూడు
పేదా గొప్పల
తేడా చూడు
రాజకీయాల
రొచ్చును చూడు
క్షణ క్షణానికి
వామన మూర్తై
పెరుగుతున్న
అవినీతిని చూడు
పెరుగుతున్న
కాలుష్యం చూడు
తరిగి పోతున్న
సమతని చూడు
మానవత్వాన్ని
మట్టిలో కలిపే
ఆకలి చావుల
నృత్యం చూడు
రైతన్నల ఆ
క్రందన చూడు
బడా బాబుల
గొడుగులు పట్టే
బేంకు లోని

బండారం చూడు
పథకాల పేరుతో
పొట్టలు పెంచే
ప్రభుత్వాల
నైపుణ్యం చూడు
ఉచితం కోసం
బిచ్చగాళ్ళలా
క్యూలో నిలబడే
ప్రజల్ని చూడు
వందల ఏళ్ళుగ
పాతుకు పోయిన
లంచమనే మహా
మ్మారిని చూడు
ఇన్ని దెయ్యాలు
చుట్టూ వున్నా
బ్రతికేవున్నాం
బ్రతికేవున్నాం
నిన్న గాక మొన్న
వచ్చిన గుంటవి
నువ్వేం చేస్తావ్
ఎక్కడ ఉంటావ్
పళ్ళు నూరకే
పిల్ల పిశాచి
చెయ్యి జాపకే
చైనా బూచీ
వచ్చిన చోటుకె
వెళ్ళాక పోతే
అన్నీ మాని
నిన్నే తింటాం
మారుతి ఎదుటా
కుప్పి గంతులూ
తాతల ఎదుటా
చిలిపి దగ్గులూ
వచ్చిన దారినె
వెనక్కి పో
నీ చుట్టాలని
కలుపుకుపో

# ఎనిమిదవ రాష్ట్రపతి రామస్వామి వెంకట్రామన్



పాలెపు బుచ్చిరాజు

రామస్వామి వెంకట్రామన్ 1910వ సంవత్సరం మే నెల 4వ తేదీన జన్మించాడు. ఆయన జన్మ స్థలం తమిళనాడులోని తంజావూరు జిల్లా పట్టుకోట్టైకి సమిపంలోగల రాజమదాన్ అనే గ్రామం. తండ్రి పేరు రామస్వామి. తంజావూరులో ప్రసిద్ధి చెందిన వకీలు. వెంకట్రామన్ ప్రాథమిక విద్య అంతా పట్టుకోట్టైలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోనే జరిగింది. తిరుచినా పల్లిలోని నేషనల్ కాలేజిలో ఇంటరు చదివాక మద్రాసు విశ్వ విద్యాలయపు లయోలా కాలేజిలో అర్థ శాస్త్రంలో ఎం.ఎ. చదివాడు. మద్రాసు కాలేజిలో న్యాయశాస్త్ర పట్టా పొందాడు.

ఆయన చదువుకునే రోజుల్లో దేశంలో స్వాతంత్ర్య పోరాటం బహుళ ప్రచారంలో ఉంది.ఆంగ్లేయులు భారత దేశపు సిరి సంపదలు పాశ్చాత్య దేశాలకి తరలిస్తున్నారన్న వాదనలు ఎక్కువగా వినిపిస్తూ ఉండేవి. నాయకులు నడుంకట్టి ప్రారంభించిన ఎన్నో ఉద్యమాలు సామాన్య ప్రజానీకం నుంచి, కాలేజీలు, పాఠశాలల్లోకి కూడా వ్యాపించి విద్యార్థుల్ని ప్రభావితం చేశాయి. ఈ నేపథ్యంలో బ్రిటిషు ప్రభుత్వం భారతీయులపై చేస్తున్న అత్యాచారాల్ని అరికట్టాలనే పట్టుదల, వెంకట్రామన్ ని వకీలు వృత్తి చేపట్టేలా చేసింది. ఆ కారణంగా ఆయన చదువు పూర్తి అయ్యాక ఏనాడూ బ్రిటిషు ప్రభుత్వం క్రింద పని చేయడానికి అర్జీ పెట్టుకోలేదు. లా కాలేజి నుంచి బైటికి వస్తూనే ఆయన 1935వ సంవత్సరంలో మద్రాసు



హై కోర్టులో లాయరుగా ప్రాక్టీసు మొదలు పెట్టాడు.

ఆయన వివాహం 1938వ సంవత్సరంలో జానకీ దేవితో జరిగింది. వెంకట్రామన్ మద్రాసులో వకాలత్ చేస్తూ ఉన్నప్పుడు మహాత్మా గాంధీ, బాల గంగాధర తిలక్ సర్దార్ వల్లభాయ్ పటేల్ మొదలైన ప్రభుతుల పర్యవేక్షణలో స్వాతంత్ర్య సమరం జోరుగా సాగుతోంది. ఉద్యమం చేపట్టిన ప్రతి నాయకుడికీ ఒక కాలు జనసామాన్యంలో ఉం టే, మరొక కాలు జైలు లో ఉండేది. స్కూళ్ళలోను, కాలేజీల్లోనూ విద్యార్థులు చదువులు మానేసి ఆందోళనలు చేస్తున్నారు. గాంధీజీ నేతృత్వాన్ని నమ్మి అహింసాయుత ఉద్యమాలు, సత్యాగ్రహాలు ఒక ప్రక్క సాగుతూ ఉన్నా, ఉడుకు రక్తం ఉన్న యువకులు కొందరు శంఖం ఊదుతున్నారు. విప్లవ వాదాన్ని ప్రచారం చేస్తున్నారు. 'అమ్మా! బాబూ! అంటే పాశ్చాత్యులు వినరని, వారి జులుంని జులుం తోనే త్రిప్పి కొట్టాలని వారి గట్టి పట్టు. వారు చేసేది సాయుధపోరాటం. ఆంగ్లేయులు

ఎక్కడ కనిపిస్తే అక్కడ వారిని హతమార్చడమే వారి ధ్యేయం. అరెస్టయిన విప్లవకారులని నానా హింసలు పెట్టే పోలీసులు దొరికితే వదిలిపెట్టేవారు కారు.

ఆ పరంపరలో ఒక విప్లవ సంస్థలోని సభ్యులు ఒకసారి దక్షిణ తమిళనాడులోని ఒక పెద్ద బ్రిటిషు అధికారిని కాల్చి చంపేశారు. కాని వారు అజ్ఞాతంలోకి పారిపోక ముందే పట్టుబడిపోయారు. అలా పట్టుబడిన వారిని విప్లవాన్ని అణచివేయాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఏవిధమైన మినహాయింపూ లేకుండా ఉరి శిక్ష విధించేది. ఇప్పుడూ అలాగే జరిగింది. ఆ రోజుల్లో చక్రవర్తుల రాజగోపాలాచారి అతి గొప్ప పేరుపొందిన వకీలు. ఆయన శాయశక్తులా వారి తరపున వాదించి, వారి ప్రాణాలు కాపాడే ప్రయత్నం చేశాడు. కాని ఫలితం లేకపోయింది. శిక్ష అమలు చేసే తేదీ కూడా నిశ్చయం అయిపోయింది. అటువంటి విపత్కర పరిస్థితుల్లో వెంకట్రామన్ ఆ కేసు తాను తీసుకుని వాదించడానికి వకాల్తా పుచ్చుకున్నాడు. అదొక పెద్ద సాహసం. పెద్ద పెద్ద లాయర్లంతా పెదవులు విరిచారు. ఈయన రాజాజీ కంటే గొప్పవాడా? అని ముక్కు మీద వేలేసుకున్నారు.

వెంకట్రామన్ రాత్రింబవళ్ళు కృషి చేసి, కేసుని కూలంకషంగా అర్థం చేసుకుని, ఎందరినో ఆశ్రయించి, అతికష్టం మీద కేసుని ప్రివీ కౌన్సిల్ కి తీసుకు రాగలిగాడు. వెంటనే హోమ్ సెక్రటరీని స్వయంగా కలుసుకుని ఈ కేసుని



ప్రివీ కౌన్సిల్ విచారిస్తోందని విన్నవించాడు. పభుత్వంలో ప్రివీ కౌన్సిల్ అత్యధిక అధికారాలున్న విభాగం. కనుక అక్కడ విచారణలో ఉన్న కేసులో ముద్దాయిల్ని ఉరి తీయడానికి వీల్లేదు. తప్పనిసరి పరిస్థితుల్లో ప్రభుత్వానికి ఉరి శిక్ష రద్దు చేయవలసి వచ్చింది. అది తెలుసుకున్న రాజగోపాలాచారి, వెంకట్రామన్ తెలివితేటలకి అబ్బురపడి ఆయన్ని ప్రశంసించాడు.

ఈ ఘటనతో లాయర్ల లోకంలో వెంకట్రామన్ పేరు చిరస్థాయిగా నిలబడి పోయింది. అతి క్లిష్టమైన కేసులు సైతం ఆయన్ని ఆకర్షించ సాగాయి. వెంకట్రామన్ ప్రతిభని ఉపయోగించుకోవడానికి కాంగ్రెసు లాంటి సంస్థలు ముందుకి వచ్చాయి. వెంకట్రామన్ ఒక వకీలుగా విజయయాత్ర సాగిస్తున్నాడంటే, ఆయన ఆయన కేవలం ధనం సంపాదించడమే ధ్యేయంగా ఆ వృత్తిలో రాణిస్తున్నాడని కాదు. దేశంలో ఆనాడు నెలకొన్న రాజకీయ వాతావరణం మీద కూడా పరిజ్ఞానం గూడుకట్టుకుని ఉంది. అసలాయన ఆ వృత్తి చేపట్టడమే దేశసేవ కోసం. విప్లవ కారుల హక్కుల్ని కాపాడడం కోసం. ఆందోళనకారులకి న్యాయస్థానాలలో అన్యాయంగా శిక్షలు పడకుండా కాపాడడం కోసం. ఆవిధంగా ఆయన ఆంగ్లేయుల్ని దేశం నుంచి వెళ్లగొట్టే ప్రయత్నంలో పరోక్ష భాగస్వామి కూడా అయ్యాడు. వెంకట్రామన్ కి ఆర్థికమైన ఇబ్బందులు ఎప్పుడూ లేవు. సంపన్నుల కుటుంబంలో పుట్టి పెరిగినవాడు.

మహాత్మా గాంధీ 1942వ సంవత్సరంలో 'క్విట్ ఇండియా' ఉద్యమం నడిపిన తరుణంలో దేశం అంతా ఒక్కటై ఆయనకి అండగా నిలిచింది. యువత అత్యధిక ఉత్సాహంతో ప్రచారంలో భాగం అయింది. ఆ రోజుల్లో ఆ ఉద్యమం ప్రజల్ని ఎంతగా ప్రభావితం చేసిందంటే, దేశభక్తులు తమ సర్వస్వం వదిలిపెట్టి నిర్విరామంగా కృషి చేయసాగారు. వెంకట్రామన్ లో కూడా ని-

ద్రాణంగా ఉన్న దేశ భక్తి కట్టలు త్రెంచుకు ప్రవహించింది. ఆ ఉత్సాహంలో ఆయన వకాలత్ వదిలి పెట్టి ఆందోళనలో కాలు పెట్టాడు.

స్వాతంత్ర్య సంగ్రామం జరిగిన రోజుల్లో నడుంబిగించిన నాయకులెవ్వరూ జైలుకి వెళ్ళకుండా తప్పించుకోలేదు. వెంకట్రామన్ కూడా అరెస్టయి రెండేళ్ళ పాటు జైలు శిక్ష అనుభవించాడు. జైల్లో ఉన్నంత కాలం ఆయన ఎందుకిలా జరిగిందని కాని, సుఖంగా వకీలు వృత్తి చేసుకోక ఇలా కష్టాల్లో ఎందుకు పడ్డానని కాని విచారించలేదు. దానికి బదులు ఆ సమయాని ఆయన దేశం లోని పరిస్థితుల్ని బాగా అధ్యయనం చేసి, దాని పురోభివృద్ధికి ఎలా పాటుపడాలా అనే ఆలోచనల మీద కేంద్రీకరించాడు. గొప్ప రచయితలు రాసిన ఎన్నో గ్రంధాలు చదివాడు. ఒక విషయం మీద మాత్రం బాగా నమ్మకం కుదిరింది. దేశం అంతా స్వాతంత్ర్య సమరం ఊపందుకుంది. ప్రతి పట్టణంలోను, పల్లెలోనూ ప్రజలు జాగరూకులయ్యారు. ప్రాణాల్ని సహితం లెక్క చేయకుండా త్యాగాలు చేస్తున్నారు. మహాత్మా గాంధీ కూడా కార్య దీక్ష గలవాడు. అనుకున్న దానిని సాధించి తీరుతాడు. ఫలితంగా ఆనతి కాలంలోనే బ్రిటిషు ప్రభుత్వం దేశం విడిచి పోవడం ఖాయం.

ఇప్పటికే దేశంలో పారిశ్రమికీకరణం కారణంగా ఎన్నో పరిశ్రమలు పుట్టుకొచ్చాయి. ముందు ముందు ఇవి ఇంకా బాగా అభివృద్ధి చెందుతాయి. ఆ పరిశ్రమల్లో పనిచేసే కార్మికుల సంఖ్య కూడా ఇబ్బడి ముబ్బడిగా పెరుగుతుంది. వారంతా పేద కుటుంబాల నుంచి వచ్చినవారు. ఇప్పటికే వారి స్థితి అధ్వాన్నంగా ఉంది. చెమటోడ్చి పని చేసే ఈ వర్గం ప్రజల గురించి పట్టించుకునే నాధుడే లేదు. పెద్ద పెద్ద పారిశ్రామిక వేత్తలు ఆ కార్మికుల కష్టాల్ని దోచుకుంటున్నారు. కూలీల కంటూ ఏమీ సంఘటిత సంస్థలు లేవు. అంతా యాజమాన్యపు దయాదాక్షిణ్యాల మీద ఆధార పడుతున్నారు. వారికి రక్షణ కల్పించేవారే కరువయ్యారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చాక, ఈ అభివృద్ధి కార్యక్రమాలు ఇతోధికంగా పెరుగుతాయి. వాటిలో కూలీ నాలీ చేసే జనం ఎక్కువగా కావలసి వస్తుంది. కాని వారి బాగోగులు పట్టించుకునే వారు ఎవరూ ఉండరు. న్యాయ వ్యవస్థలో వారికి రక్షణ లేదు. ఈ దిశగా



సాగిన వెంకట్రామన్ ఆలోచనలు ఆయన ఒక గట్టి నిర్ణయం తీసుకోవడానికి దోహదం చేశాయి. తన న్యాయశాస్త్ర పరిజ్ఞానం ఉపయోగించి కార్మిక లోకానికి వారి హక్కుల్ని కాపాడుకునేలా చట్టాలు రూపొందించే దిశలో పని చేయాలి. వారిని అజ్ఞానాంధకారంలో ఉండకుండా వారి హక్కుల్నితెలియజేసి వారికోసం పోరాటం సలపాలి. కార్ఖానాల్లో, గనుల్లో చెమటోడ్చి పని చేసే కార్మికుల్ని ఎవరూ దోచుకోకుండా కాపాడాలి. అని నిశ్చయించుకున్నాడు. భవిష్యత్తులో జరగబోయే అన్యాయాల్ని ఆదిలోనే గుర్తించగలిగే మేధావి ఆయన.

జైలు లోంచి 1944వ సంవత్సరంలో విడుదల అయ్యాక, తమిళనాడు ప్రజలు ఆయకి ఘనమైన స్వాగతం ఇచ్చారు. ఇప్పుడు వెంకట్రామన్ కి న్యాయ వ్యవస్థలో ఎంత పేరు ఉందో, అంత పేరూ రాజకీయాల్లో కూడా వచ్చింది. ఇక ఆలస్యం చేయకుండా తన ఆలోచనలకి ఒక రూపం ఇవ్వదలచుకున్నాడు. తమిళనాడు కాంగ్రెసు పార్టీ తరపున కార్మిక సంఘం స్థాపించి, దానికోసం తన జీవితాన్ని పూర్తిగా అర్పణ చేశాడు. దేశంలో పూర్తిగా నిర్లక్ష్యం చేయబడిన కార్మిక వర్గానికి ఇప్పుడు ఒక దశా దిశా ఏర్పడ్డాయి. కార్మిక లోకానికి, తద్వారా దేశానికి సేవచేసే భాగ్యం ఆయనకి లభించింది.

విప్లవ పోరాటంలో భాగంగా నేతాజీ సుభాష్ చంద్ర బోస్

ఆజాద్ హింద్ ఫౌజ్ స్థాపించి, 1944వ సంవత్సరంలో స్వాతంత్ర్యం కోసం సాయుధపోరాటం ఆరంభించాడు. ఆ సమయంలో ఆయనతో సహకరించిన కొందరు సభ్యుల్ని ప్రభుత్వం అరెస్టుచేసి సింగపూర్ లోను, మలయాలోను జైళ్ళలో బంధించింది. అక్కడ వారి మీద కేసులు పెట్టి విచారణ సమయంలో మెహర్బానీ కోసం, విమర్శల నుంచి తప్పించుకోవడం కోసం, భారత దేశంనుంచి కూడా నిందితుల తరఫున వాదించడానికి లాయర్లని పిలిపించింది. ఆ బృందంలో పాటు వెంకట్రామన్ కూడా వెళ్ళాడు. అక్కడ వారి వాద ప్రతివాదనలలో ప్రభుత్వం తరఫున వాదించే లాయర్లని మట్టి కరపించి, తన మేదాశక్తినంతా ఉపయోగించి, మన స్వాతంత్ర్య సైనికుల తరఫున వాదించి, ఎందరినో చెర నుంచి విడి పించాడు.

దేశానికి స్వాతంత్ర్యంవచ్చిన రోజున దేశ విభజన జరిగి, హిందూ ముస్లిం లు కొట్లాడుకుని, వేలకొద్దీ ప్రాణాలు నష్టపోతూ ఉంటే, ప్రజలు మత సామరస్యం పాటించడాని కి ఎంతో కృషి చేశాడు.

స్వాతంత్ర్యానంతరం 1949వ సంవత్సరంలో తంజావూరులో 'లేబర్ లా జర్నల్' పేరిట కార్మిక వర్గాన్ని సమర్థిస్తూ ఒక పత్రిక స్థాపించాడు. దానిలో కార్మికుల హక్కుల గురించి, విధి విధానాల గురించి, వివరిస్తూవాటి వల్ల ఎలా లాభాలు పొందాలో తెలియజేస్తూ వ్యాసాలు ప్రచురించ



సాగాడు. ఆయన 'లేబర్ లా' క్షుణ్ణంగా చదివి అర్థం చేసుకుని దాని వివరాలు ఆ పత్రికలో ఇస్తూ ఉండేవాడు. ఆ కారణంగా కార్మిక సంఘాలకి, వారి తరఫున న్యాయం కోసం పోరాడే లాయర్లకి అది ఎంతో ఉపయోగకరంగా ఉండేది. కొద్దికాలంలోనే ఆ పత్రిక ద్వారా వెంకట్రామన్ కార్మిక లోకానికి తలలోని నాల్క అయ్యాడు.

క్రమంగా ఆయన రాజకీయాల్లోనూ, న్యాయస్థానాల్లోనూ, ప్రజలలోనూ పత్రికలో ప్రకటించే వ్యాసాలు, వ్యాఖ్యానాల కారణంగా సుస్థిరమైన స్థానాన్ని పొందగలిగాడు. అది ఎంత త్వరగా ఎదిగిందంటే, సంవత్సరం తిరక్కుండా భారదేశపు ప్రొవిజనల్ పార్లమెంటులో సభ్యుడిగా ఎన్నిక అయ్యాడు.

అది మొదలు కేంద్రంలో పండిట్ జవహర్ లాల్ నెహ్రూకి సన్నిహితుడిగా ఎన్నో పదవుల్లో రాణించాడు. రాష్ట్రంలోను కేంద్రంలోను మంత్రిగా దేశ సేవ చేశాడు. ఉపరాష్ట్రపతిగా, తరవాత రాష్ట్రపతిగా పని చేసి దేశం పట్ల తన ఋణం తీర్చుకున్నాడు. ఆయన అంత ప్రతిభాశాలి అయిఉండి కూడా పదవులకోసం ప్రాకులాడలేదు. ఏపని చేసినా నిజమైన కార్యదీక్షతో చేసేవాడు. ఫలితం గురించి ఆలోచించకుండా తను న్యాయమని నమ్మిన దానిని ఆచరించేవాడు. 'కర్మణ్యేవాధికారస్తే మా ఫలేషు కదాచన' అన్న గీతావాక్యం ఆయన విషయంలో అక్షర సత్యం. ఆయన ఒక గొప్ప కర్మయోగి. స్వాతంత్ర్య సమరంలో జైలుకి వెళ్ళినందుకు ఆయన్ని ప్రభుత్వం తామ్రపత్రంతో సన్మానించింది. ఆయన నిజాయితీకి, దేశం పట్ల ఆయనకున్న అభిమానానికి క్రింది ఉదంతం గీటురాయి.

తమిళనాడులో కామరాజు ముఖ్యమంత్రిగా ఉన్నపుడు, వెంకట్రామన్ పరిశ్రమల మంత్రిగా ఉండేవాడు. అప్పట్లో అక్కడ పరిశ్రమల పరిస్థితి అధ్వాన్నంగా ఉండేది. క్రొత్త పరిశ్రమలని ప్రోత్సహించే విధానంలో భాగంగా జపాను నుంచి ఎనిమిది బట్టల మిల్లులు కొనడానికి నిశ్చయం అయింది. ఆ సందర్భంలో అలవాటు ప్రకారం జపాను కంపెనీ మంత్రిగారికి పన్నెండు శాతం కమిషన్ ఇస్తామని చెప్పారు. అప్పుడాయన 'నాకేమీ వద్దు. దానికి బదులు అదే కాంట్రాక్టులో మరొక మిల్లు అదనంగా ఇవ్వండి' అని చెప్పాడు. కంపెనీ వాళ్ళు ఒకరి మొహాలు ఒకరు చూసుకుంటూ ఉండిపోయారు. అసలు దేశ భక్తికి జపాను ప్రపంచంలో ప్రసిద్ధి. అటువంటి వారికే వెంకట్రామన్ నిజాయితీ చెంప పెట్టు అయింది. గొప్పవారి ముద్ర అలా ఉంటుంది!!

# వేమూరి వారి పాకశాస్త్రం:

# కాఫీ మంచిదా? కాదా?



## వేమూరి వేంకటేశ్వరరావు

తెల్లారి లేచిన తరువాత కప్పు కాఫీ తాగితేకాని బండి కదలదు కనుక కాఫీ ఆరోగ్యానికి మంచిదా కాదా అన్న ప్రశ్న పుట్టక మానదు. మోతాదు మించకుండా ఉన్నంత సేపు కాఫీ చాలమందికి మంచే చేస్తుందని తెలిసినవారు తీర్మానిస్తున్నారు. మోతాదు అంటే రోజుకి మూడు-నాలుగు కప్పులు. కప్పు అంటే 8 ఔన్సులు (230 మిల్లీలీటర్లు).

కాఫీ తాగగానే ఉత్సాహం పుట్టడానికి కారణం కెఫీను అనే రసాయనం! ఉరమరగా కప్పు ఒక్కంటికి 100 మిల్లీగ్రాములు కెఫీను ఉంటుంది. ఒక కప్పులో నిజంగా ఎంత కెఫీను ఉంటుందో చెప్పడం కష్టం: అది గింజల జాతిని బట్టి, గింజలని వేయించిన పద్ధతిని బట్టి, కాఫీని తయారుచేసిన పద్ధతిని బట్టి మారుతుంది. కనుక మోతాదు అంటే రోజుకి 400 మిల్లీగ్రాముల కెఫీను అని అనుకోవడం రివాజు.

పొగ తాగనివాడు దున్నపోతై పుడతాడో లేదో చెప్పలేను కానీ కాఫీ తాగే వాళ్ళు మాత్రం తాగని వాళ్ళ కంటే ఎక్కువ కాలం బతికే సావకాశాలు ఉన్నాయని గణాంకాలు చెబుతున్నాయి. ఇటీవలి (2015) వరకు కాఫీ ఎక్కువ తాగితే కేన్సరు వస్తుందని కొందరు భయపడేవారు. కానీ సక్రమ ఆహారంలో కాఫీకి కూడా ఒక పాత్ర ఉందని ఇప్పుడు ఒప్పుకుంటున్నారు. ఉత్తేజం పుట్టించడానికి పొగ తాగడం కంటే కాఫీ తాగడం ఎన్నో రెట్లు మెరుగు; కాఫీ తాగడం దురలవాటు కాదు!



కాఫీ ఆరోగ్యానికి హాని చేయక పోగా, మంచే చేస్తుందనడానికి కారణం కాఫీలో దండిగా ఉన్న బహుఫీనాలులు (polyphenols) అనే రసాయనాలు ట. వీటికి ప్రతిభస్మీకరణ (antioxident) లక్షణాలు ఉన్నాయిట. ప్రతిభస్మీకరణులు (antioxidents) అనేవి ఒక జాతి బణువులు (molecules). ఇవి శరీరంలోని జీవకణాలని విశృంఖల రాసుల (free radicals) దాడి నుండి రక్షిస్తాయి. ఈ విశృంఖల రాసులని అదుపు చెయ్యకుండా వదలి పెడితే అవి రోగాలకి దారి తీస్తాయనడానికి ప్రబలమైన ఆధారాలు ఉన్నాయి.

ఇంతకీ ఈ విశృంఖల రాసులనేవి ఏమిటిట? టూకీగా చెప్పాలంటే ఇవి చాల చలాకీతనం ప్రదర్శించే అయానులు (ions) (అనగా, నికరం అయిన విద్యుదావేశంతో ఉన్న అణువు కానీ బణువు కానీ). ఇవి పొగ తాగినప్పుడు కానీ, వికిరణాల తాకిడికి గురి అయినప్పు-

డు కానీ పుట్టడమే కాకుండా జీర్ణ-ప్రక్రియ జరుగుతున్నప్పుడు కూడా పుట్టుకొస్తాయి కనుక వీటి నుండి తప్పించుకోలేము. మనం చేయగ-లిగేది వీటిని అదుపులో ఉంచడం. అందుకని మనం తినే తిండిలో ప్రతిభస్మీకరణులు ఉండాలి. అదీ శాస్త్రం! బహుఫీనాలులు అనబడే ఈ ప్రతిభస్మీకరణులు అనే రసా-యనాలు కాఫీలోనే కాదు, అనేక కాయగూరలలోను, పండ్లలోనూ కూడా ఉన్నాయి. కాఫీలో విటమి-నులు, మెగ్నీసియం, పొటాసియం కూడా ఉన్నాయి కనుక కాఫీకి సక్రమ ఆహారంలో చిన్న పోషకపా-త్ర లేకపోలేదు.

అలాగని కాఫీ అందరికి అన్ని వే-ళల్లోనూ మంచి చేస్తుందని ని-ర్ద్వంద్వంగా ఉద్ఘాటించి చెప్పలేము. మోతాదు మించితే కొందరికి (ఉ. గర్భిణీ స్త్రీలకి, పాలిచ్చే తల్లులకి ) హాని చెయ్యవచ్చు. తల్లి రక్తంలోని కెఫీను జరాయువు (placenta) ని దాటి శిశువు రక్తంలోకి ప్రవేశించగ-లదు కనుక గర్భిణీ స్త్రీలు సేవించే కెఫీన్ ఇతరుల నిర్దిష్టాంశములో సగం - అనగా రోజుకి 200 మిల్లీ-గ్రాములు - మించకూడదని అం-టున్నారు.

కాఫీ తాగడం వల్ల ఒరిగే మంచి పర్యవసానాలకి మూల కారణం కాఫీ ఒక్కటే కాక పోవచ్చు; మనకి తెలియని అంతర్గత కారణాంశాల (confounding factors) వల్ల మనకి కనిపించే మంచి కానీ, చెడు కానీ కాఫీ వల్లనే కలుగుతున్నదని భ్రమ కలిగిస్తూ ఉండి ఉండొచ్చు. ఉదాహరణకి పొద్దు పొడవకుండా లేచే వాళ్ళకి కాఫీ చుక్క పడకపో-



తే బండి కదలదని అనుకుందాం. అప్పుడు వారి ఆరోగ్యానికి కారణం పొద్దు పొడవకుండా లేవడమా? లేక, కాఫీ తాగడమా అన్న ప్రశ్న పుడుతుంది కదా! కనుక శాస్త్రం ఏది చెప్పినా - మాయాబజారులో చెప్పి-నట్టు కాక - నిష్కర్షగా చెప్పుదు; గోడ మీది పిల్లి లాగానే చెబుతుంది.

కాఫీ గుణగణాల మీద కాఫీ తయారు చేసే పద్ధతి ప్రభావం ఏదైనా ఉందా? ఉందనే అం-టున్నారు. నా చిన్నతనంలో మా



ఇంట్లో కాఫీ తయారు చేసే పద్ధతి-ని టూకీగా చెబుతాను. మా ఊళ్ళో మూడు రకాల గింజలు దొరికేవి: నీలగిరి గుండు, నీలగిరి బద్ద, నరిసీపట్నం బద్ద. ఈ గింజలని గిన్నెలో వేసి, కుంపటి మీద పెట్టి వేయించేవారు. అవి దోరగా వేగిన తరువాత వాటిని అమాందస్తాలో వేసి గుండ కొట్టి డబ్బాలో దాచుకు-నేవారు. అప్పుడు సలసల మరు-గుతున్న నీళ్ళల్లో కప్పు ఒక్కంటి-కి గరిటెడు గుండ వేసి, వెంటనే కుంపటి మీద నుండి దింపేసి, నాలుగు నిముషాలు కాగనిచ్చి లేదా క్వధించి (brew చేసి), ఆ కషాయా-న్ని (decoction) తేర్చి, దానిలో వేడి పాలు, పంచదార కలిపి తాగేవారు. ఫిల్టరు కాఫీ చేసుకోడానికి చిన్న ఇత్తడి ఫిల్టర్లు ఉండేవి. ఫిల్టరు అంటే రెండు గిన్నెలు - ఒకదాని మీద మరొకటి - దొంతిలా అమర్చి ఉండేవి. పైనున్న గిన్నెకి అడుగున చిన్నచిన్న చిల్లులు ఉండేవి. కాఫీ గుండని ఈ పై గిన్నెలో వేసి, దాంట్లో మరుగు నీళ్లు పోసి, అయిదు

నిముషాలు ఆగితే అడుగు గిన్నె-లోకి కషాయం దిగేది.

కాఫీ రుచి, కాఫీ షాడబం (flavor) కాఫీ తోటలు పెరిగే నేల మీద, వాతావరణం మీద, గింజల జాతి మీద ఆధారపడి ఉంటాయి. ఇండియాలో ఉన్న కాఫీ తోటలు దక్షిణ అమెరికా కాఫీతో పోటీ పడలేవు. గింజలు స్థూలంగా రెండు జాతులు:అరబికా, రోబస్టా. గింజలని దోరగా వేయించాలా? ముదురుగా వేయించాలా? గింజలని మెత్తగా పొడి చెయ్యాలా? గరుగ్గరుగ్గా, మొరుంలా, పొడి చెయ్యాలా? మంచి కాఫీ కావాలంటే అప్పటికప్పుడు గింజలని వేయించుకొని, గుండ కొట్టుకుని తయారు చేసుకోవాలి.

కాఫీ తయారు చెయ్యడానికి సవాలక్ష అధునాతన పద్ధతులు ఉన్నాయి. ఉదాహరణకి: ఎస్ప్రెస్సో (espresso), ఎయిరోప్రెస్, ఫ్రెంచి ప్రెస్, పెర్కొలేటర్, గలన (ఫిల్టర్) కాఫీ, తత్క్షణ (ఇన్స్టెంట్)కాఫీ, వగైరాలు. వీటి ప్రభావం ఏమిటి? కాఫీని తయారు (brew) చేసే అధునాతనమైన పద్ధతులు స్థూలంగా మూడు రకాలు: (1) పీడనం ఉపయోగించి (brewing using pressure), (2)నానబెట్టి




(brewing via steeping), (3) గలనం ఉపయోగించి (brewing using filtration or dripping). మంచి కాఫీని తయారు చెయ్యడానికి ప్రత్యేకమైన యంత్రాలు వస్తున్నాయి. ఇవి ఒకొక్కటి 200 డాలర్లు (రూపాయలు కాదు) పైబడే ఉంటాయి. అందుకనే అమెరికాలో మంచి కాఫీ కొనుక్కుని తాగాలంటే కప్పు ఒక్కంటికి 5 డాలర్లు ఖర్చు అవుతుంది. మరొక కప్పు కావలిస్తే మరొక 5 చెల్లించుకోవాలి! నేను అమెరికా వెళ్లిన కొత్తలో 10 పైసలకి ఎన్ని కప్పులు కావలిస్తే అన్ని పోసేవారు!



తత్క్షణ (ఇన్స్టెంట్) కాఫీని, దిగమరిగించిన కాఫీని మినహాయించగా మిగిలిన అన్ని రకాల కాఫీలు మంచే చేస్తాయని అంటున్నారు. దిగమరిగించిన కాఫీని దీక్షగా పరిశీలించి చూడండి; కాఫీ మీద నూనె మరకల లాంటి మరకలు కనిపిస్తాయి. అవి కఫెస్టాల్ (Cafestol), కావియోల్ (kahweol) అనే రసాయనాలు. ఇవి రక్తంలో ఉన్న చెడ్డ కొలెస్ట్రాల్ ని పెంచి, మంచి కొలెస్ట్రాల్ ని తగ్గిస్తాయిట. కనుక పాత కాఫీని తిరిగి వేడి చేసుకుని తాగడం మంచిది కాదేమో.

కాఫీ తాగడం ఒక వ్యసనంలా పరిణమించే ప్రమాదం ఉందా? కాఫీ తాగిన అరగంటకి అందులోఉన్న కెఫీను తన ప్రభావాన్ని చూపడం మొదలు పెడుతుంది: నిద్రమత్తుని వదల గొడుతుంది, మానసిక అవస్థని ఉత్తేజ పరుస్తుంది, ఏకాగ్రతని పెంచుతుంది. తాగిన కాఫీ ప్రభావం నాలుగు గంటల పాటు ఉంటుంది కనుక పడకవేళకి కనీసం నాలుగు గంటల ముందు కాఫీ తాగడం మానేస్తే నిద్రకి భంగం ఉండదు.

కాఫీలో పాలు, పంచదార వేసుకోవడంలో లాభనష్టాలు ఏమిటి? అతిశుద్ధవాదులు నల్లటి కాఫీయే అసలు కాఫీ అనిన్ని అందులో పాలు, పంచదార వేసి దానిని కల్తీ చెయ్యవద్దని అంటారు. కానీ కాసిన్ని పాలు పడగానే కాఫీకి స్వతహాగా ఉన్న చిరుచేదు పోతుంది కనుక కొంతమంది పాలు వేసుకోకుండా తాగలేరు. నల్ల కాఫీలో కేవలం రెండు కేలరీలు మాత్రమే ఉంటే పాలు, పంచదార దట్టించిన కొన్ని కాఫీలలో 800 కేలరీలు వరకు ఉండొచ్చు. డయబెటీస్ వంటి వ్యాధులు ఉన్నవారు ఈ రకం కాఫీలకి దూరంగా ఉండాలి.

# ప్రేమంటే ఇంతే

ఇంద్రగంటి వేంకట సుబ్బారావు



(గత సంచిక తరువాయి)

ఒక నెల రోజుల తరువాత కొంచెం హైదరాబాదు వాతావరణానికి, పరిస్థితులకి, రోడ్లకి అలవాటు పడినాక ఒక రోజు విశ్వనాథం గారి ఇంటికి వెళ్ళాడు కృష్ణమోహన్. అందరితో కుశల ప్రశ్నలు అనంతరం అందరూ కబుర్లు చెప్పుకుని భోజనాలు అయినాక అడ్డాట మొదలెట్టారు. కృష్ణమోహన్, అనూరాధ అడ్డాట ఆడలేదు, వాళ్ళిద్దరూ కాస్సేపు వాళ్ళ పోస్ట్ గ్రాడ్యుఏషన్ చదువుల గురించి, గత రెండేళ్ళలో జరిగిన సంగతుల గురించి మాట్లాడుకున్నారు.

"బావా నీకు తెలుసా ఇది మా స్వంత ఇల్లు, రా చూద్దువుగాని" అంటూ లేచింది అనూరాధ.

"అవును సుమారు సంవత్సరం క్రితం అక్క, బావగారు గృహప్రవేశానికి వచ్చారు కదా గుర్తుంది"

ఇల్లు కృష్ణమోహన్కి బాగా నచ్చింది. ఇల్లు చాలా అందంగా కట్టారు. మేడమీద అనూరాధ గదిలో కూర్చుని ఇద్దరూ కబుర్లు మొదలు పెట్టారు.

"బావా ఈ రెండు సంవత్సరాలలో నేను నిన్ను జ్ఞాపకం చేసుకోని రోజంటూ లేదు, ఈ రెండు సంవత్సరాలు రెండు యుగాలులా గడిచాయి. నీకు ఈ వూళ్ళోనే ఉద్యోగం రావడం నా అదృష్టం, మళ్ళీ కలుసుకొనే భాగ్యం కలిగింది. నిజంగా నేను నిన్ను మిస్ అయ్యాను బావా" అంటూ ఆమె ఉద్వేగంగా చెప్పి అతని ప్రక్కకు వచ్చి కూర్చుని అతని భుజం మీద తల వాల్చింది.

"సరే, ఇప్పుడు ఈ వూరులోనే వున్నానుగా" ఎటువంటి ఉద్వేగానికి లోనవకుండా ఆమె తల నిమురుతూ చెప్పాడు కృష్ణమోహన్.

"ఈ రెండేళ్ళలో నేను ఎప్పుడైనా గుర్తొచ్చానా బావా?" అది విన్న కృష్ణమోహన్ ఏమీ మాట్లాడకుండా ఒక చిరునవ్వు మాత్రం నవ్వాడు.

"బావా నువ్వు చుపా రుస్తుంవి, అన్నీ నీలోనే దాచుకుంటావు, నిన్ను పసిగట్టటం చాలా కష్టం"

"ఇంకేమిటి సంగతులు"

"నీ ఉద్యోగం ఎలా వుంది, రూము సౌకర్యంగా వుందా?'

"వుద్యోగం బాగుంది, ఇంకా నెలే కదా అయ్యింది కుదుటపడడానికి సమయం పడుతుంది. రూం బాగుంది, ఇంటి యజమాని సెక్రటేరియట్లో పని చేస్తున్నారు. వారు, వారి భార్య, పిల్లలు అందరూ నన్ను ఇంట్లో మనిషి లాగ చూసుకుంటున్నారు. వారి బావగారు రైల్వేలో కంట్రోలర్గా చేస్తున్నారు, ఆయన మా నాన్నగారు, కలకత్తాలో కలిసి పని చేసారు, నన్ను చిన్నప్పటి నుండి ఆయన చూసారు, ఆయన సిఫార్సుతోనే ఈ గది దొరికింది"

"గుడ్ అలా హోంలీగా వుంటే ఇంటి మీద ధ్యాస వుండదు. ప్రతి శనివారం వేంకటేశ్వరస్వామి గుడికి వెళుతున్నావా?"

"ఆ వెళుతున్నాను నౌబత్ప హాడ్ ప్రక్కనే వున్న కొండమీద వేంకటేశ్వరస్వామి గుడిని బిర్లా కట్టించారు, అక్కడికి వెళుతున్నాను. గుడి చాలా బాగా కట్టారు, భవిష్యత్తులో ఆ కోవెల ఒక పర్యాటక కేంద్రము అవుతుంది".

"ఇంకేమిటి సంగతులు, మీ నాన్నగారు, అమ్మగారు, తమ్ముళ్ళు, వైదేహి వదిన, సత్యం అన్నయ్య, పిల్లలు అంతా కులాసానా?"

"అంతా కులాసా, రాధా సంగీత సాధన చేస్తున్నావా? నీ పాట విని రెండు సంవత్సరాలు అయ్యింది, మంచి కీర్తన ఒకటి పాడవా"

"చేస్తున్నాను, నువ్వు అడగటం నేను కాదనడమా? అలాగే పాడతాను"

"సామజవరగమన" "బాల కనక మయ చేల" త్యాగరజ కీర్తనలు పాడింది అనూరాధ.

"థాంక్యూ రాధా అద్భుతం! చాలా చక్కగా పాడావు, మళ్ళీ ఇన్నాళ్ళకి నీ పాట వినే భాగ్యం నాకు కలిగింది, ఇదిగో నా కానుక" అని తను తెచ్చిన చాక్లెట్లు ఇచ్చాడు.

"ఒహ్! థాంక్యూ బావా, నువ్వు వచ్చిన దగ్గర నుండి నేను వీటి కోసమే ఎదురుచూస్తున్నాను, ఎందుకో తెలుసా?"

"ఇందులో తెలియకపోవడానికి ఏముంది? నీకు చాక్లెట్స్ అంటే ఇష్టం"

"చెప్పాను కదా నువ్వు బయటకి తేలవు, కాకినాడలో వున్నపుడు అలవాటు కదా, అందుకని ఎలా మరిచిపోతాను, ఇది మరచిపోతే నిన్ను మరచిపోయినట్లే అని అంటావనుకున్నా"... దానికీ కృష్ణమోహన్ నుండి ఒక చిద్విలాసమే సమాధానమయ్యింది.

"అన్నింటికి ఒక చిరు నవ్వు నవ్వుతున్నావు, ఈ రెండేళ్ళలో నీలో మార్పు వచ్చింది, నా గురించి ఆలోచించడం మానేసావు"

"మార్పు సహజం, మార్పు నైజము, మార్పు ప్రకృతి ధర్మం, మార్పు ప్రగతికి మూలం"

"ఈ మధ్య కవితలు కూడా రాస్తున్నావా? బావా నువ్వు చాలా తెలివైన వాడివి, నీ మనసులోని మాటని బయటకు రానివ్వకుండా విషయాన్ని దాటవేసి, ఎదట వాళ్ళకి నొప్పి తెలియకుండా గమ్మత్తుగా ఆట పట్టిస్తావు. నీకు "కృష్ణ" అని పేరు పెట్టినందుకు ఆ శ్రీకృష్ణుడి చిలిపితనం, కొంటెతనం నీలో చాలా వుంది."

"నీ పొగడ్తకి థాంక్స్"

"నా చేత పాట పాడించుకున్నావు, మరి నువ్వు పాడవా? ప్లీజ్" అని అనూరాధ అడిగింది. కృష్ణమోహన్ "జంగ్లీ" సినిమాలో మహమ్మద్ రఫీ పాడిన 'ఏహెసాన్ తెరా హోగా ముజ్‌పర్ ' అనే పాటని పాడాడు.

"థాంక్యూ బావా ఇంత చక్కటి మెలొడీని రఫీగారు పాడినట్లే పాడావు, చాలా మంచి పాట. సరేగాని శనివారం ఎన్ని గంటలకి కోవెలకి వెళతావు"

"ఆరు, ఆరుంపావు మధ్యలో అక్కడ వుంటాను, దర్శనం చేసుకున్నాక సుమారు ఏడున్నరవరకు అక్కడ గార్డెన్‌లోని, ఆలయం వెనుక కూర్చుంటాను, మనసు ప్రశాంతముగా వుంటుంది. కోవెల అంతా పాలరాతితో కట్టడం వలన చాలా అందంగా వుంది, ఆ వాతావరణం మొత్తం ఎంతో ఆహ్లాదముగా వుండి, ఏదో అనిర్వచనీయమైన ఆనందాన్ని కలిగిస్తుంది, అక్కడ నుండి కదల బుద్ధి వెయ్యదు"

"అలాగా! నేనింతవరకు ఆ కోవెల చూడలేదు, చూసిన వాళ్ళందరూ చాలా బాగుంటుందని చెప్పారు... సార్! మీరు అనుమతిస్తే వచ్చే శనివారం నేను కూడా కోవెలకి వస్తాను"

"తప్పకుండా వెళ్ళు, దానికి నా అనుమతి ఎందుకు?"

"మరదే! నేను వస్తాను అన్నాను కానీ వెళతాను అనలేదు. అంటే నీతో వస్తాను అని అర్థం అమోల్‌పాలేకర్‌గారు, అందుకే మీ అనుమతి" మళ్ళీ ఒక చిరునవ్వు నవ్వాడు కృష్ణమోహన్.

"ఈ మధ్య కొత్తగా ఈ చిరునవ్వుతో అవతలవాళ్ళని ఉడికిస్తున్నావు, అయినా మా కోనసీమ వాళ్ళంటే నీకు అలుసు బావా! అందుకే నన్ను చూసి వెటకారంగా నవ్వుతున్నావు" అంది అనూరాధ లేని కోపాన్ని నటిస్తూ.

"నీ దగ్గర సమాధానము లేనపుడు, చిరునవ్వుని మించిన ఆయుధం లేదు' అన్నారు పెద్దలు, అందుకే అలవాటు చేసుకున్నాను. సరే మధ్యలో ఈ కోనసీమ ఎక్కడినుండి వచ్చింది?"

"కోనసీమ ఎక్కడ నుండి వచ్చిందా?...మన దగ్గర పాయింట్ లేనపుడు టాపిక్ మార్చి అవతలి వాళ్ళని గందరగోళపరచాలి అని కూడా పెద్దలు అన్నారు"

"అబ్బో! జయచిత్ర దగ్గర చాలా విషయం వుందే, అమ్మాయిగారికి మేనేజ్‌మెంట్ కిటుకులు బాగానే తెలుసే!"

"మరే సహవాస దోషం, చూసావా ఇన్ని కబుర్లు చెపుతున్నావుగాని శనివారం కోవెలకి రా అని మాత్రం అనడంలేదు"

"అలాగే రా, నువ్వు ఒక్కర్తివే

వస్తావా? నేను పికప్ చేసుకోనా?"
"నీ ఆఫీస్ ఫోన్ నంబర్ ఇయ్యి, నేను శుక్రవారం ఫోన్ చేసి చెబుతాను"
"సరే అలాగే చెయ్యి, చాలా సేపు అయింది పైకి వచ్చి పద క్రిందకి వెళదాము"
క్రిందకి వెళ్ళినాక అందరూ కలిసి కాఫీలు త్రాగి కబుర్లు చెప్పుకుంటున్న సమయంలో...
"బావా నీకు ఉద్యోగం వచ్చింది మరి మాకు పార్టీ ఎప్పుడు ఇస్తావు" అని అడిగింది అనూరాధ, ఆమెతో శృతి కలిపారు మిగతావారు.
"నేను రెడీ, మీరెప్పుడు అంటే అప్పుడు" అన్నాడు కృష్ణమోహన్.
"ఆదివారం అందరికీ వీలవుతుందా?" అడిగాడు రవి. అందరూ OK అన్నారు. విశ్వనాథంగారు, పార్వతమ్మగారు "మేము రాము, ఆ హోటళ్ళలో అన్నిరకాలు వండుతారు, ఉల్లీ మల్లీ వేస్తారు" అన్నారు. కృష్ణమోహన్ వారిని ఒప్పించ డానికి ప్రయత్నించాడు కానీ వారు సున్నితంగా తిరస్కరించి "మరోలా అనుకోకయ్యా మోహన్" అన్నారు.
ఏ హోటల్ అన్నదాని మీద చర్చ జరిగి చివరికి లకడీకాపూల్ దగ్గర అశోకా హోటల్లో ఆదివారం మధ్యాహ్నం 12 గం 30 ని లకు కలవడానికి నిర్ణయం తీసుకున్నారు.
కృష్ణమోహన్ సాయంత్రం బయలుదేరుతుండగా "బావా నన్ను రెండు వీధుల అవతల గాజులదుకాణందగ్గరదించెయ్యి, గాజులు కొనుక్కోవాలి" అంది అనూరాధ.
గాజుల దుకాణంలో గాజులు తీసుకున్నాక అనూరాధ డబ్బులిస్తూ వుంటే, "రాధా నేను డబ్బులిస్తాను, ఇది నా కానుక" అన్నాడు కృష్ణమోహన్.
షాపులోంచి బయటకి వచ్చాక "చాలా ఆశ్చర్యంగా, సంతోషంగా అలాగే ఆనందంగా కూడా వుంది బావా"
"అన్ని విశేషణాలు ఎందుకు"
"ఎందుకా? తమరు నాకు ఒక వస్తువుని కొనడం ఆశ్చర్యాన్ని, నీలో ఇంత మార్పు రావడం సంతోషాన్ని, అదీ మొట్టమొదటిసారిగా కొన్న వస్తువు గాజులు కావడం ఎంతో ఆనందాన్ని కలుగచేసాయి"...
కృష్ణమోహన్ అలా గాజులు కొని ఇవ్వడం ఒక శుభసూచకంగా అనిపించింది అనూరాధకి.
"పొరపాటున నిన్ను అడిగాను చూడు అందుకు నన్ను నేనే శిక్షించుకోవాలి. సరే ఎలాగూ ఆదివారం పార్టీలో కలుస్తాము కదా, అందుకని గుడికి ఈ శనివారం కాకుండా పై శనివారం రా అప్పుడు ఆ వారం కూడా కలిసినట్లుంటుంది"
"అయ్య బాబోయ్! మా బావా నన్ను వారం వారం కలవడానికి ఆలోచన చేస్తున్నాడంటే, ఆ ఆనందాన్ని తట్టుకోలేక పోతున్నాను, ఉన్నపళంగా ఈ రోడ్డు మీదే నాట్యం చెయ్యాలని వుంది"
"ఇందాక నీ గురించి ఆలోచిం చటం మానేసాను అన్నావు, ఇప్పుడు ఇలా అంటున్నావు, ఇక పద నిన్ను ఇంటి దగ్గర దించేసి నేను వెళతాను"
"పరవాలేదు రెండు వీధులే కదా, నేను వెళతాను నువ్వు వెళ్ళు" అని ఎదో జ్ఞాపకం వచ్చి "ఆ బావా, నువ్వు చెప్పినట్లే పై శనివారం గుడికి వస్తాను, ఎందుకంటే ఈ వారం అవకపోవచ్చు, ఆటంకం రోజులు, అందుకే శుక్రవారం ఫోన్ చేస్తానన్నాను"
"సరే, రాధా చీకటి పడింది ఆడ పిల్లని చీకటి పడ్డాక ఒంటరిగా పంపడం నాకిష్టం వుండదు, పద" అని అనూరాధని ఇంటి దగ్గర దింపి కృష్ణమోహన్ తన రూముకి వెళ్ళాడు.
అతను వెళ్ళిన తరువాత "బావలో ఏ మార్పూ లేదు, అనవసరంగా ఏదేదో అన్నాను, మునపటిలాగే నా పట్ల అభిమానంతో, ప్రేమతో, భాద్యతతో వున్నాడు" అనుకుంది అనూరాధ.

అదివారం అనుకున్నట్లు అందరూ కలిసారు, సరదాగా కబుర్లు చెప్పుకుంటూ లంచ్ అయినాక "నేను కారు కొన్న శుభసందర్భంలో నా తరపు నుండి పార్టీ ఇస్తున్నాను సినిమాకి వెళదాము" అన్నాడు రాజేశ్వరరావు. "సిరిసిరిమువ్వ" సినిమాకి వెళ్ళారు, సినిమా అయినాక రవి, అనూరాధ కృష్ణమోహన్తో కలిసి అతని రూముకి వెళ్ళారు, మిగతా వారు ఇంటికి తిరిగి వెళ్ళారు. కృష్ణమోహన్ ఇంటికి వెళ్ళాక, ఒక అరగంట తరువాత రవి తన సహచరుడు అదే కాలనీలో

వున్నాడు, కలిసి ఒక పావు గంటలో వస్తానని వెళ్ళాడు.
"సినిమా ఎలా వుంది బావా?" అని అడిగింది అనూరాధ.
"నాకు చాలా నచ్చింది, కథ, పాటలు బాగున్నాయి"
"అవును బావా సినిమా చాలా బాగుంది. పాటలన్నీ బాగున్నాయి, ముఖ్యంగా "ఝుమ్మంది నాదం సయ్యంది పాదం", "ఎవరికెవరు ఈ లోకంలో ఎవరికి ఎరుక", "ఒడుపున్న పిలుపు ఒదిగున్న పులుపు...గోదారల్లే ఎన్నెల్లో గోదారల్లే ఎల్లువ గోదారల్లే వెన్నెల్లో గోదారల్లే" పాటలు నాకు బాగా నచ్చాయి"
"అవును చాలా బాగున్నాయి, గోదావరి పాట క్యాచీగా వుంది"
"నీకా గోదావరి పాట బాగా నచ్చుతుందని నేను అనుకున్నాను, ఎందుకంటే అందులో గోదావరి వుందిగా" అని నవ్వుతూ అంది అనూరాధ.
"అన్నిటికన్నా నాకు కథానాయికకి పెళ్ళి చెయ్యాలని కథానాయకుడు పడుతున్న తపన, ఆరాటం చూసి కథానాయిక ఆలోచిస్తూ వుంటే పై నుంచి గజ్జెలు గాలికి జారి క్రింద డప్పు మీద పడతాయి. అది చూసిన ఆమె ఆ డప్పు, గజ్జెల కలయిక తన ఆలోచనలకి పరిష్కారము అనిపించి తన ప్రేమని కథానాయకుడికి ఊహించుకుని తెలియ చెప్పే సన్నివేశం నాకు బాగా నచ్చింది. అక్కడ ఆ సందర్భంలో 'స్వామి రారా' అని మొదలయి తరువాత ఆమె అతని మెడలో పూలమాల వేసి పాడిన పాట 'రాగాలెన్నో పండిన గారాల నీ మెడలో' అని ఒక పాట వస్తుంది, ఆ పాట నాకు బాగా నచ్చింది, ఆ పాట లిరిక్ గుర్తుందా?"
"అవును ఆ పాట చాలా బాగుంది, మా ఇంట్లో కేసట్ వుంది నేను చాలా సార్లు టేప్ రికార్డర్లో విని ప్రాక్టీస్ చేసాను. ఆ పాట నేను పాడగలను"
"OK నా కోసం పాడవా?" అన్నాడు కృష్ణమోహన్.
అనూరాధ ఆ పాటని ఒక అనుభూతితో చాలా శ్రావ్యంగా పాడింది, ఆ పాట విన్న కృష్ణమోహన్ ఒడలు ఒక పులకరింతకి లోనయ్యింది.
"ఒహ్ రాధా! గ్రేట్ చాలా బాగా పాడావు, అద్భుతం చాలా మధురముగా వుంది, థాంక్యూ"
"ఆ సినిమాలో కథానాయిక తన మనసులో మాటని ఈ పాట ద్వారా ఎలా తెలిపిందో, నా మనసులోని మాటని నేను కూడా అదే పాట ద్వారా తెలిపాను బావా" అని మనసులో అనుకుని "ఈ పాటని ఒక పారవశ్యముతో పాడాను బావా" అంది అనూరాధ.
ఆ విషయం రాధ చెప్పక ముందే అతనికి అర్థమయింది. అతను కూడా "అంతటి అనుభూతితో పాడావు గనుకే అంత మాధుర్యముగా పాడావు" అని... అనూరాధ ఎక్కడ విషయాన్ని గ్రహించి తనని ఇబ్బందికి లోను చేస్తుందో అని టాపిక్ మార్చి..."ఈ పాటలో వేటూరిగారి సాహిత్యం చాలా బాగుంది, గాన కోకిల సుశీలగారి గాత్రం ఆ పాటని ఉన్నత శిఖరాలకి తీసుకు వెళ్ళింది, మహదేవన్గారి బాణీ చిరస్మరణీయము, విశ్వనాథ్గారు మొత్తం ఆ సన్నివేశాన్ని హృద్యముగా చిత్రీకరించారు. మంచి అభిరుచి కలిగిన దర్శకుడు, సంగీత దర్శకుడు, కవిల సమ్మేళనానికి కృషికి ఫలితం ఈ సినిమా" అన్నాడు
"దొరికావు బావా, నీ భావము నాకు అర్థమయ్యింది, త్వరలోనే 'నేను నిన్ను ప్రేమిస్తున్నాను' అనే తీపి కబురు కూడా నీ నోటితో చెప్పు, నా నోములు ఫలిస్తాయి" అని మనసులో అనుకుంది.
కాస్సేపు కృష్ణమోహన్ ఆఫీస్ గురించి కబుర్లు చెప్పుకున్నారు. ఆ సందర్భంలో హఠాత్తుగా "బావా నిన్ను ఒక విషయం అడుగుతాను, నిజం చెప్పు" అని అడిగింది అనూరాధ.
"ఏమిటది?"
"నీకు డ్రింకింగ్ అలవాటు వుందా?"
"లేదు అని చెబితే అది అబద్ధం అవుతుంది, అలాగని అలవాటు వుందనీ చెప్పలేను. సంవత్సరంలో రెండు లేదా మూడు సార్లు త్రాగుతాను. బాగా సన్నిహితులకు ఉద్యోగాలు వచ్చినపుడు, పెళ్ళిళ్ళు అయినపుడు అలాంటి సమయాలలో అదీ మేక్సిమం రెండు పెగ్గులు"
"మరి ఇప్పుడు నువ్వు జాయిన్ అయిన ఉద్యోగం కూడా ఉన్నతమైనది, అక్కడ ఎక్కువగా పార్టీలు అవుతాయి, మొహమాటాలు వుంటాయి కదా మరి అప్పుడు నువ్వు అనుకున్నట్లు రెండు మూడు సార్లు కన్నా పెరగవచ్చు. వద్దు బావా నీ ఆరోగ్యం పాడవుతుంది,

నా కోసం ఆ అలవాటు మానెయ్యి" తన ఆవేదనని అతనికి చెప్పింది.

"అవును ఆఫీస్లో ప్రతి నెలా ఒక పార్టీ అవుతుంది, నేను ముందుగానే జాగ్రత్తపడి నాకు అలవాటు లేదని చెప్పాను, ఇప్పటికి రెండు పార్టీలయ్యాయి నన్ను ఎవరూ బలవంత పెట్ట లేదు. అసలు నాకు ఎప్పుడూ డ్రింక్స్ మీద ఆశక్తి లేదు, కోరిక లేదు, కానీ కొంత మొహమాటనికి అప్పుడపుడు ఇలాంటివి అలవాటు అవుతాయి, నువ్వు కంగారు పడకు, నేను వీలైనంత తొందరగా ఇది మానేస్తాను"

ఆ పై శుక్రవారం సాయంత్రం అనూరాధ కృష్ణమోహన్కి ఫోన్ చేసి "రేపు సాయంత్రం ఐదున్నరకి రవీంద్రభారతి దగ్గర నీ కోసం వెయిట్ చేస్తూ వుంటాను" అని చెప్పింది.

అనుకున్నట్లు శనివారం వేంకటేశ్వరస్వామి కోవెలకి కలసి వెళ్ళారు, స్వామి దర్శనం చేసుకున్నాక మొత్తం ఆ కోవెల ప్రాంగణం అంతా అనూరాధకి చూపెట్టాడు కృష్ణమోహన్. అక్కడి లాన్స్, ఆ కట్టడాలు అన్నీ చూసి "చాలా బాగుంది బావా, అద్భుతంగా వుంది, ఇంత చక్కటి కోవెల కట్టించిన బిర్లా ధన్యుడు" అంది అనూరాధ.

"పద రవీంద్రభారతి ఎదురుగా గోపి హోటల్లో కూర్చుని కబుర్లు చెబుతూ, ఏదైనా తింటూ మాట్లా డుకుందాము"

గోపి హోటల్లో ఇడ్లీ ఆర్డర్ ఇచ్చి కబుర్లు మొదలు పెట్టారు. "బావా ఇంకా క్రికెట్ ఆడుతున్నావా?"

"పి. జి. చదువుతున్నపుడు



కూడా ఆంధ్రా యూనివర్సిటీ తర పున ఆడాను, కానీ ఇప్పుడంత సమయం దొరకడంలేదు, శెలవు రోజులలో వీలు చేసుకొని మా కా లనీ కుర్రాళ్ళతో కలసి ఆడుతున్నా ను. ఇంతకీ స్వామివారిని ఏమి కోరుకున్నావు?"

"నువ్వు ఏమి కోరుకున్నావు?" అని ఎదురు ప్రశ్న వేసింది అనూరాధ

"ముందు నేను అడిగాను, నువ్వు చెప్పాక నేను చెబుతాను"

తన బావకి తనకి పెళ్ళి అయేటట్లు దీవించమని మొక్కుకుంది అనూరాధ, కానీ అలా చెప్పటానికి సిగ్గు వేసి "ఏముంది బావా ప్రతి పెళ్ళికాని యువతి కోరుకొనేదే నేనూ కోరుకున్నాను" అంది అనూరాధ.

"అలా అంటే నాకెలా తెలుస్తుంది, నేను యువతిని కాదుగా" అని వివరం రాబట్ట టానికి ప్రయత్నించాడు కృష్ణమో హన్

"పో బావా, నీకు తెలియక కాదు నన్ను ఆట పట్టిస్తున్నావు" అంటూ సిగ్గుపడింది అనూరాధ

"అబ్బా! అమ్మాయిగారు అంత సిగ్గులొలుకుతున్నారు అంటే విషయం పెళ్ళి గురించి అయి వుంటుంది, మరి ఇంట్లో సంబం ధాలు చుస్తున్నారా?"

"బావా చాలా తెలివిగా బయట పడకుండా నా సమాచారం అంతా రాబట్టటానికి ప్రయత్నిస్తున్నావ న్నమాట!" అని మనసులో అను కుని, తను కూడా కాస్త ఆట పట్టించడానికి..."అవును బావా చూస్తున్నారు, మొన్న ఒక సంబంధం వచ్చింది అమెరికాలో డాక్టరట, నన్ను ఒక పెళ్ళిలో చూసాడట, మీ అమ్మాయి చాలా బాగా నచ్చింది, కట్నకానుకలు మాకేమీ వద్దు, కాకపోతే పెళ్ళి మాత్రం ఇక్కడ హైదరాబాదులోనే ఘనంగా చెయ్యాలి అన్నారు"... అని అతని ముఖ కవళికలు గమనిస్తున్నాది. అయితే అనూరా ధ ఊహించిన మార్పు ఏదీ అతని ముఖంలో రాలేదు.

(ఇంకా వుంది)

# మాస్కులు



డా. పి. రుక్మిణీనాథ శాస్త్రి
ఆయుర్వేద వైద్యులు

పరిశుభ్రమైన తెల్లటి వస్త్రం లేదా తెల్లటి తువ్వాలు గాని తీసుకోండి. దానిని 5,6 గంటలు నీటిలో నానబెట్టి, ఆరిన తరువాత పెద్దలకు అయితే 9.7"; పిల్లలకు అయితే 7. 5" పరిమాణంలో మాస్కులు అవసరాన్ని బట్టి కుట్టించుకోండి. మనిషికి 2 సరి పోతాయి.

వేపాకులు ఈనెలతో సహా తీసుకుని వాటిలో పుచ్చులు, సాలెగూళ్ళు లేకుండా బాగు చేసి కడిగి ఆరబెట్టిన దానిని మిక్సీలో వేసి పేస్ట్ లా చేసి ఒక లీటరు నీటిలో బాగా ఎక్కువ సేపు మరగించండి. ఎంత ఎక్కువ మరిగిస్తే అంత ప్రశస్థం. దింపే ముందు ఒక స్పూన్ మంచి పసుపు కలిపి దింపండి. ఈ కషాయానికి 15,20 మాస్కులు మునుగుతాయి.

ఈ విధంగా 12 గంటలు నాననిచ్చి, తీసి నీడను ఆరిన వాటిని వాడుకొనుట మంచిది.

ఉదయం కట్టుకున్న దానిని సాయంత్రం వరకు ఉంచుకొనుట మంచిది. మధ్యలో భోజనం, టీ, కాఫీలు, మంచినీళ్లు త్రాగేటప్పుడు, కింద తాళ్లు వదులు చేసుకుంటే సరిపోతుంది.

ప్రతీసారి తాళ్లు మాత్రమే ముట్టుకుని అవసరాలు తీర్చుకుంటే మంచిదని గ్రహించండి.

పగలు వాడిన మాస్కులు ఆ రాత్రి పసుపు నీళ్ళల్లో ముంచి ఝాడించి ఆరబెట్టండి. 3 వ రోజుకు పనికి వచ్చును. 2 వ మాస్కు 2వ రోజు పై విధంగా మార్చి మార్చి వాడుకోవడం ఆరోగ్యం.

# పొడి దగ్గు

మాములుగా దగ్గు మొదలయ్యింది అంటే తొందరగా తగ్గదు అనే అభిప్రాయం అందరికీ. అందులోనూ పొడి దగ్గు ఇంకా బాధిస్తుంది. 'దానికి నివారణోపాయం ఉంది, ఈ విధంగా వాడండి' అని మన ఆయుర్వేదం డాక్టరు గారు చెబుతున్నారు. అందులోనూ ఈ క్లిష్ట సమయంలో అంటే కరోనా సమయంలో ఏ చిన్నది వచ్చినా ప్రజలు భయ భ్రాంతులవుతున్నారు. ఎవ్వరూ దేనికీ కంగారు పడవద్దు అంటూ కరోనా కోసం చిట్కాలు అందిచ్చారు మన డాక్టరు గారు.

పొడి దగ్గుకి :


1. తులసి ఆకులు ----20
2. తమల పాకు ---- 1
3. లవంగ మొగ్గ ---- 1
4. దాల్చిన చెక్క ---- చిన్న ముక్క
5. తేనె ---- 20 to 30 డ్రాప్స్
6. పటిక బెల్లం ---- 1/2 స్పూన్

తయారు చేసే విధానం : ముందుగా తులసి ఆకులు, తమల పాకు కడిగి రసం తీసి, లవంగ మొగ్గ పైన బొటిమ దగ్గరు చిన్న సూది గుచ్చి స్టవ్ (మంట) మీద పెట్టి, ఆ లవంగం కాలిన పౌడర్, ఈ పౌడరుకి రెట్టింపు దాల్చిన చెక్క పౌడర్, పటిక బెల్లం లేదా తేనె మనం ముందుగా తీసుకున్న తులసి రసంలో కలిపి, ఆ రసం చప్పరిస్తూ ఊట మింగి, చివరగా ఆ ముద్ద నీళ్లతో త్రాగండి.

రెండు రోజులలో దగ్గు మాయం అవుతుంది!

## గడిలో దాగిన వైజ్ఞానిక నుడి

డా. చాగంటి కృష్ణకుమారి




**అడ్డం**

1. ఆమ్లాలకు, క్షారాలకు దీని విలువ వాటి వాటి తుల్యాంక భారాలకే సమానమవుతుంది. అనగా అయా ఆమ్ల,క్షార అణుభారాలను తటస్థీక-రణ చర్యలో అవి ఇవ్వగల H+1 లేదా OH-1 అయానుల సంఖ్యతో భాగారిస్తే వచ్చే విలువే. (10)

3.ఇంటి దొంగని --- లో పందికొక్కు ని ఎవరు పట్టుకోగలరు? (2)

4. కాయ పండుగా మారడానికి చాలా తక్కవ సమయం లేదా తక్కువ రోజులు పట్టె సందర్భంలో ఆకాయను -- కాయ అంటారు (2)

5. నూతిలో కప్ప (6)

7.వాహనం గంటకి ఎన్ని కిలో మీటర్లు ప్రాయణం చేసిందో తెలియజేసే అంశం (3)

11. కనబడలేదా మరో ప్రపంచపు----మండే త్రే-తాగ్ని? (4) అట్నుంచి ఇటుగా

12.ఖర్చు (2)

13. పుప్పొడి (3)

**నిలువు**

1. ఇంగ్లీషులోdisproportionation అంటాము. హైడ్రోజన్ పెరాక్సైడ్ నీరు, ఆక్సిజన్ లుగా మారిపోవడం ఈరకం రసాయన చర్యకొక ఉదాహరణ.(11)(కిందనుండి పైకి)

2.సంస్కృతం లో ద్రోణపుష్పి . -- పువ్వులు తెచ్చి తుష్టుగా పూజేతమంటె కొమ్మకొమ్మకు కోటి తుమ్మెదా ఎంగిలంటున్నాయి లింగా..... (2)

3. పసుపురంగులోకి మారిన దంతాలు, పళ్ళ ను --- పట్టినవి అంటాము (2)

6.మనశరీరంలోని --లన్నీ కలిసి చక్కగాపనిచేస్తే ఆరోగ్యంగా వుంటాము(3)(కిందనుండి పైకి)

8.ఒక రసాయనసమ్మేళనంలో రెండుబంధిత ఎలక్ట్రాన్ జంటల మధ్యనున్న కోణం .సరళంగా చెప్పాలంటే రెండు రసాయన బంధాల మధ్య ఏర్పడినకోణము(5) కింద నుండి పైకి

14. పోటీ; .పూను ---ను విద్యలందే (2)
15. “వాడే కళనున్నాడో?” ఈ ప్రశ్న లో వున్న కవిత్వాన్ని ఏమందాం?
16. జింక్ ను తెలుగులో ఇలా అంటారు (4)
18. Acacia Arabica స్రవించే జిగురు ‘గమ్ అరేబిక్’ (4)
19.చాకలి పద్దులో గుంట పొంగనాలు(2)
21. సద్దు మణిగింది; ఇంక చప్పుడు చేయకు. (2) అటునుంచిటు
22. సువర్ణము (3)
23.పెరుగు (2)
25. పిల్లలపట్ల అధికమోతాదులో చూపించే అనురాగ ఆప్యాయతలు (4)
26.ఆదిత్యుడు (3) అటునుంచిటు
27. పీఠిక (6)
28.భస్మము(2)
30. గ్లాస్ ని చేతికి తొడగవచ్చు (2)
31. ఏ త్రిభుజంలో రెండు భుజాలు సమానంగా వుంటాయి? (10)

9.అనంతంగా సాగే సరళరేఖల మధ్య దూరంలో మార్పు వుండదు .(11) ) (కిందనుండి పైకి)

10. ఈ చెట్టు పూలలోని వంకర తిరిగిన కేశరములతో చిన్నపిల్లలు “కోడిపుంజు” ఆటలను ఆడుకుంటారు. శాస్త్ర నామం Delonix regia. (3) )(కిందనుండి పైకి)

17. నాగుపాము పడగ విప్పినపుడు తల భాగం ఏ ఆకారంలో ఉంటుందో ఈ చెట్టు కాండం మొత్తం అలా ఉంటుంది. ఫికస్ ఇండికా కాక్టేసి కుటుంబానికి చెందిన పుష్పించే మొక్క(5)

20. Art carpus Integrifolia. ఆర్టోకార్పస్ ఇంటెగ్రిఫోలియా. ఈపండులో పనవుంది (3)

24. వంతెన(3) )(కిందనుండి పైకి)

28.ఎండ తగలక తడివస్తువులపై చేరే శిలీంద్రము(2)

మార్చి నెల 'గడిలో దాగిన వైజ్ఞానిక నుడి' సమాధానాలు

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| యాం | త్రి | క | తు | ల్యాం | క | ము | | R |
| త్రి | | చ్చా | | | త్తి | న | | |
| క | | రం | | ది | | ప | క్క | లో |
| చ | | | ము | న | ప | లే | | ము |
| ల | క్ష్య | ము | | ది | | వి | ర | ళ |
| న | | ఖ | న | న | ము | | | గో |
| ము | రా | రి | | ము | | ము | | ర్ధ |
| | | త | పే | | | ర | | ర్వా |
| W | | ము | ద | ప | ద్ర | భా | ర్వ | పూ |

# తెలుగు పద్య రత్నాలు - 11


## ఆర్. శర్మ దంతుర్తి




క్రితం నెల పద్యంలో దూర్వాసుణ్ణి హరిచక్రం ఎలా తరమడం మొదలుపెట్టిందో చూసాం. ఇప్పుడు వైకుంఠంలో మహావిష్ణువు దగ్గిరకొచ్చి మొరపెట్టుకున్నాడు, బ్రహ్మ మహేశ్వరులు తమవల్ల కాదన్నాక, విష్ణువు దూర్వాసుడితో ఏం చెప్తున్నాడో అనేదే చంపకమాల వృత్తంలో పోతన రాసిన ఈ నెల పద్యం.

చ. **చలమున బుద్ధిమంతులగు సాధులు నా హృదయంబు లీల దొం**
**గిలి కొనిపోవుచుండుదు రకిల్బిషభక్తిలతాచయంబులన్**
**నిలువఁగఁ బట్టి కట్టుదురు నేరుపుతో మదకుంభికైవడిన్;**
**వలలకుఁ జిక్కి భక్తజన వత్సలతం జనకుందుఁ దాపసా!**

మనసులో పట్టుదలతో (చలమున) బుద్ధిమంతులైన సాధులు – అంటే ఈ సంసారం లో సుఖంలేదనీ భగవంతుడొకడే శాశ్వతమనీ తెల్సిన సాధువులు ఏం తెల్సుకుంటున్నారంటే, భగవల్లీలలు (నా హృదయంబులీల). అవి విష్ణువు దగ్గర్నుంచి కొల్లగొట్టుకు పోతున్నారు (దొంగిలి కొనిపోవుచుండుదు). ఎలా కొల్లగొడుతున్నారు అని చూస్తే, అకిల్బిషభక్తిలతాచయంబులన్ – మలినం లేనట్టి నిర్మలమైన భక్తితో. అలా భగవంతుడి లీలని తీసుకెళ్ళాక ఏం చేస్తున్నారంటే, మదపుటేనుగుని తాళ్లతో కదలకుండా కట్టేసినట్టూ (మదకుంభికైవడిన్) భగవంతుణ్ణి తమ మనసులో నిలబట్టి నేర్పుతో కట్టేస్తున్నారు అదే భక్తితో (నిలువుగబట్టి కట్టుదురునేరుపుతో). మరి తనని అలా కట్టేస్తే భగవంతుడేం చేస్తున్నాడు? ఆ భక్తి అనే వలలకి చిక్కిపోయి తప్పించుకోలేక ఆ భక్తుడివెంటే వెళ్తున్నాడు (భక్తజన వత్సలతం జనకుందు). ఈ పద్యంలో చివరి పదంలో తాపసుడంటే దూర్వాసుడు.

దేనినుంచైనా భగవంతుడు మనకి అందకుండా తప్పించుకోవచ్చుకానీ నిర్మలమైన భక్తికి అందకుండా



తప్పించుకోలేడు. దీనినే స్వామి సత్యానందగారు చెప్తున్నారు చూడండి ఓ వాక్యంలో. "భగవంతుడా మన ఇద్దరిలో ఎవరికి ఎక్కువ ఓపిక ఉందో పందెం వేసుకుందాం. నేను నీ గుమ్మం ముందు నువ్వు నన్ను పిలిచేదాకా వేచి ఉండగలను కానీ నువ్వు అలా నేను గుమ్మం దగ్గిర పడిగాపులు పడుతూ ఉంటే వేచి ఉండగలవా?"

దూర్వాసుడు వైకుంఠానికి వచ్చేలోపుల తనమీదకి వచ్చే సుదర్శనానికి ఒక్కో జడ సమర్పించుకుంటూ, తల పూర్తిగా బోడి అయ్యి, మనసులో తాను చేసిన తప్పు తెల్సుకున్నాక పశ్చాత్తాపం కలుగుతుంది. అయినా అన్నింటికీ అతీతుడైన భగవంతుడి ముందా జడ తీసి ఆయన ఆయుధాన్ని ఆపేది? అన్నీ పోయాక అప్పుడు శ్రీహరి-

ని అడుగుతాడు ఈ చక్రం నుంచి రక్షించమని. అప్పుడు "నేనీ చక్రాన్ని అంబరీషుడికి రక్షగా ఇచ్చాను. అయినా నువ్వు చేసిన తప్పు అంబరీషుడికి కనక వెళ్ళి ఆ రాజునే అడుగు" అని చెప్తాడు విష్ణువు. ఇక్కడ తల బోడి అవడం అంటే అహంకారం పూర్తిగా పోవడం అని అర్థం చేసుకోవచ్చు. ఇదే తిరుపతీ, అన్నవరం వెళ్ళి తలనీలాలు సమర్పించుకోవడంలో ఉన్న అర్థం. నేను అహంకారం పోగొట్టుకుంటున్నా, లేకపోతే కనీసం దాని గురించి ప్రయత్నం చేస్తున్నాం అని భగవంతుడికి చెప్పుకోవడానికి. దూర్వాసుడు ఏ కోపంతో అయితే అహం ప్రదర్శించాడో అది భగవత్కృపతో పోయింది. ఇప్పుడు మిగిలినది శరణాగతి. వెళ్ళి అంబరీషుడికి మొరపెట్టుకుంటాడు ఇలా తనమీదకి వచ్చే చక్రాన్ని ఆపమని.

అంబరీషుడెటువాంటివాడంటే వెనక్కొచ్చిన దూర్వాసుణ్ణి మనసులో కల్మషంలేకుండా వెనక్కి ఆహ్వానించి, చక్రాన్ని కీర్తిస్తూ "దయచేసి ఈ మునికి హానిచేయకు" అని మొరపెట్టుకుంటాడు. అది అదృశ్యమయ్యాక దూర్వాసుడికి భోజనం పెట్టి తనని దయగా చూడమని అడుగుతాడు. తనకి జరిగిన అవమానం చటుక్కున మర్చిపోయి మంచి మాత్రం బాగా గుర్తుపెట్టుకునేవాడే కదా మంచి మనిషి? అసలీ అవమానాన్నీ మంచినీ, శీతోష్ణ, సుఖ దుఖాలనీ సమానంగా చూసేవాడే సిసలైన భక్తుడని అటువంటివాడే భగవంతుడికి ప్రియమైనవాడనీ మనకి భగవద్గీత భక్తియోగంలో తెలుస్తుంది. అంబరీషుడు అటువంటివాడు కనక ఆయనకి భగవంతుడి/చక్రం రక్ష ఎల్లవేళలా ఉందని అర్థం.

**సమః శత్రౌచ మిత్రేచ తథా మానావమానయో, శీతోష్ణ సుఃఖదుఃఖేషు సమఃస్సంగ వివర్జితః**
**తుల్య నిందాస్తుతిర్మౌనీ సంతుష్టోయేన కేనచిత్, అనికేతః స్థిరమతి ర్భక్తిమాన్మే ప్రియోనరః**

(భక్తియోగం 18, 19)

అంబరీషోపాఖ్యానం "అసలు నువ్వింతటి భక్తుడవని తెలియదు నువ్వే నన్ను క్షమించాలి" అని దూర్వాసుడు రాజుతో అనడంతో కథ ముగుస్తుంది. వ్యాస భాగవతంలో ఉందో లేదో మనకి తెలియదు కానీ మరో చోట ఎవరో అంటారు, దూర్వాసుడు అంబరీషుణ్ణి చేపగా, కూర్మంగా, పందిగా... మనిషిగా పది జన్మలు ఎత్తమని శపించాడనీ భక్తుణ్ణి రక్షించడం కోసం విష్ణువే ఆ దశావతారాలు భక్తుడి బదులు ఎత్తాడనీ మరో కథ.



మరో సారి పద్యం చదివితే తెలిసేదేమంటే, మొదటిసారి కానీ, ఏదో ఒకసారి కానీ భగవంతుడి పట్ల భక్తితో ఉండడం కాదు ఇందులో అసలు తాత్పర్యం. మనకి కుదురుకున్న ఆ భక్తి నిలుపుకుంటూ భగవంతుణ్ణి మన మనసులో కదలకుండా మదపుటేనుగును కట్టేసినట్టూ కట్టేసి ఉంచాలి – అంటే ఏ భక్తితో అయితే భగవంతుణ్ణి తెలుసుకున్నామో అదే భక్తితో ఆయనని నిరంతరం సేవిస్తూండడం. దీన్నే త్యాగరాజ స్వామి అనడం ప్రకారం, "మానస వనచర వరసంచారము నిలిపి మూర్తి బాగుగా పొడగనే..." ఆ మూర్తి చూసాక, దాన్ని నిరంతరం మనసులో ఉంచుకోవడం; ఎందుకలా ఉంచుకోవడం? ఎందుకంటే మనసుని నిరంతరం సానబెడుతూతూ ఉండాలి లేకపోతే మనసు అనేది వంకరి టింకరి కుక్కతోక కనక ఎప్పటికప్పుడు సాధన చేయకపోతే వెనకటిలాగే తయారవుతుంది.

# గర్వం పతన హేతువు



ఆదూరి హైమవతి

అనంతమ్మ ముద్దుల కొడుకు మురళి. చాలా తెలివైన వాడు. అందంగా ముద్దుగా, బొద్దుగా ఉంటాడు. స్కూల్లో చెప్పింది చెప్పినట్లుగా అప్ప జెప్పేస్తాడు. ఒకవిధంగా ఏకసంతాగ్రాహి అనవచ్చు.

ఆ ఏడాది బాలల దినోత్సవానికి ఎన్నో ప్రైజులు వచ్చాయి. అంతా వాడ్ని తెగ మెచ్చుకున్నారు. పొగిడారు. పొగడ్త అగడ్త లోకి తోస్తుది కదా!అందుకే వాడికి కాస్త గర్వం తల కెక్కింది. ఆఅగ్ర్వం రోజురోజుకూ కొండలాపెరిగింది. గర్వం వల్ల పొగరు చేరింది. గర్వం పతన హేతువుకదా! పొగరు వల్ల మంచితనం మరుగున పడ సాగింది.మబ్బుచాటు చంద్రునిలా వాడి వ్యక్తి త్వం మసక బారసాగింది.

మంచి తనం మరుగున పడగానే నిర్లక్ష్యం ఎక్కు వైంది. నిర్లక్ష్యం వల్ల తన తోటి వారినంతా తక్కువగా చూడ సాగారు. ఇంట్లోవారితోనేకాక , స్కూళ్ళో పంతుళ్ళనుసైతం సైతం తల ఎగరేసి మాట్లాడసాగాడు.

అందర్నీ విమర్శించడం, హేళన చేయడం, నిక్ నేంస్ పెట్టి పిలవడం, శారీరక అవకరాలతో పిలవడం చేయ సాగాడు.ఒక్క చెడు గుణం అన్ని మంచిగుణాలనూ మకిలి పట్టిస్తుంది.ఎంతో గొప్ప భక్తుడైన రావణాసురుడు ఒక్క దుర్గుణంతో మూర్ఖుడనే పేరు తెచ్చుకుని వంశనాశనం చేసుకున్నాడు.

తల్లి అనంతమ్మ "నాయనా! నీవేమి చేసినా సహించాను, కానీ ఇతరుల అవకరాలను ఎత్తి చూపేలా పిలవడం మాత్రం మంచి ది కాదు నాయనా! అది మానసిక హింస, హత్య చేయడం కంటే పెద్ద పాపం"అని చెప్ప సాగింది. వాడు తలెగరేసాడే తప్ప తన స్వభావంలో మార్పు తెచ్చుకో లేదు. వాడి ఆరో తరగతిలో అవినాష్ అనే అవిటి బాలుడు వచ్చి చేరాడు.

అతడు కర్రల సహాయంతో నడుస్తూ స్కూల్ కు రాసాగాడు. మురళి అవినాష్ ను 'కుంటోడా !' అని పిలవడం విన్న వాళ్ళ క్లాస్ మాస్టర్ కోపించాడు."చూడూ మురళీ! ఇంకోమారు వింటే చాలా తీవ్రమైన శిక్షను ఎదుర్కుంటావ్ జాగ్రత్త. నోరు అదుపులో ఉంచుకో." అనిచెప్పి వెళ్ళారు.

మాస్టర్ క్లాసులోంచీ వెళ్ళాక మురళి "ఈ లడ్డు మాస్టర్ చెప్పేదేం దీనాకు !జీతాలు తీసుకుని పాఠాలు చెప్పేవాళ్ళు కూడా నీతులా చెప్పేది?" అని పంతులుగారినే తృణీకరించాడు. తో టి బాలురు మురళి నోటికి భయపడి మౌనంగా ఉన్నారు. మురళి నోరంటే అందరికీ భయమే!

ఆ రోజు సాయంకాలం ఆటస్థలంలో క్రికెట్ ఆడుతున్న మురళి, బాలు పట్టుకోబోయి బోర్లాపడ్డాడు. కాలు క్షణాల్లో వాచిపోయింది.ఫ్రాక్చరైవుంటుందని వాడిని వెంటనే వైద్య శాలకు తీసుకెళ్ళారు క్లాస్ మాస్టర్ తన స్కూటర్ మీద. మురళి తల్లీ తండ్రీ కంగారుగా వచ్చారు. కాలికి కట్టు కట్టారు. మూడు వారాలు రెస్ట్, స్కూల్ లేదు.మంచం దిగటానికి లేదు. అన్నీమంచంలోనే. కుంటివాడైపోయాడు.

మురళి ఇంట్లో పడుకుని ఉండగా తల్లి అనంతమ్మ "ఒరే నాయ నా! ఇతరులను హేళన చేయకురా !మానసిక హింస చాలా తప్పు రా! అంటే విన్నావు కాదు. ఇప్పుడు చూడు కాలు విరిగి పడుకు న్నా

వ్! నీవే కుంటి వాడిపై పోయావు. ఎదుటివారిని అన్నమాట లు మనకే గోడకు కొట్టిన బంతిలా వచ్చి తగులుతాయిరా!" అంది.

ఆ రోజు సాయం కాలం మురళి కళ్ళు మూసుకుని పడుకుని తన తప్పుల గురించీ ఆలోచించు కుంటుండగా అవినాష్ కర్రలు పోటు వేసుకుంటూ వచ్చాడు.

వాని కర్రపోట్లు విని మురళి అవినాష్ వస్తున్నట్లు గ్రహించాడు.

"ఎలా ఉన్నావ్ మురళీ! ఇదో ఈ విబూది నుదుట పెట్టుకో ! నీ కోసం నేను బాబా గుడికెళ్ళి తెచ్చాను. త్వరగా తగ్గి పోతుంది. ఏమీ భయపడకు. ఈ ప్రసాదం తిను, దేవుడు నీకు త్వరగా నయం చేస్తాడు" అంటూ ప్రసాదం తెచ్చి ఇచ్చాడు.

అవినాష్ మాటలు విని వాడిని చూడగానే మురళి భోరున ఏడుస్తూ వాడి చేతులు పట్టుకుని," నన్నుమన్నించు అవినాష్ ! నిన్ను చాలా బాధించాను." అన్నాడు.

"ఏడువకు మురళీ! నీవేం తప్పు అనలేదు. నేను కుంటివాడిని కనుక అలాపిలిచావ్! నేనూ గత జన్మలో ఎవరినో బాధించి ఉంటాను. గోడకు కొట్టిన బంతిలా నాకే అది తగిలింది"అన్నాడు.

"ఇదేమాట మా అమ్మకూడా ఈరోజు అనింది అవినాష్! నాకు బాగా అర్థమైంది ఇహ ఎప్పుడూ ఎవ్వరినీ ఏమీ అనను.నావద్ద ఐస్ క్రీములూ, చాకోలేట్స్ తిన్నవారంతా కనీసం నన్ను చూడ నైనా రాలేదు. నిన్ను ఎగతాళి చేసినా నీవు నాకోసం గుడికెళ్ళి ప్రార్థనచేసి ప్రసాదం తెచ్చావు. సారీరా! నాతప్పు మన్నించు" అంటూ మళ్ళీఅవినాష్ చేతులు పట్టుకుని ఏడ్చాడు.

అవినాష్ మురళి కళ్ళుతుడిచి "ఊర్కో మురళీ! ఇదీ మంచిదే ఐంది. నీలో మార్పు వచ్చి నీవు మంచిగా మారనే భగవంతుడు ఇలాచేసి ఉంటాడు. ఒక్కోమారు చెడుకూడా మన మంచికే జరుగుతుందని మా అమ్మ చెప్తూ ఉంటుంది" అని ఓదార్చాడు అవినాష్. రోజూ వచ్చి చెప్పినపాఠాలు మురళీకోసం చదివేవాడు అవి నాష్. చక్కగా ముత్యాల్లా ఉండే తన చేతిరాతలో మురళి నోట్సు లన్నీ వ్రాసి పెట్టాడు.

మురళికి అవినాష్ ప్రేమ తెలిసి మనస్సులో అవినాష్ పట్ల ఎంతో స్నేహ భావం కలిగిగాయి.

ఆ మూడు వారాల్లో మురళి లో పరివర్తన కలిగి, ఆతర్వాత ప్రతి వారినీ గౌరవించడం, స్నేహంగా మసలు కోవడం అలవర్చుకుని అందరిలో మంచిపేరు తెచ్చుకున్నాడు .గర్వం ఎంత చెడ్డదో అది ఎన్ని దుర్గుణాలు కుప్పతొట్టి లా మనస్సులో చేర్చుతుందో అర్థమైంది మురళికి. మునుపటిలా మంచిగా మారిపోయాడు.

నీతి- హింస చేతలతో కాదు మాటలతోనూ చేయరాదు. గర్వం ఎంతటివారినైనా పతనం చేస్తుంది. ■


# రచయితలకు విజ్ఞప్తి

రచనలు పంపువారు తమ స్వీయ రచన అని ధృవీకరణ పత్రం వ్రాసి, ఫోటోలు జతచేసి పంప వలెను. అనువాదాలు స్వీకరించ బడవు. ప్రచురణకు ఎన్నిక కానివి తిరిగి వెనక్కి పంప బడవు. సామాజిక రచనలకు ప్రాధాన్యత ఇవ్వ బడును.

- సంపాదకురాలు



చైతన్యం సంకల్ప బలం

## చందా రేట్లు

| | |
|---|---|
| విడిప్రతి | రూ. 20.00 |
| సంవత్సరానికి | రూ. 200.00 |
| పోస్ట్ ద్వారా | రూ. 230.00 |

Please deposit your subscription in favour of
**CHAITANYAM SANKALPABALAM**
**A/c No. 1626201002070 - Canara Bank**
Kundanbagh Branch, Hyderabad

చందాలు పంపాల్సిన చిరునామా:

చైతన్యం
సామాజిక విలువల మాస పత్రిక

ప్లాట్ నంబర్ 45058
జనప్రియ ఉటోపియా
హైదర్ గూడ , అత్తాపూర్
హైదరాబాద్ - 500 048

Email: teega51@gmail.com
Visit: www.chaitanyam.net

# ఎఱ్ఱ బస్సు



జొన్నలగడ్డ సత్యవతి

నేను పుట్టిన ఊరు ఒక పల్లెటూరు. కూచిపూడి దగ్గర ఒక ఊరు. అక్కడ సోమేశ్వర స్వామి శివాలయం ఉంది అది స్వయంభూ. ఆ గుడి చాలా మహిమ కలదని అంటారు. మా తమ్ముడికి 'సోమేశ్వర శర్మ. ఆ దేముడి పేరు పెట్టారు. చాలా రోజులయింది శివాలయం చూసి అనిపించింది. నా మనసులో మాట మా పుత్ర రత్నానికి చెప్పాను. అదేం పెద్ద విషయం నడు, అని సెలవు పెట్టి, కారులో తీసుకు వెళ్ళాడు. ఆ ఊరు అంతా మారి పోయింది. పూరి ఇళ్లు అన్నీ డాబాలుగా మారాయి. రోడ్లు వేశారు. అంతా ఎంతో మార్పు కనిపిస్తోంది. నాకే ఆశ్చర్యం వేసింది. అవును యాభై ఏళ్ల కిందటి మాట. ఈ మార్పు చూసి మనం అభివృద్ధి చెందాం అనిపించింది. దైవ దర్శనం చేసుకుని తిరిగి కారులో వస్తుంటే, లీలగా ఆ ఊరి చెరువు, అక్కడి మనుషులు అన్నీ గుర్తుకు వచ్చాయి. ఎదో వెతుకుతున్నట్లు చీకటిలోంచి చూస్తున్నాను. ఇంతలో ఏం కావాలి? మామ్మా వెతుకుతున్నావు? అని అడిగారు.

ఏమీ లేదురా గోపీ! మా చిన్నప్పటి బస్సులు, అక్కడ అమాయకంగా మనుషులూ అన్నీ గుర్తుకు వస్తున్నాయి. పక్కనే ఉన్న మా మనవరాలు సాధన అడిగింది కదా! మీ చిన్నప్పటి సంగతులు చెప్పు మామ్మా అని కుతూహలంగా. వాళ్ళు అడగక ముందే నాకు చెప్పాలని పించింది. మనం ఇంకా కారులో 4,5 గంటలు ప్రయాణం చెయ్యాలి. మాకూ టైం పాస్ అవుతుంది అన్నారు. నాకూ కొంత గత స్మృతులలోని ఆనందాన్ని అనుభవించవచ్చు అనుకున్నాను.

ఇక మా ఉరి సంగతులు చెప్పడం ప్రారంభించాను.

దాదాపు అర శతాబ్దం కిందట మనకి స్వాతంత్రం వచ్చిన కొత్త రోజులు, రవాణా సౌకర్యాలు లేవు. ఇప్పటి లాగా లేవు. కారు డ్రైవ్ చేస్తున్న మా అబ్బాయి కూడా వింటున్నాడు. అమ్మా! నువ్వంత మరీ అచ్చ తెలుగులో చెబితే వీళ్ళకి అర్థం కాదు. వీళ్ళు ఇంగ్లీష్ మీడియం కదా! కాస్త ఇంగ్లీష్ కూడా మిక్స్



చేసి చెప్పు అన్నాడు. కొంత వాళ్లకి అర్థం అయ్యేలా పాత మాటలు వాడకుండా చెప్పాలి. ఒకే. మళ్ళీ ప్రారంభించాను.

ఫిఫ్టీ ఇయర్స్ వెనుక మనకి ఇండిపెండెన్స్ వచ్చిన కొత్తల్లో ట్రాన్స్పోర్ట్ ఇంతగా డెవెలప్ కాలేదు. అందుకని బస్సులు తక్కువగా ఉండేవి. ఇప్పుడు మనం వెళ్లిన ఊళ్ళో మా మామ్మ, తాతయ్య ఉండే వారు. వాళ్ళను చూడడానికి బందరు నుండి ఈ ఊరు వచ్చాను. అప్పుడు మీ నాన్న చిన్న పిల్ల వాడు. మేము హైదరాబాదు సిటీ లో ఉండే వాళ్ళం. ఈ ఊరు వచ్చినప్పుడు రెండు రోజులు ఉన్నాను. ఆ రెండు రోజులలోనే నేను మరచి పోలేని సంఘటనలు జరిగాయి.

అప్పుడు మీ నాన్నని ఎత్తుకుని గుడికి వచ్చాను. అప్పుడు ఉదయం 8గంటలు అనుకుంటా. గుడిలో శివాలయంలో దేముడుని దర్శనం చేసుకుని పక్కనే ఉన్న ఆంజనేయ స్వామి ఆలయానికి వచ్చాను. అక్కడి వాతావరణం ప్రశాంతంగా ఉంది. కాస్సేపు కూర్చోవాలనిపించి కూర్చున్నా. ఆ గుడి పూజారి ఎంతకీ రా లేదు. నాకు తోచక ఆ గుడి ముందు

ఊడ్చి ముగ్గు వేసాను. ఇంతలో పూజారి వచ్చాడు. గబా గబా ఏవో మంత్రాలు చదివాడు. పూజ అంతా చేసి దేముడికి నైవేద్యం పెట్టి, నాకు ప్రసాదం పెట్టాడు. అక్కడ ఎవ్వరూ లేరు. ఆ పూజారి పెట్టిన ప్రసాదం-కళ్ళ కద్దుకుని తిన్నాను. మీ నాన్నకి పెట్టాను. వెంటనే ఇంటికి వచ్చాను. మా తాతయ్య వరండాలో ఎదో సద్దు తూ, ఎక్కడ నుండి వస్తున్నావమ్మా? అని అడిగాడు. గుడికి వెళ్లి వస్తున్నా తాతయ్యా అన్నాను. అక్కడి పూజారి ప్రసాదం పెట్టాడా? అని అడిగాడు తాతయ్య. అవును తాతయ్యా, పెట్టా డు తిన్నాను, అన్నాను. నేనేదో తప్పు చేసినట్లు చూసారు. నాకు ఏమీ అర్ధం కాలేదు. కొంత సేపటి తరువాత 'ఆ గుడి పూజారి ఆచార్యులు. మనం వైదీకులం. వాళ్ళు పెట్టింది మనం తినకూడదు' అని నసుగుతూ వెళ్లి-పోయారు. అప్పుడు నాకు అనిపిం-చింది పల్లెటూరులో ఇదికూడా తప్పే-నేమో అని పిం చింది. అంతేకాదు నాకు చాలా బాధగా కూడా అనిపిం-చింది.

ఆ రోజులలో అంత చాంధసము-గా ఉండేవారు. ఒక రోజు అలా గడిచింది. మరుసటి రోజు ప్రయా ణం. మా మామ్మ పెందరాళే వంట చేసింది. నాకు చీర, సారె పెట్టి వాళ్ళు కూడా నాతో పాటే తొందర తొందరగా ఎంగిలి పడి, నన్ను బస్సు ఎక్కిం-చడానికి వచ్చారు. మా తాత గారి పొలం లో పని చేసే పాలేరు కూతురు 'రత్తాలు' వచ్చింది. ఏంటండీ ఎంక మ్మ గోరు మనవరాలిని అప్పుడే పంపేస్తున్నారా? నేను వస్తా, పదండి అంటూ మాతో వచ్చింది. పక్కనే ఉన్న మా మేనత్త కూడా మాతో పాటు నన్ను బస్సు ఎక్కించడానికి వచ్చింది. ఇదంతా వింటున్న మా కోడలు పి-ల్లలకూ, నాకూ స్నేక్స్ సప్లై చేసింది. కారు కాస్సేపు ఆపి టీ తాగాము. మా అబ్బాయి అన్నాడు కదా అమ్మా! ఇలా ఇంకో గంట కబుర్లు చెప్పావనుకో, మన ఊరు వెళ్లి పోతాము అన్నాడు. లేకపోతే నాకు నిద్ర వస్తుంది. డ్రైవింగ్ ఇబ్బం ది అవుతుంది అన్నాడు. పిల్లలు ఇంట్రెస్ట్ గా వింటున్నారు. వాళ్లకి అంతా విచిత్రంగా ఉంది. నాన్నా! ఇంతకీ మీరు బస్సు ఎక్కారా? లేదా? అని అడిగారు. అప్పుడేనా? ఇంకా చాలా చెప్పాలి నేను. ఇప్పుడే కథలో అసలైన జోక్ అన్నాను. మళ్ళీ కారు ఎక్కాము. మళ్ళీ బస్సు కథ ప్రారంభం.

ఆ ఊరులో బస్సు స్టాపు అంటూ ఏమీ ఉండదు. అక్కడ ఒక పెద్ద చింత చెట్టు ఉంటుంది. దాని కింద కూర్చోవాలి. పక్కనే చెరువు. దాని మీద నుండి మంచి గాలి చల్లగా వీస్తూ, హాయిగా ఉండేది. ఆ ఊరు వచ్చే వాళ్ళు, వెళ్లే వాళ్ళు అడగడం 'ఏంటండీ? ఎప్పుడొచ్చారు? అప్పుడే వెళ్లి పోతున్నారా? అంటూ ఎంతో ప్రేమగా అడిగి, వాళ్ళు అక్కడే బస్సు కోసం కూర్చున్నట్లు కూర్చున్నారు. బస్సు ఎక్కే వాళ్ళు ఒక్కరు, ఎక్కించే వాళ్ళు పాతిక మంది. ఈ రోజుల్లో, అమెరికా, అంతరిక్షం కూడానా గుట్టు చప్పుడు కాకుండా వెళ్లి వస్తు-న్నారు. ఇంతలో ఇవన్నీ విన్న మా మనవడు, మనవరాలు ఇంతమం ది ఎందుకు బస్సు ఎక్కించడానికి? అని అడిగారు. ఆ రోజులలో అభిమానా-లు, ఆప్యాయతలు అలా ఉం డేవి. అప్పటికి మేము బస్సు కోసం వచ్చి రెండు గంటలు అయ్యింది బస్సు ఇంతకీ రాదు. దూరం నుండి చిన్నగా బస్సు లాగ కనిపించిం-ది. దూరం నుండి ఆ బస్సును చుస్తే నిండు గర్భిణీ లాగా నెమ్మ-దిగా వస్తోంది. అంతే! అందరూ లేచారు. బస్సు కూడా రానే వచ్చిం ది. దాని నిండా జనం వేళ్ళాడుతు-న్నారు. మేము ఉన్న చోటికి రెండు వందల అడుగుల అవతల ఆపాడు. అందరం 'హోల్డాన్ హోల్డా న్' అంటూ చేతులు ఊపుతూ ముందుకి వెళ్లేస-రికి బస్సు డ్రైవరు స్పీడుగా పోనివ్వడం 'కండక్టరు' రైట్ రైట్ అంటూ బస్సు వేగం పెంచడం ఇలా రెండు మూడు బస్సులు వచ్చి వెళ్లి పోయాయి కానీ ఒక్క బస్సు ఆపలేదు.

ఉదయాన్నే తిన్న అన్నం తిరిగి పోయి ఆకలి మొదలయ్యింది. మా మామ్మ ఇంటికి వెళ్లి రాత్రికి వంట చేసి మళ్ళీ వచ్చింది. షరా మామూలు. హోల్డాన్ హోల్డాన్ , రైట్ రైట్. ఇహ చీకటి పడింది. ఇంత చీకటిలో నన్ను పంపడం ఇష్టం లేక తిరిగి ఇంటికి వెళ్లి పెద్ద యాత్ర చేసిన వాళ్ళ లాగ అలసి పోయి పడుకు న్నాము. మరునాడు ఉదయం ప్రయాణం మాత్రం బానే సాగింది, బండారు జేరాము. ఈ చిన్న ప్రయా-ణానికి ఇంత హడావిడి పడవలసి వచ్చేది. నిర్ణీత సమయానికి అవస-రమైనన్ని బస్సులు ఉండేవి కావు. ఆ రోజులలో ప్రయాణం అంత కష్టంగా చేసే వాళ్ళం. ఎలా మరచి పోతాం? ఇప్పుడు మనం మన కారులో హాయిగా స్టేట్ దాటి ఇంకో స్టేట్ కి వెడుతున్నాము. పిల్లలంతా ' ఎఱ్ఱ బస్సు' ముచ్చట్లు విని నిద్ర పోకుండా ఎంజాయ్ చేశారు .

# మా ఊరి నందుల ఆత్మీయ కథ



## నందుల ప్రభాకర శాస్త్రి

(గత సంచిక తరువాయి)

అందుకే భాకరాపేటలో మొట్టమొదటిసారిగా శ్రీ కోదండరామ నాట్యమండలి వెలిసింది. 'శ్రీకృష్ణ రాయబారం' నాటకం వేయాలని నిశ్చయించుకున్నారు. రాయబారం నాటకం పుస్తకం తెచ్చుకున్నారు. లొడుగు పెద్దకేశన్న గొప్ప సంగీత విద్వాంసుడు కాబట్టి ఆయనే నాటకం నేర్పించ పూనుకున్నారు.

నందుల రామమూర్తి పి యు సి పరీక్షలు రాసి ఇంటిలో వుండటం వల్ల ఊర్లో జనాన్నంతా సమీకరించి రాయబారంలో అన్ని పాత్రలకు నటులను ఎన్నుకోవటం జరిగింది. వీళ్ళలో చాలా మందికి చదవనూ రాయనూ రాదు. అందుకే పలుగురాళ్లపల్లె హైస్కూల్ లో చదువుతున్న బడిపిల్లలందరి చేత తలకొక్క పాత్రకు వారి 'పోర్షన్' రాసి ఇచ్చి పదిరోజులపాటు వాళ్ళతో పలికించే బాధ్యతా అప్పగించారు.

సంస్కృత పదాలు వచ్చినచోట, కఠినమైన తెలుగు పదాలు వచ్చినచోట పలకటం చాలామందికి కష్టంగా వుండేది. పిల్లలు స్కూలుకు పోయివస్తారు. పాత్రధారులు పనులకు పోయి వస్తారు. సత్రంలో, దేవళంలో, కళ్ళాల్లో, రావిచెట్టు అరుగు మీద ...ఎక్కడపడితే అక్కడ అకుంఠిత దీక్షతో పలికేవాళ్ళు, పలికించేవాళ్ళు కనబడటం మొదలుపెట్టారు. పాత్రధారులకు ఎంతవరకు వచ్చిందో తెలియదు గానీ, పిల్లలందరికీ పద్యాలు మొత్తం నోటికి వచ్చేశాయి.

సాయంత్రం 7 గంటల నుండి 'డ్రామా రిహార్సల్స్' మొదలౌతాయి. ముందు అందరికీ రాగయుక్తంగా పద్యాలు నేర్పుతారు. ప్రతి రోజు, ప్రతి ఒక్కరూ తమ పద్యాలను రాగయుక్తంగా హార్మోనియం పైన నేర్చుకుంటున్నారు. మాట స్పష్టత, రాగంలో ఆరోహణ, అవరోహణ శృతి, గమకాలూ.... ఇవన్నీ నేర్చుకునేటప్పటికి చాలా రోజులే పట్టింది.

ముగ్గురు కృష్ణులు, ఇద్దరు అర్జునులు, ఇలా చాలా చాలా పాత్రలకు ఇద్దరు ముగ్గురు అవటంవల్ల నటుల సమాఖ్య విపరీతంగా పెరిగిపోయింది. సత్రంలో రిహార్సల్స్ కు జనం నిండిపోయేవాళ్ళు. ఇందులో ఆడవాళ్ళు కూడా వుండేవాళ్ళు. తమ నిజజీవితంలోని హీరో నాటకంలో పంచరంగుల ఫోకసింగ్ లో కరెంటు లైట్లలో ఎలా వెలిగిపోతారో చూడాలని ఆశగా ఎదురుచూస్తూ గడిపారు రోజులని.

ద్రౌపది పాత్రకు మాత్రం పొద్దుటూరు నుండి డ్రామా కంపెనీ 'భోగం పిల్ల' ను పిలవాలని ఉవ్విళ్ళూరారు. ఆమె అయితే... సీను.. సీనుకు మధ్య.. సినిమా డ్యాన్సులు చేస్తుంది. ద్రౌపది పాత్రలో నటిస్తుంది. ఇలా ద్రౌపది చుట్టూ



అల్లుకున్న పాత్రలు ధరించే పాత్రధారులు, ఆ అప్సరసను అతి దగ్గరలో చూడొచ్చు. పాత్రపరంగా సంభాషించవచ్చు అని ఉవ్విళ్ళూరుతునే వున్నారు.

నాటకం వెయ్యాలంటే కనీసం అయిదారు వేలు కావాలి ఆరోజుల్లో. స్టేజి కట్టుకోవాలి. డబ్బులు వసూలు చేయటం కష్టమైపోయింది. పెద్ద కేశన్నకు ప్రతిరోజూ కంచి గరుడ సేవలాగా ఇంతమందికి నేర్పటం ఇబ్బందిగానే వుంది. దాదాపు సంవత్సరం రోజులపాటు రిహార్సల్స్ సాగి ఒకరి వెంబడి ఒకరు మానుకోవటంతో నాటకం వెయ్యకుండానే తృప్తి మిగిలిపోయింది. సంవత్సర కాలంపాటు ఏదో రకంగా కాలక్షేపం జరిగింది. ఒక్క పైసా చేతినుండి ఖర్చుకాలేదు. ఊర్లో పిల్లలందరికీ నాటకం మొత్తం నోటికొచ్చింది... అంతో ... ఇంతో... సంగీతజ్ఞానం అబ్బింది. ఏ పద్యానికి ఏ రాగమో..తెలిసింది.... అంతటితో నాటకం ముచ్చట తీరిపోయింది.

ఆ తరువాత చాలారోజుల వరకు నాటకాల జోలికి పోలేదు. అయితే పద్యం రాగం వంటపట్టడం మూలాన కొందరు ఔత్సాహికులు వేరే ఊర్లలో వేసే నాటకాల్లో పాల్గొనేవారు. మళ్ళీ నాటకం ఊసెత్తటం, 'వాసయ్య' సారు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో టీచరుగా వచ్చిన తరువాతనే. ఈయనకు కూడా నాటకాల పిచ్చి బాగానే వుండేది. మంచి రూపం, శ్రావ్యమైన కంఠం, నాయకత్వ లక్షణాలు వుండటం వల్ల మళ్ళీ నాటకానికి అనుకురార్పణ జరిగింది.

ఈసారి రామాంజనేయయుద్ధం తీసుకున్నారు. వాస్య సారు రాముడు, సుబ్బారాయుడు ఆంజనేయుడు, మన్నెం సీతయ్య జాంబవంతుడు, కొత్తగొల్ల నాగన్న అంగదుడు గానుగ పిచ్చాన్న యయాతి, బోయసుబ్బన్న లక్ష్మణుడు, సూదా చిన్నన్న భరతుడు, ప్రభయ్య అంటే నేను, శత్రుఘ్నుడు, ఇలా పాత్రలన్నీ చాలా భాగం కుదిరాయి. నాటకం నేర్పించడానికి బొగ్గులవారి పల్లె పెట్టె నరసింహులు'ను కుదుర్చుకున్నారు. హార్మోనియం వాయిస్తాడు కాబట్టి ఆయనకు ఆ పేరు వచ్చింది. ఈయనకు నెలకు జీతం. సాయంత్రం భోజనం. పిలుచుకుని వచ్చి వదలిపెట్టటం మాట్లాడుకుని నిరంతరంగా రిహార్సల్స్ చేసి మూడు నెలల్లో నాటకం వేశారు.

నాటకానికి స్టేజి కట్టాలని రావిచెట్టు అరుగు ప్రక్కన ఉన్న స్థలంలో నాలుగడుగుల ఎత్తు మట్టి తోలించి, మలహరరావు చిన్న తోటలో ప్రజలు కూర్చునేటట్లు ఏర్పాటు చేసి ప్రార్ధనా గీతం 'పరాబ్రహ్మ... పరమేశ్వర' పాడిన తరవాత గానీ అందరూ స్థిమిత పడలేదు.

ఆజానుబాహుడైన వాసయ్యసారు శ్రీరామచంద్రుడిగా, అప్పటికే ఒకసారి నాటకం ఆగిపోయి అవమానపడి ప్రతీకారంతో రగులుతున్న సుబ్బరాయుడు ఆంజనేయుడుగా పాత్రలలో జీవించి, నాటకాన్ని అందరు కలసి రక్తి కట్టించారు.

లక్ష్మణ భారత శత్రుఘ్నులు ఆంజనేయుని చేతిలో హతమై నిర్జీవులుగా పడివుంటే శ్రీరాముడు వచ్చి ఒక్కొక్కరి దగ్గర వారి ప్రతాపాలను పొగిడి విలపించాలి.


(ఇంకా వుంది)



# కవీ,కలెక్టరు డా.జె.బాపురెడ్డి



తుమ్మూరి రాంమోహన్ రావు



**'ఆ సెలయేటి రూపు**
**ఆ కలువపూల చూపు**
**వెరశి చిరంజీవి బాపు'**

అని జ్ఞానపీఠ పురస్కార గ్రహీత డా. సి.నారాయణరెడ్డి ఆశీస్సులు గొన్న కవి డా.జె.బాపురెడ్డి.ఒకవైపు ఉన్నత విద్యాభ్యాసం చేసి ఐఏయస్ పరీక్షలు రాసి కవెక్టరుగా,కలెక్టరు హోదాలో అనేక ఉద్యోగ బాధ్యతు-లు నిర్వహిస్తూనే మరోవైపు తనలోని కవిని నిద్ర పోనీయకుండా కలం హలంతో కవితా వ్యవసాయం చేసి పలువురి మన్ననలు పొందిన ప్రశ-స్త కవి బాపురెడ్డి.గేయానికి పెట్టింది పేరు కనుకనే బాపురెడ్డి బహుళ గేయాలు ఆకాశవాణి గాయకుల గళాలలో రసాలూరించినవి.శ్రోతల-కు వీనుల విందు గూర్చినవి. నీవూ-నేనూ అనే గేయంలో

**'నీ కన్నుల వెలుతురులో**
**నే కన్నులు తెరచినాను**
**కనులు తెరచి నేనిది భూ**
**లోకమనే మరచినాను'**

కమనీయ మాత్రాచ్ఛందస్సులో ఆయన లేఖిని నుండి ఇలాంటి ఎన్ని గీతాలు సెలయేరులై పారినాయో. బాపురెడ్డి కవిత్వం పద్య,గేయ,వచన కవిత్వ ధారలుగా సాగింది.ఆయన పద్యం చూడండి :

**'నేను కవీశ్వరుండనన నేరను**
**గాని రసార్ద్ర కావ్య ని**
**ర్మాణమె ప్రాణమైన సుకుమారుడ**
**అక్షర భావ శిల్ప సం**
**ధానుడ నిత్యసత్య శుభ దాయక**
**జీవన గానగర్భ సం**
**తానము నేను,నేను పరితప్త జగ-**
**జ్జననీ ప్రసన్నుడన్'**

ఎంత రసరమ్య శబ్ద సంయోజనం. ఎంతటి భావ సంపన్నత,ఎంతటి గానయోగ్యత.

అందుకే సినారె బాపురెడ్డిని అసలు సిసలైన కవి అని నుతించాడు.

కరీంనగర్ జిల్లా సిరికొండ గ్రామంలో 1936 లో జన్మించారు బాపురెడ్డి.శ్రీమతి జంకె రామల-క్ష్మి, శ్రీ జంకె కృష్ణారెడ్డి దంపతులు ఈయన తల్లిదండ్రులు

కృష్ణారెడ్డిగారు సంప్రదాయ మౌఖిక సాహిత్యానికి చెందిన గీతాలను,-గేయాలను,పద్యాలను,శ్లోకాలను కంఠస్థం చేసి పాడటమే గాకుండా స్వయంగా తత్త్వాలను ఆలపిస్తుం-డేవారు.ఆయనసతీమణి రామ-లక్ష్మి గారు ఆయన గానలహరికి స్వరచైతన్యం.ఇలా తల్లిదండ్రుల వారసత్వంగా బాపురెడ్డి గారు పద్యా-న్నీ,గేయాన్ని, తాత్త్వికతనూ రసిక-తనూ,మానవతనూ,నవతనూ తన గళంలో కలంలో సహజంగా పో-

షించుకోగలిగారు.

పద్య గేయ ప్రియుడైన బాపు-రెడ్డి ఆధునిక వచనకవితా నంద-నవనంలో ప్రవేశిస్తూ 'పల్లవి లేని పాట' అనే కవితలో ఏమంటున్నారో చూడండి.

**ఛందస్సు వదలని**
**సంప్రదాయ పద్యంలాంటి**
**సంగీతం లేక కదలని**
**శాస్త్రీయ గేయం లాంటి**
**ప్రియుని కోసం**
**అన్వేషిస్తున్న నన్ను**
**వచనకవిత్వంలా వచ్చి**
**పట్టుకున్నావు నీవు'**

అలాగే 'తమస్సులో మనస్సు' అనే వచన కవితలో

**దేశదేశాలలో**
**కామాగ్ని యజ్ఞాలను**
**దర్శించిన నాకళ్లు**
**కడుక్కుంటున్నాను**
**వేదవేదాంతసారాలలో**
**దేశకాల పారావారాలలో'**

బాపురెడ్డి గారు ఉద్యోగ పరంగా ఆర్డీవో స్థాయినుండి ఆంధ్రప్రదే-శ్ ప్రభుత్వ కార్యదర్శి స్థాయి దాకా అనేక ప్రభుత్వ సంబంధిత శాఖలలో విధి నిర్వహణగావించి పరిపాలనా రంగంలో పదవులకు వన్నె తెచ్చిన ప్రతిభాశాలి.ఉస్మానియా విశ్వవి-ద్యాలయం నుండి ఎం.ఎ.ఎకన-మిక్స్ చేసిన వీరు పలు అంశాల-మీద సర్టిఫికేటు కోర్సులు చేశారు. ఇటు కవితా రంగంలో 1960 లో మొదలైన వీరి కవితా వ్యాసంగం ఇప్పటికీ కొనసాగుతూనే ఉన్నది.

తైతన్యరేఖలు,రాకెట్టు రాయబారం, బాపురెడ్డి గేయాలు,బాపురెడ్డి గద్య-కావ్యాలు,నాదవేదాలు, బాపురెడ్డి పద్యకావ్యాలు, బాపురెడ్డి గేయనాటి-



కలు,అనంత సత్యాలు, శ్రీకారశి-ఖరం, నా దేశం నవ్వుతోంది, ప్రే-మారామం, మన చేతుల్లోనే ఉంది, పంచబాణ సంచా, ప్రణయ ప్రణవం, రంగు రంగుల చీకట్లు, మనసులో-ని మాట, వాడిపోని వసంతాలు,-కాలం మాయాజాలం వంటి ఎన్నో కావ్యాలను వెలువరించారు. వీరి రచనలలో వీరికి పు తెచ్చిన రచన-లలో రాకెట్టు రాయబారమొకటి.

**ఏమిటేమిటీ భూవాసులు**
**నాసీమకు రానున్నారా?**
**నావిశాలనిర్జన భూమికి**
**ప్రాణమ్ములు తేనున్నారా!**

అని అందంగా సాగుతుందీ గేయం. దీనికి డా.బోయి భీమన్న-గారు ముందుమాట రాశారు. వీరు ఉద్యోగరీత్యా మరియు విజ్ఞానయా-త్రగా పలు దేశాలు సందర్శించారు. వీరి కొన్ని పుస్తకాలు విదేశాలలో ఆవిష్కరించబడ్డాయి.

వీరికి పేరు తెచ్చిన మరో ప్రక్రియ గే-యనాటికలు.వీరు పద్నాలుగు దాకా వైవిధ్య భరితమైన గేయనాటికలు వెలువరించారు. అందులో ఒకటి పైన చెప్పిన రాకెట్టు రాయబారం గేయ నాటిక. ప్రధానంగా సంగీత సాహిత్య నృత్య సంభరితం వాటిని రసరమ్యంగా రచించి మెప్పులు పొందిన రసజ్ఞ ప్రతిభాశాలి బాపురె-డ్డి.

ఈయన కృషివైశాల్యం చూడాలం టే ఈయన రచించిన కావ్యాలు చదవడం ఒక ఎత్తైతే ఈయన షష్ట్యబ్ది సంచికలో లబ్ధప్రతిష్ఠులై-నవారెందరో వీరి గురించి రాసిన వ్యాసాలు సమీక్షలు చదవడం మరొక ఎత్తు.మహాకవిగా పేరుపొం-దిన అత్యున్నత పదవులనలరించి-నా నిరాడంబరుడుగా నిర్మల మన-స్విగా,నిశచల తపస్విగా గోచరిస్తారు బాపురెడ్డి.

జూబిలీ హిల్స్ లోని రోడ్ నం 5, లో వీరి ఇంటిముందు నామశిలాఫ-లకం మీద "రామచిలుక" అని ఉంటుంది. పచ్చని చిలుకను ప్రేమించే ఈయను ఆ చిలుక ముద్దు ముద్దు మాటల నయగా-రాన్ని తన కవిత్వం నిండా పేరుస్తా-డు. కొండ అద్దమందు అన్నట్లు కొండంత కవి కుదించిన వ్యాసంలో కొంత మాత్రమే చూపగలం తెలంగాణా కవులలో అనర్ఘరత్నం డా.జే బాపురెడ్డి.

# మతలబుల మనిషి

## ఎలెక్ట్రాన్



అమెరికా పశ్చిమతీరంలోని లాస్ ఏంజిల్స్లో ఓ సీతాకోకచిలుక రెక్కలాడిస్తే, భారత్ తూర్పుతీరం విశాఖపట్నంలో తుఫాను రావడమనేదాన్నిబట్టర్ఫ్లై ఎఫెక్ట్ అంటారు. ఉదాహరణలు ఎన్నయినా కల్పించుకోవచ్చు. జాంపేటలో ఓ కులానికి చెందిన అమ్మాయి మరో కులానికి చెందిన ఎవరితోటే లేచిపోతే, సోంపేటలో సంబరాలూ, రాంపేటలో కొట్లాటలు జరగడమన్న మాట! బలవంతులైన అమెరికా, రష్యా, చైనా అధ్యక్షులు, బ్రిటన్ ప్రధాని మంత్రి ఏవైనా మాట్లాడితే, అవి సున్నితమైన ఆర్షసంప్రదాయం పాటించే మన దేశాన్ని అతలాకుతలం చేసి, కుహనామేధావుల చర్చలు ప్రసారవాహినుల్లో హోరెత్తిపోతాయి! ఇవి భౌగోళిక రాజకీయప్రభావాలు. ఆంగ్లవాడకంలోని కాజ్ అండ్ ఎఫెక్ట్ ని కాస్త తర్జుమా చేసి తెలుగులో చెప్పే కార్యకారణ సంబంధాలు. అంతర్గతంగానూ, దేశీయంగానూ చూస్తే-కేరళలో వాయసం అరిస్తే, పశ్చిమ బెంగాల్లో బెబ్బులి గాండ్రిస్తుంది. దేశమంతా విస్తృతమైన హిందీ చలనచిత్రరంగంలో ఎవరైనా వందకోట్ల ఖర్చుతో చిత్రనిర్మాణం కావిస్తే, ప్రాంతీయమైన భాషలో వందలకోట్ల రూపాయలతో చిత్రనిర్మాణం జరుగుతుంది. బెంగళూరు జైల్లో చెన్నై చంద్రవంకకి చిత్రాన్నం వండి పెడ్తే దేశమంతా గగ్గోలు పెట్టేస్తుంది. ప్రతిపక్షంలోని అభ్యర్థి తన భవిష్యత్తుని గుర్తించి, ఆలోచించి, పాలకపక్షానికి తన ఓట్ల స్థానబలిమి చూపి, గోడదూకి, మంత్రి పదవి సాధిస్తే, సవ్యంగా నడిచే పాలనాశకటం దారితప్పి కుదుపుల బాటమ్మట పయనించడం జరుగుతుంది. గ్రహచారం బాగోలేకపోతే దీపావళినాడు పెనుగాలి విస్తుంది. అలాంటిది, ఓ సీతాకోకచిలుకే ఎక్కణ్ణుంచో వచ్చి మన మధ్యనే వాలితే ఇక ఆ ప్రభావం ఎలా ఉంటుందో చెప్పడం కష్టం.




సరిగా మా విశాఖపట్నం ప్రాంతీయసంస్థలో ఇలాంటి పరిస్థితే నెలకొంది. మాది ప్రభుత్వరంగంలోని ఓ సాంకేతిక కార్పొరేట్ వ్యవస్థ. దేశమంతటా పలుప్రాంతాలలో పరిశోధన, నిర్మాణ, ఉత్పత్తి కార్యక్రమాలు జరుగుతాయి. నేను విశాఖ ప్రాంతీయ కేంద్రానికి ఆధిపత్యం వహించే స్థాయికి రెండు మెట్లు దిగువస్థాయిలో ఉన్న సాంకేతిక నిపుణుణ్ణి. డిజైనింగ్ అంటే రూపకల్పనలు నా పరిధి. అత్యవసర పరిస్థితుల్లో పరికరాలకి మెట్రవడ్రం లేదా మధ్యేమార్గం పరిష్కారాలు చూపించే బాధ్యత కూడా నాదే. మరో ఇద్దరు నా స్థాయిలోనే ఇతర విభాగాల్లో ఉన్నారు. ఒకరు మంగపతి. యాంత్రిక విభాగానికి

అధిపతి. మరొకరు చంద్రనాథ్ బిహారీ. రసాయనిక విభాగానికి అధిపతి. మా ముగ్గురి మధ్యా సయోధ్య ఉన్న కారణంగా మేము పైవాళ్ళకి తలనొప్పి తెప్పించే పరిస్థితుల్ని ఎప్పుడూ కలగచెయ్యలేదు. బిహారీ కిషన్ గంజ్ వాడు. అది బీహారులో ఉంది. బిహారీకి విశాఖపట్నం ఎంతగానో నచ్చేసింది. కంపెనీ ఋణం మీద ఓ ఫ్లాట్ కూడా తీసుకొన్నాడు. తల్లిదండ్రులు కూడానే ఉంటారు. అతని కూతురూ, కొడుకూ విశాఖలోని ఓ జూనియర్ కళాశాలలో చదువుకొంటున్నారు. మంగపతిది కరీంనగర్. నాది కాకినాడ దగ్గరి పెద్దాపురం.

ఉన్నట్టుండి బిహారీకి పాట్నా బదిలీ అయింది. అతను చెన్నై నుంచి వచ్చి రెండు సంవత్సరాలు కూడా కాలేదు. వయసు మీరిన తల్లిదండ్రుల్ని ఎప్పుడూ తనవద్దనే విధిగా ఉంచుకొంటాడు కాబట్టి ఆ విషయమై అతనికి ఇబ్బంది లేకపోయినా, స్వల్పవ్యవధిలో బదిలీ అంటేమట్టుకు పిల్లల చదువుకి ఆటంకం కలుగుతుంది. విద్యార్థి దశలో ఇంటర్ కీలకమైనది. తల్లిదండ్రులుకూడా శ్రద్ధ వహించవలసిన సమయం. ఆదుర్దాపడదగ్గ విషయం. బిహారీ వెళ్ళి మా పెద్దాయన భజరంగ్ మరాఠీని కలుసుకొన్నాడు. "ఉత్తర్వులు వచ్చిన వెంటనే, నేనే కేంద్రంతో మీ బదిలీని ఆపమని మాట్లాడాను. కానీ తప్పనిసరి పరిస్థితుల్లో మి-



మ్మల్నిబదిలీ చేయాల్సి వచ్చిందనీ, దాన్ని గురించి ప్రస్తావన ఇక పొడిగించకుండా వీలైనంత త్వరలో విడుదల చేసేయండి అన్న మొండి సమాధానం వచ్చింది. మీకిక్కడ స్వంత ఫ్లాట్ ఉంది. ఇంకొక ఏడాదిలో మీ ఇద్దరి పిల్లల చదువూ ఇంటర్ దాటుతుంది. మీ కుటుంబాన్ని ఇక్కడ వదిలేసి వెళ్ళండి. వాళ్ళ క్షేమ సమాచారాలు చూసే బాధ్యత నాది. మంగపతీ, శర్మా మీ పిల్లల చదువు మీద ధ్యాస నిల్పుతారు!" అని ఆయన బిహారీకి చెప్పారు. శర్మా అనే ఆ ఘటాన్ని నేనే. పెద్దాయనే అంత నిస్సహాయంగా మాట్లాడుతోంటే, ఏవో రాజకీయ పరమైన ఒత్తిళ్ళు అటు కేంద్రంలోని అధికారులమీద వచ్చి ఉండాలనుకొన్నాం.

బిహారీకి స్వంత రాష్ట్రంలోకి వెళ్ళడానికి ఇష్టం లేదు. అయినా ఆజ్ఞాబద్ధుడు. మరి గొడవ చెయ్యకుండా రాజీపడిపోయి, నిశ్చింతగా కుటుంబాన్ని విశాఖలోనే వదిలి పాట్నా ఒంటరిగా వెళ్ళిపోయాడు. మా సంస్థ కేంద్రపట్టణంనుంచి రమాకాంతం అనే అతను రెండు రోజుల్లోనే సుడిగాలిలా వచ్చి, బిహారీ జాగాలో చేరాడు. అతగాడిది విశాఖ జిల్లానే. చేరిన సాయంత్రానికే చాలామందికి రమాకాంత్ 'కాంత్ సాబ్' అయిపోయాడు. ప్రాంతీయాభిమనేదానికి బహురూపాలు.

వ్యక్తి గతమైన పరిచయం లేదుకానీ అతన్ని గురించి చాలానే విన్నాం. అతగాడు ఉద్యోగపర్వం ప్రారంభంలో సంస్థలోని రసాయనిక విభాగంలో చేరాడు. కొద్దికాలంలోనే రొట్టెకి ఏ వైపు వెన్నరాసుంటుందో తెలుసుకొని, మానవ వనరుల శాఖలో అడుగుపెట్టాడు. మా సంస్థ పాలకమండలిలోని మానవవనరుల శాఖ మెంబరుకి సహాయకుడిగా పనిచేసేవాడు. సహజంగా ఇటువంటి వారు సంబంధిత మెంబర్లకి నిత్య సంపూర్ణ సమాచారవాణిలుగా ఉండడమే కాకుండా, వాళ్ళ పేరిట చక్రం తిప్పుతారు. తమంతటివారు లేరనుకొంటారు. అందుచేత కేంద్రస్థానం నుంచి బదిలీమీద వచ్చిన వారంటే ప్రాంతీయాధికారులు కూడా కాస్త జాగ్రత్తగా ఉంటారు. అందులోనూ రమాకాంత్ కి జిల్లావాసి ముద్రకూడా ఉందాయే.

రమాకాంత్ నైజం రెండురోజుల్లో తేలిపోయింది. కిందివాళ్లని గుట్టుగా రెచ్చగొట్టి పై వాళ్లనీ, సహోద్యోగుల్నీ ఇరుకులో పెట్టడం అతనికో సరదా. రాజకీయాలాడేవారి ప్రధాన లక్షణం ఇదే కదా? అంటే మానిప్యులేషన్ అన్న

మాట! అసాధ్యమైన విషయాల గురించి ప్రజల్ని రెచ్చగొట్టి ఆందోళనలు లేవదీయడం సర్వసాధారణం. నెగ్గితే మహానాయకుడు. ఓడితే వెన్నోడ్డి పోరాటం సాగించిన ధీశాలి. ఆందోళన గంగపాలైనా, ప్రభుత్వ ఆస్తులు ధ్వంసమైనా వ్యక్తిగతమైన పరపతి మట్టుకు ఆకాశాన్నంటుతుంది. రమాకాంత్ జన్యు నిర్మాణం అటువంటిదే మరి. నియమితులైన ఊరూ పేరూ లేని పరరాష్ట్ర పార్టీ నాయకుల పర్యవేక్షణలో, మన రాష్ట్రరాజకీయాలను, భవిష్యత్తునీ శాసించడానికి పూనుకోవడం అనుభవమే కదా?

రమాకాంత్ చేరిన పక్షం రోజుల్లోనే సాంకేతిక కర్మచారులకు శిక్షణా కార్యక్రమాలు, పునఃశ్చరణ తరగతులు విరివిగా జరగాలనీ, వాటిపట్ల మా విశాఖకేంద్రం సరైన చర్యలు చేబట్టడం లేదనీ సాంకేతిక కర్మచారులు ఆందోళన లేవదీశారు. ఆందోళనకి మూలకారకుడెవరో తెలిసినా, వేలెత్తి చూపలేని ఇబ్బంది. కర్మచారులను సులువుగా సమాధానపర్చలేని పరిస్థితి. రమాకాంత్ మా మీదా, మా పై యాజమాన్యం మీదా ఓ అస్త్రం పరోక్షంగా సంధించాడు. ఇది కేవలం తన సత్తా చాటించుకోవడానికే.

కర్మచారీసంఘనాయకుడు నరసింహుల్ని పెద్దాయన భజరంగ్ మరారీ పిలిచాడు. పిలిచి ఓ దస్త్రం నరసింహులుకిచ్చి చదవమన్నాడు. అందులో కర్మచారుల శిక్షణ విషయమై రాసిన పది ఉత్తరాలున్నాయి. అవి ఇటునుంచి వ్రాసినవీ, అటునుంచి సమాధానాలు వచ్చినవీ. విశాఖసంస్థ స్థిరంగా నడుస్తోందని, ఆ కారణంగా ప్రస్తుతం ఇతర కేంద్రాలమీద దృష్టి సారించడం జరుగుతోందని, ఏవైనా నూతన ప్రణాళికలు ప్రవేశపెట్టినప్పుడు తప్పక దృష్టి పెడతామని వాగ్దానాలు. సంతకం సంబంధిత మెంబర్ దే అయినా ఆ సమాధానాల వెనకనున్న వ్యక్తి కేంద్రంలో మానవవనరుల శాఖలో పనిచేసిన రమాకాంతే! ఈ విషయాన్ని భజరంగ్ మరారీ కర్మచారీ సంఘనాయకుడికి సూటిగా చెప్పలేదు కానీ, నరసింహులు గుర్తించ కలడేమోనని ఆశించాడు.

ఒకవేళ గుర్తించినా, ఆ భావాన్ని మట్టుకు నరసింహులు వ్యక్తం చేయలేదు. తన వాదన కొనసాగించాడు. “సర్! హరిద్వార్ ప్లాంట్ నుంచి అయిదుగుర్నికోల్కతా శిక్షణ కోసం పంపించారు.”

భజరంగ్ మరారీకి చిర్రెత్తుకొచ్చింది. అయినా తమాయించుకొని నిదానంగా అన్నాడు.

“హరిద్వార్ ప్లాంట్లో ఉన్న ఆ యంత్రాలు మన ప్లాంట్ లో లేవు. వాటిని కోల్కతాలో ఉన్న గార్డెన్ రీచ్ వర్క్ షాప్ వాళ్ళు తయారు చేశారు. ఇదివరలో పూణేలో ప్రారంభిస్తున్న కొత్త ప్లాంట్ కి చండీఘర్లో ఉన్న ఒక భారీ ఇంజనీరింగ్ పరిశ్రమ యంత్రాలని తయారు చేసింది. శిక్షణకోసం మన ప్లాంట్ నుంచి కూడా ఇద్దర్ని పంపమన్నారు. తీరా పేర్లు సూచిస్తే, 'వాళ్ళకి బదిలీ అయిపోతుంది, పిల్లల చదువులు పాడైపోతాయి, కుదరదు,' అని పేచీ పెట్టారు! పోనీ ఎవరైనా సిద్ధంగా ఉన్నారా అని అడిగితే ఎవరూ ముందుకు రాలేదు. ఆ అవకాశాన్ని కొచ్చిన్ ప్లాంట్ వాళ్ళు చక్కగా వాడుకొన్నారు! నాణేనికి రెండువైపులా మీదే నంటే ఎలా? పారిశ్రామిక సురక్షా, భద్రతా నియమాలపై నవంబరులో హిందూస్తాన్ షిప్ బిల్డింగ్ యార్డ్ లో ఓ వారం రోజులపాటు జాతీయ స్థాయి శిక్షణా కార్యక్రమం జరుగుతోంది. మిగిలిన ప్రాజెక్టునుంచి ఇద్దరేసి వస్తారు. స్థానికంగా ఉన్నాము కాబట్టి దానికి నలుగుర్ని పంపమన్నారు. పేర్లు కావాలి. మీరే సూచించండి.”

"సర్! ఇటువంటి చిలక్కొట్టుడు శిక్షణాకార్యక్రమాల వల్ల మాకు ఒరిగేదేమీ లేదు! మీరు కేంద్రంతో మన విశాఖకేంద్రం విస్తృతికీ, అభివృద్ధికీ గట్టిగా పోరాడటల్లేదు."

"ఏ పరిశ్రమలోనైనా సురక్షా, భద్రతా నియమాల పునఃశ్చరణ చాలా అవసరమన్న సంగతి మీరు విస్మరించడం నాకు విస్మయం కలిగిస్తోంది. ఇక పోతే గత మూడు సంవత్సరాలుగా మన కేంద్రం లక్ష్యానికి మించి పదిశాతం అధిక ఉత్పాదనలు చేసింది. మీకందరికీ చక్కటి బోనస్ లు లభించాయి. వసతిగృహ నిర్మాణం జరుగుతోంది.

ఇది అభివృద్ధి కాదా?"

"సర్! పూణేలో కొత్త విభాగాన్ని ప్రారంభించారు! అలాగే ఇక్కడకూడా ఏదైనా కొత్తవిభాగం ప్రారంభించవలసిందిగా ఎందుకు ప్రయత్నించటల్లేదు?"

ఇదంతా రమాకాంత్ ఉద్బోధల మహాత్మ్యమే!

"కేంద్రపాలక మండలి ప్రణాళికల్లో మన విశాఖకేంద్రం విస్తృతిని గురించి పరిశీలనలు జరుగుతున్నాయి. ప్రస్తుతం ఇక్కడ వసతిగృహ నిర్మాణం జరుగుతున్న మూలాన వార్షిక నిధుల పంపిణీలో కొన్ని సమస్యలు తలెత్తుతున్నాయి. అవి తీరగానే మీ కోరిక నెరవేరొచ్చు. రాష్ట్రవాసులకు కార్మికనియమాలప్రకారం దిగువస్థాయి ఉద్యోగాలు దొరకుతాయి. ఆఫీసరు స్థాయి ఉద్యోగాలు కేంద్ర సంస్థ నిర్వహించే అర్హత పరీక్షల ద్వారా జరుగుతాయి."

ఇది రమాకాంత్ విసిరిన ముందరకాళ్ళ బంధమేనని తర్వాత తేలింది. వాస్తవానికి కెనడా నుంచి విశాఖకేంద్రానికి అధునాతనమైన పరికరాల్ని సమకూర్చే ప్రణాళికకు అంగీకారం లభించింది. ఈ సంగతి అతి గోప్యంగా ఉంచబడింది. మాకూ తెలియదు. కేంద్రంలో ఉన్న రమాకాంత్ కి తెలుసు కాబట్టి, తన అసలు రసాయినిక విభాగానికి, అందులోనూ విశాఖకేంద్రానికి బదిలీ చేయించేసుకొన్నాడు. మహాలౌక్యుడు. అయితే ఈ విదేశీ శిక్షణాకార్యక్రమం చెప్పుకోడానికి ఆకర్షణీయంగా కనిపించినా, అభ్యర్థుల ఎంపికమట్టుకు ఏమంత సులువైనది కాదు. రకరకాల మలుపులు తిరిగి తలకి రోకళ్ళు చుట్టేస్తుంది. విదేశీ యానం. డాలర్లలో దినభత్యాలు. సిఫారసులు, పైరవీలు, తదితర కారణాలు. తత్కారణంగా అసంతృప్తి సెగలు.




ఈ పరికరాల్లో యంత్రాల భాగం ఒకటైతే, అవి కొనసాగించే రసాయినిక ఉత్పత్తి చర్యలు మరొక భాగం. సంఘటితమైన శిక్షణా కార్యక్రమం అవసరం. అందుకని ఇరు విభాగాల నుంచీ ఆఫీసరు స్థాయి ఉద్యోగుల్ని పంపాలి. శిక్షణా కాలం మూడు నెలలు. ఆరుగురు ఆఫీసర్ల పేర్లను సూచించవలసిందిగా ఉత్తరం రావడంతో గందరగోళం మొదలైంది.

తను కేంద్రంలో పనిచేస్తున్నప్పుడే ఈదస్త్రాన్నిముందుకుతోలడంలో శ్రమించాడని రమాకాంత్ వేసుకొన్న తొలి దండోరా! విదేశీ శిక్షణాకార్యక్రమాల్లో పంపించబడేవారు బాధ్యతాయుతులై, సులభసంధాగ్రాహ్యులై ఉండాలి. ఒక్కోప్పుడు సీనియారిటీని పక్కన పెట్టేయాల్సి వస్తుంది. భజరంగ్ మరాఠీ అదే పని చేశాడు. మెరికల్లాంటి ఆరుగురు యువ ఆఫీసర్లని ఎంపిక చేసి పేర్లు కేంద్రానికి పంపాడు. ముగ్గురు యంత్రవిభాగం నుంచీ, ముగ్గురు రసాయినిక విభాగం నుంచి. ఈ ఎంపికలో భజరంగ్ మరాఠీ కొద్ది రోజులక్రితమే వచ్చి చేరిన రమాకాంత్ అభిప్రాయం తీసుకోలేదు. ఆ అరుగురూ అప్పటికే తమ ప్రతిభని చాటుకొని ప్రశంసాపత్రాలు, పతకాలూ సాధించి అందరి మన్ననలూ పొందినవారు.

కర్మచారీ సంఘం ఈ తర్ఫీదులో తమకీ చోటుండాలని ఆందోళనకు దిగారు. 'రేపు ప్లాంట్ ని నడిపేది మా కర్మచారులే! ఆఫీసర్లు చేసేది అజమాయిషేలే! అందుకని సంఖ్యని పదికి పెంచి నలుగురు ఆఫీసర్లని, ఆరుగురు సాంకేతిక కర్మచారుల్నీపంపించండని' గొడవ చెలరేగింది. దానికి రమాకాంత్ బహిరంగంగానే ఊతమిచ్చి ఓ దస్త్రం కది-

లించాడు.

'రమాకాంత్ అభిప్రాయంతో ఏకీభవిస్తున్నాను. మన సంస్థ ఈ కోణంలో కూడా ఆలోచిస్తే అన్ని విధాలా ప్రయోజనముంటుంది. అయితే మొదట్లో పంపిన ఆరుగురు ఆఫీసర్లనీ అలాగే ఉంచి, ఆరుగురు సాంకేతిక కర్మచారుల్ని జోడించి మొత్తం పన్నెండుమందిని పంపిస్తే మంచిదిగా ఉంటుంది' అని భజరంగ్ తన సిఫారసు జోడించి పంపించాడు.

అదీ తన ఘనతగానే చెప్పుకొన్నాడు రమాకాంత్. నెల తర్వాత కేంద్రం నుంచి ఎంపిక కాబడ్డ వ్యక్తుల జాబితా వచ్చింది. ఆరుగురి జాబితా. రమాకాంత్ బృంద నాయకుడు. ఇద్దరు దిగువస్థాయి విశాఖ కర్మచారులు ఎంపిక కాబడ్డారు. ఈశాన్య రాష్ట్రాలలో తమ నిర్ణీత గడువు ముగించుకొని బదిలీ కోసం ఎదురు చూస్తున్న ముగ్గురు ఆఫీసర్లని ఎంపిక చేయడం జరిగింది. శిక్షణ పూర్తయిన తర్వాత వారిని విశాఖకి బదిలీ చేస్తారన్నమాట. అడిగిందల్లా ఇచ్చేస్తే కేంద్రం బలహీనమైపోతుంది కదా? విదేశీమారకద్రవ్యం పరిమితులు-కూడా ప్రతిబంధకంగా ఉంటాయి మరి.

కొంత అసంతృప్తి చెలరేగినా భజరంగ్ మరాఠీ ఓ దార్పు మాటలతో ఇక్కడి ఆఫీసర్లు విజ్ఞతతో కుదుటబడ్డారు.

బృందమంతా కెనడా పోయింది.



శిక్షణాకార్యక్రమం ముగిసే నాటికి కేంద్రం నిర్ణయం మారిపోయింది. విశాఖలో నెలకొల్పాల్సిన కొత్త అదనపు ప్లాంట్ ని ఈశాన్య రాష్ట్రాలకి తరలించేశారు. కెనడా నుంచి తిరిగి రాగానే, కొత్త నిర్ణయాన్ని తెలుసుకొన్న రమాకాంత్ ఏడుపు మొహంతో ఈశాన్యరాష్ట్రాలకి పోవాల్సి వచ్చింది. అక్కడి ముగ్గురు ఆఫీసర్లూ అక్కడే ఉండిపోవాల్సి వచ్చింది. మూణ్ణెల్ల శిక్షణా కార్యక్రమం కోసం, తదుపరి విశాఖ బదిలీ కోసం గతంలో రమాకాంత్ తో పైరవీలు సాగించి, సాధించిన ఆ ముగ్గురు తెలుగు బిడ్డల మెడల్లో మరో మూడు సంవత్సరాలు అక్కడే ఉండిపోవాల్సిన గుదిబండలు దిగబడ్డాయి. విశాఖ నుంచి గోలపెడ్తూ వెళ్ళిన ఇద్దరు కర్మచారుల్నీ అక్కడి కర్మచారి సంఘాలు కార్మిక నియమాల ప్రకారం విధుల్లో చేరకుండా అడ్డు తగలడంతో, నాలుగు తన్నులు తిన్నా, నవ్వు మొహాలతో వెనుదిరిగారు. వాళ్ళకి కెనడా బాబులని సహోద్యోగులు నామకరణం చేసేశారు. అయితే వారు కెనడాలో పనిచేసే క్రమబద్ధమైన తీరుతెన్నులను గురించి చెబ్తూ, ఇక్కడా అమలుపర్చడానికి నడుము బిగించారు. "సాంకేతిక పరమైన వీరి శిక్షణ వ్యర్థమైపోయినా, క్రమశిక్షణ నేర్చుకొని వచ్చారు. ఇది చాలా చాలా సంతోషించ దగ్గ విషయం. కానీ రమాకాంత్ లాంటి కుటిల నీతిజ్ఞుడి తలనొప్పి మనకి తగ్గింది. ఇది మరింతగా సంతోషించవలసిన విషయం!" అన్నాడు భజరంగ్ మరాఠీ!

ఈ చదరంగపుటెత్తు భజరంగ్ మరాఠీ మహాశయుడి గారిదేమో అనుకొన్నాం కానీ, కాదని తేలింది. రాష్ట్రాల రాజకీయాలు ప్రభుత్వరంగ సంస్థల్లో ఎన్నో సీతాకోకచిలుక ప్రభంజనాలు సృష్టిస్తాయి. ఈశాన్య ఋతుపవనాలు దారిమళ్లి ఉత్తరాన ఉన్న దేశరాజధాని మీదుగా మా సంస్థ కేంద్రంలో తమ ప్రభావాన్ని చూపాయి. మతలబుల రమాకాంత్ సాబ్ ఆ ప్రభంజనంలో కొట్టుకు పోయాడు. మానిప్యులేటర్ భస్మాసురిడి మాదిరి తన నెత్తిమీద తానే చేతులు వేసుకోవాల్సి వచ్చింది. ఏది ఏమైనా ఉన్న మాట చెప్పుకోవాలి. ఈశాన్యరాష్ట్రాల సాంకేతిక అభివృద్ధిని దేశవాసులందరూ స్వాగతించాలి. అయితే రమాకాంత్ అక్కణ్ణుంచి త్వరగా బయటపడ్డానికి ఏ ప్రభంజనం సృష్టిస్తాడో తెలియదు.

భజరంగ్ మరాఠీ చంద్రనాథ్ బిహారీకి వాపసు బదిలీ చేయించేశాడు.

# ప్రహేళిక

## జవాబు చెప్పగలరా?

ఈ క్రింది వాక్యములలోని ప్రతి అక్షరము, అసలు అక్షరమునకు బదులు వేరే అక్షరము వాడబడినది. ఉదాహరణకు, 'క' అనే అసలు అక్షరం బదులు 'ర' అనే అక్షరం వాడారని మీరు అనుకుంటే, ఈ వాక్యములలో ఎక్కడ 'ర' వచ్చినా దాని అసలు అక్షరం 'క' మాత్రమే అవుతుంది. వత్తులు, గుణింతాలు అన్నీ అన్వయిస్తాయి.

మీరు చెయ్యవలసినదల్లా అసలు వాక్యాన్ని కనుక్కోవడమే. ప్రయత్నించండి.

**ఆధారాలు : 1) క = అసలు అక్షరం 'ల'; 2) శ = అసలు అక్షరం 'న'**

**సకబుగో బెశసేదు బామిణాగరుశై**
**అయరీయ శియుమిండు ఎచిదాన కేయు**
**తచ్చికో సిమపూదు లశ్మైలువురరుశై**
**శీ డమజ లరకాక శకితిబోశీసా**

(మీ జవాబు teega51@ gmail. com కి పంపించండి.)

**గతనెల జవాబు :**

చేతులు బాగా కడుక్కోండి
కరోనా వ్యాప్తిని అరికట్టండి
చేతులతో కళ్ళు ముక్కు
నులుముకోకండి

మార్చి నెల ప్రహేళికకు సరియైన జవాబు పంపినవారు:

1) శ్రీ కోడీహళ్లి మురళీమోహన్,
2) Ms స్వర్ణకుమారి
3) శ్రీ పాటిబళ్ల శేషగిరిరావు
4) Ms జొన్నలగడ్డ అనూరాధ సాయి
5) Ms పొన్నాడ సరస్వతి
6) శ్రీ తల్లాప్రగడ మధు







RNI No. TELTEL/2011/39497 APRIL2020 Postal No. HSE/1043/2017-19

Date of Publishing 1st April Date of Posting 8th April



Published, Edited and Printed by T.Shanti at Flat no. 45058, Janapriya Utopia, Hyderguda, Attapur, Hyderabad - 500 048, Phone: 94905 71297 / 94401 47993 email: teega51@gmail.com (www.chaitanyam.net) Printed at Planographers, 5-8-300, Chirag Ali lane, Abide, Hyderabad-500001